
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఇజ్రాయెల్ - అమెరికాపై
**దాడులు ఆగవు** **02**
ఇరాన్ కొత్త నాయకత్వం సంకేతాలు
క్షిపణులను అడ్డుకున్న ఖతార్,టర్కీ, యుఎఇ
ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌కు తీవ్రనష్టం
ఖతార్ తీవ్ర హెచ్చరిక

సంపుటి 28, సంచిక: 256 | మంగళవారం | 10-03-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00



ఇరాన్ సుప్రీంగా

## మొజ్తబా బాధ్యతలు స్వీకారం

- నాయకత్వంపై విధేయత ప్రకటించిన ఐఆర్‌జిసి
- గల్ఫ్ దేశాల సహకారం, సమర్థత నిరూపణే సవాలు

**టెహ్రాన్:** అలీ ఖమేనీ కుమారుడు, మతవాది మొజ్తబా ఖమేనీ (57) ఇరాన్ సర్వాధినేతగా బాధ్యతలు తీసుకున్నారు. 88 మంది సభ్యులు గల ఇరాన్ అత్యున్నత న్యాయ నిపుణుల మండలి మొజ్తబాను దేశ సర్వాధినేతగా నియమించింది. తండ్రి అధికార వారసత్వ బాధ్యత లు మొజ్తబా చేపట్టడంతో, ఎట్టిపరిస్థితుల్లో నూ యుద్ధం ఆగదని అమెరికా–ఇజ్రాయెల్ నాయకులకు ఇరాన్ సంకేతాలు పంపించిం ది. ఇరాన్ మతరాజ్య వ్యవస్థను చెక్కుచెదరకుండా కొనసాగించేందుకు యుద్ధ ఘర్షణ లు, బెదిరింపుల మధ్య జరిగిన ఈ నియామ కం అంతర్జాతీయంగా అందరి దృష్టినీ ఆకర్షించి చర్చనీయాంశమైంది. తండ్రి అలీ ఖమే నీ 37 సంవత్సరాలు ఇరాన్‌ను పరిపాలించా రు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ (1979) ఆవిర్భవించిన తర్వాత ఆ దేశానికి మూడవ సర్వధినేత మొజ్తబా. యుద్ధం మొదలైన తర్వాత బాహ్యప్రపంచానికి కనపించకుండా కనుమరుగైన మొజ్తబా తరువాయి 2లో



పశ్చిమాసియాలో పరిస్థితులు

# దౌత్యం-చర్చలే పరిష్కారం

- శాంతి చర్చలకు భారత్ పిలుపు
- యుద్ధాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నాం
- భారతీయుల సంక్షేమం, భద్రతే ప్రథమ ప్రాధాన్యం
- తీవ్ర నిరసనల మధ్య ఉభయసభల్లో జైశంకర్ ప్రకటన
- ప్రతిపక్షాల ఆందోళనతో లోక్‌సభ నేటికి వాయిదా
- రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో శాంతి సాధనకు భారత్ చర్చల ప్రతిపాదన చేసింది. అమానవీయ యుద్ధాన్ని ప్రోత్సహిస్తూ పశ్చిమాసియాపై అనుసరిస్తున్న లొంగుబాటు వైఖరిని ప్రతిఘటించిన ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య పార్లమెంటు ఉభయసభల్లో కేంద్ర ప్రభుత్వం ఈ స్వీయ ప్రకటన చేసింది. విరామం తర్వాత తిరిగి ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల మొదటిరోజు సోమవారం విదేశీ వ్యవహారాల శాఖామంత్రి ఎస్.జైశంకర్ ఉభయసభల్లో ఒకే విధమైన ప్రకటన చేశారు. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పారద్రోలాలని, సేనలు వెనక్కుమళ్ళి దాడులను నిలిపివేయాలని భారత్ కోరింది.అపరిష్కృతగా ఉన్న సమస్యలన్నింటికీ దౌత్యం–సంభాషణలే పరిష్కారమని చెబుతూ పశ్చిమాసియాలో ఉన్న కోటిమంది భారతీయుల భద్రతకే ప్రధాన ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేసింది. ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాజ్యసభ నుండి ప్రతిపక్ష ఎంపిలు తరువాయి 2లో

డొల్ల ప్రకటన : సందోష్ కుమార్ 12



## కొత్త మార్గాల్లో నేరాలు పోలీసులకు సవాళ్లు

- ఏ సమస్య వచ్చినా పోలీసులవైపే ప్రజాచూపు
- మెరుగైన సేవలందించడం ద్వారానే పోలీసు శాఖకు గౌరవం
- శాంతిభద్రతలే రాష్ట్రాభివృద్ధికి పునాది : రిట్రీట్‌లో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు అత్యంత కీలకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొదట చూసేది పోలీసుల వైపేనని ప్రజలకు మెరుగైన సేవలందించటం ద్వారానే పోలీసుశాఖకు గౌరవం పెరుగుతుందన్నారు. నేరాలు కొత్త కొత్త మార్గాల్లో జరుగుతుండటంతో పోలీసులకు సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. పోలీసు అకాడమీలో రెండు రోజుల పాటు తెలంగాణ పోలీసు అధికారుల కోసం నిర్వహించిన రిట్రీట్2026 కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీసులు చేస్తున్న కృషిని అభినందించారు. మనం ప్రస్తుతం ఎక్కడ ఉన్నామో తెలుసుకుంటేనే భవిష్యత్తులో ఎక్కడికి చేరుకోవాలో స్పష్టత వస్తుందని తెలిపారు. అందుకే ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా పోలీస్ శాఖ ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై విశ్లేషణ చేసుకున్నామని చెప్పారు. సవాళ్లు రెండు రకాలుగా ఉంటాయని సిఎం పేర్కొన్నారు. ఒకటి సాంకేతిక సవాళ్లు కాగా మరొకటి పరిస్థితులకు అనుగుణంగా మారాల్సిన సవాళ్లని తెలిపారు. వనరులు, సమయం కేటాయిస్తే సాంకేతిక సవాళ్లను అధిగమించవచ్చని, అయితే పరిస్థితులకు అనుగుణంగా ఎదురయ్యే సవాళ్లను లోతుగా అర్థం చేసుకుని తరువాయి 2లో

ఒలింపిక్ లక్ష్యంతో రాష్ట్రంలో క్రీడా సదుపాయాలు 03

పశ్చిమాసియా పరిస్థితిపై చర్చకు

## ఎందుకు అనుమతివ్వట్లేదు?

ప్రభుత్వంపై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ :** పార్లమెంటులో పశ్చిమాసియా పరిస్థితిపై చర్చకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీని ఎలా బ్లాక్ మెయిల్ చేశారో, ఎలా రాజీ పడ్డారో అనేది బయటపడుతుందనే భయంతో చర్చకు అంగీకరించడం లేదని విమర్శించారు. ప్రధాని పార్లమెంట్ నుండి పారిపోయారని, సభలోకి రాలేదని రాహుల్ అన్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం వంటి అంశాలతో ముడిపడి ఉన్నందున పశ్చిమాసియాపై చర్చ జరగాలని అన్ని ప్రతిపక్ష పార్టీలు కోరుకుంటున్నాయని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 'ఇవి మేము ముఖ్యమైనవిగా భావిస్తున్న తరువాయి 2లో



డిజిటల్ అరెస్ట్..

## టార్గెట్ రిటైర్డ్ జడ్జి రూ.1.66 కోట్ల టోకరా

- హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన ఘటన

ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ నేరగాళ్లు రోజు రోజుకూ రెచ్చిపోతున్నారు. డిజిటల్ అరెస్ట్‌ల పేరిట అమాయకులను ముంచేస్తున్నారు. చదువుకున్న వ్యక్తులు సైతం ఈ డిజిటల్ అరెస్ట్‌లకు బలవుతున్నారు. తాజాగా అలాంటి ఓ ఘటన హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. సైబర్ కేటుగాళ్లు ఈ సారి ఏకంగా రిటైర్డ్ జడ్జీని తరువాయి 12లో

## రాజ్యసభ సభ్యులుగా సింఘ్వి, వేం నరేందర్‌రెడ్డి ఏకగ్రీవం



శాసనసభ ప్రాంగణంలో ఎన్నిక పత్రాలు అందజేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వి, వేం. నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాసనసభ ప్రాంగణంలో వారికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సోమవారం ఎన్నిక పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున అభిషేక్ మను సింఘ్వి, వేం. నరేందర్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సాయన్న తరువాయి 12లో

వెలుగుమట్ల నిర్వాసితులకు

## త్వరలో ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ

**హైదరాబాద్:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలోని ఇండ్ల నిర్వాసితులందరికీ ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, దాని ప్రకారం త్వరలో అక్కడి అర్హులందరికీ ఇంటి పట్టాతోపాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. సచివాలయంలో సోమవారం తనను కలిసిన విలేకరులతో మంత్రి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఎప్పుడూ పేదవాడి పక్షానే ఉంటుందని మరోమారు స్పష్టం చేశారు.శాసనసభకు కెసిఆర్ రావాలిఈనెల 16వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్షనేత కెసిఆర్‌తో సహా బిఆర్ఎస్ శాసనసభ్యులందరూ హాజరుకావాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రధాన ప్రతిపక్ష సభ్యులు అసెంబ్లీ హాజరై అడిగే ప్రతి ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఓఆర్ఆర్ పక్కన తనకు సంబంధం లేని క్రషర్ గురించి తనపై పై పిచ్చి మాటలు మాట్లాడుతున్న వారికి అసెంబ్లీలో గట్టిగా సమాధానం చెబుతానని బిఆర్ఎస్ నాయకుల విమర్శలపై తీవ్రంగా స్పందించారు.

# విధానాలు వదులుకుంటారా... ఐక్య పోరాటాలు ఎదుర్కొంటారా?




12

- కేంద్ర ప్రభుత్వానికి 'రైతు- కార్మిక పార్లమెంట్' హెచ్చరిక
- 23న సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవంగా పాటించాలని పిలుపు

కూల్చిన చోటే ఇవ్వాలి
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ 03
వెలుగుమట్ల బాధితులకు పరామర్శ



తొలిసారిగా సిఇసిపై

## అభిశంసన తీర్మానం?

- నోటీసు సిద్ధం చేసిన విపక్షాలు
- ఈ వారంలోనే సమర్పించే ఛాన్స్

**న్యూఢిల్లీ :** మన దేశంలోనే తొలిసారిగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశ పెట్టేందుకు విపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఇందుకు సంబంధించిన నోటీసు ముసాయిదా ఇప్పటికే సిద్ధమైందని, దీన్ని ఈ వారంలోనే సమర్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు సోమవారం తెలిపాయి. విపక్షాలన్నీ 100 శాతం కలిసికట్టుగా ఈ పనిలో నిమగ్నమయ్యాయనిఈ అభిశంసన తరువాయి 12లో

## చమురు ధర విజృంభణ

- ఒక బ్యారెల్ చమురు ధర 120 డాలర్లకు చేరిక
- ఆ తర్వాత మళ్లీ స్వల్ప తగ్గింపు



**చికాగో:** క్రూడాయిల్ (ముడిచమురు) ధర శిఖరాన్ని చేరింది. దీంతో ఆసియా మార్కెట్ ధరలు కూడా రికార్డుస్థాయికి చేరాయి. స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నాయి. పశ్చిమాసియాలో పోరు మొదలైన తర్వాత ప్రపంచ చమురు పంపిణీ మార్కెట్‌లో కొనసాగుతున్న సంక్షోభం, యుద్ధం పదో రోజు సోమవారం మరింత పెరిగింది. ఒక బ్యారెల్ చమురు ధర దాదాపు 120 డాలర్లకు (119.50 డాలర్లు) చేరుకుంది. ఆ తర్వాత క్ర మంగా తగ్గి బ్యారెల్ ధర 107.80 డాలర్ల వద్ద ఆగింది. యుద్ధం మొదలైన తర్వాత పది రోజుల్లో 65 శాతం మేర ఈ ధర పెరిగింది. గడచిన మూడున్నర సంవత్సరాలలో ఇంత రికార్డుస్థాయి లో చమురు ధర విజృంభించి పెరగడం ఇదే. ఈ పరిస్థితుల్లో ప్రపంచ మార్కెట్లు చమురు పంపిణీ తరువాయి 12లో

మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ చేస్తే

## సస్పెన్షన్..



- కళాశాలల్లో ప్రత్యేక కమిటీలు..
- నాలుగు నెలల్లో సాల్కర్‌షిప్‌లు ఇవ్వాలి
- ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి
- జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలు విడుదల...

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉన్నత వైద్య, విద్యా సంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యలు, ర్యాగింగ్ నివారణ, వారి మానసిక ఆరోగ్య పరిస్థితులపైన జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసి) ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది.ఇక నుంచి వైద్య విద్యా సంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యలు, అనుమానాస్పద మరణాల వివరాలను, అందుకు కారణమైన అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను నాలుగు నెలలోపు చెల్లించాలని, అలాగే వైద్య విద్యా సంస్థలలో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా నాలుగు నెలల్లోపు భర్తీ చేయాలని స్పష్టం చేసింది. ఒక వేళ విద్యార్థులకు సాల్కర్‌షిప్ అందకపోతే అందుకు కారణాలను తెలియజేయాలను ఆదేశించింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ఎన్ఎంసి సోమవారం విడుదల చేసింది. మార్గదర్శకాల మేరకు సమగ్ర వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ఆయా విద్యాసంస్థలను ఆదేశించింది. మార్గదర్శకాలను అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని కూడా నియమించాలని విద్యా సంస్థలకు సూచిందింది. అన్ని వైద్య కళాశాలలు తప్పనిసరిగా మార్గదర్శకాలను పాటించాలని తెలిపింది. సుప్రీం కోర్ట్ ఆదేశాల నేపథ్యంలో ఎన్ఎంసి మార్గ దర్శకాలను విడుదల చేసింది. కాగా మార్గదర్శకాలను అమలు చేయని వైద్య విద్యా సంస్థలపైన చట్టపరమైన తరువాయి 2లో

## నేపాల్‌లో యువకులదే అధికారం

**ప్రత్యక్ష ఎన్నికల్లో 125 స్థానాలు గెలిచిన ఆర్‌ఎస్‌పి**

**మొత్తం 14 మంది మహిళలు గెలుపు**



**ఖాట్మండు:** నేపాల్‌లో పదేళ్లక్రితం ఆవిర్భవించిన రాష్ట్రీయ స్వతంత్రపార్టీ (ఆర్‌ఎస్‌పి) ప్రత్యక్ష ఎన్నికల్లో 125 సీట్లు గెలుచుకుంది. పరోక్ష ఎన్నికల్లో మరో 58 సీట్లు వచ్చాయి. తద్వారా ఆ పార్టీ సంపూర్ణ మెజారిటీ కంటే ఎక్కువ సీట్లు ఉంటాయి. సభలో 138 స్థానాలున్న పార్టీదే అధికారం. కాగా ఈ ఎన్నికల్లో మొత్తం 14మంది మహిళలు దిగువసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆర్‌ఎస్‌పి తరపున 13 మంది, నేపాలీ కాంగ్రెస్ నుండి ఒక మహిళ విజయం సాధించారు. గతంకంటే ఈ సారి దిగువసభలో మహిళా ప్రాతినిధ్యం పెరిగింది. మహిళలకు 33 శాతం సీట్ల కేటాయించాలని నేపాలీ రాజ్యాంగం నిర్దేశించింది. కానీ ఇప్పటి వరకూ రాజకీయపార్టీలు ఈ నిబంధన అమలు చేయడంలో విఫలమయ్యాయి. ఈ విధంగా ప్రత్యక్ష ఎన్నికల్లో 14మంది గెలవడంద్వారా వారిప్రాతినిధ్యం ప్రస్తుతం 8.48 శాతంగా ఉంది. ఈ నెల 5న జరిగిన సాధారణ ఎన్నికల్లో ముగ్గురు నేపాల్ మాజీ ప్రధానులు పోటీ చేయగా సిపిఎన్ మావోయిస్టు పార్టీ నాయకుడు పుష్ప కుమార్ దహాల్ (ప్రచండ) ఒక్కరే విజయం సాధించారు. మిగిలిన ఇద్దరు కెపి.ఓలిశర్మ, మాధవ్ నేపాల్‌లు పరాజయం పొందారు. జనరేషన్ జెడ్ ఉద్యమానికి పూర్తి అండదండలు ఇచ్చిన రాష్ట్రీయ స్వతంత్రపార్టీ చరిత్రలో లేనన్ని సీట్లతో ప్రజల మద్దతు కూడగట్టుకుంది. ఆ దేశంలో అందరి దృష్టి ఆకర్షించిన ప్రధానమంత్రి అభ్యర్థి బాలేంద్ర షా(35) దేశానికి రథసారథిగా పార్టీలో అవాంతరాలు లేకుండా ఎన్నిక కావాల్సి ఉంది. ఆయన అధికారం చేపడితే నేపాల్‌లో ఒక యువకుడు మొదటిసారి ప్రధానమంత్రి అవుతారు. ప్రత్యక్ష-పరోక్ష ఎన్నికల్లో మొత్తం 37 స్థానాలు గెలుచుకున్న నేపాలీ కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష పాత్ర నిర్వహించడానికి సిద్ధపడుతోంది. మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి నాయకత్వంలోని సిపిఎన్-యుఎంఎల్ పార్టీ 24 స్థానాలు, ప్రచండ నాయకత్వంలోని నేపాలీ కమ్యూనిస్టుపార్టీ (ఎన్‌సిపి) 17 స్థానాలు, శ్రమ సంస్కృతిపార్టీ ఏడు స్థానాలు, రాష్ట్రీయ ప్రజాతంత్రపార్టీ ఐదు స్థానాలు గెలుచుకున్నాయి. జనతాసమాజ్‌వాదీపార్టీ ఒక్కస్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. ఈ ఎన్నికల్లో మొత్తం 67 పార్టీలు పోటీ చేశాయి. నేపాలీ సంప్రదాయానికి విరుద్ధంగా దేశంలో అవినీతి-పేదరికంలో రాజకీయమార్పు, అభివృద్ధి కోరుకున్న కొత్తతరం యువనాయకత్వానికి పట్టం కట్టింది. దీంతో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయింది. అధికారం చేపట్టబోయే ఆర్‌ఎస్‌పికి 4049,604ఓట్లు, ప్రతిపక్ష నేపాలీ కాంగ్రెస్‌కు 13,60,281ఓట్లు, సిపిఎన్-యుఎంఎల్‌కు 1150,679 ఓట్లు, నేపాలీ కమ్యూనిస్టుపార్టీకి 591,940ఓట్లు, శ్రమసంస్కృతి పార్టీ కి 291,965ఓట్లు, జనతా సమాజ్‌వాదీపార్టీకి 1,16,463ఓట్లు, రాష్ట్రీ య పరివర్తన్‌పార్టీకి 276,931 ఓట్లు లభించాయి. 40లక్షలకుపైగా ఓట్లు ప్రొపోర్షనల్ రిప్రజెంటేషన్ వ్యవస్థ కింద ఉన్నాయి. దిగువసభలో మొత్తం 275స్థానాలున్నాయి. 100 స్థానాలకు నిష్పత్తి ప్రాతిపదకపై సీట్ల కేటాయింపు జరిగింది.

# ఇజ్రాయెల్-అమెరికాపై దాడులు ఆగవు

ఇరాన్ కొత్త నాయకత్వం సంకేతాలు
క్షిపణులను అడ్డుకున్న ఖతార్, టర్కీ, యుఎఇ
ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌కు తీవ్రనష్టం
ఖతార్ తీవ్ర హెచ్చరిక
లెబనాన్‌లో ఐదులక్షలమంది నిరాశ్రయం
మానవహక్కుల సంఘం విమర్శ
ఎనిమిది దేశాల్లో సిబ్బందిని తరలిస్తున్న అమెరికా
చమురు ధరలపై జి-7 అత్యవసర సమావేశం



**దుబాయ్ :** పశ్చిమాసియాలో పదోరోజు సోమవారం వైరి పక్షాలమధ్య యుద్ధ దాడులు ఆగకుండా కొనసాగుతున్నాయి. తమను అంతం చేయాలనుకున్న శత్రుదేశాలపై యుద్ధం ఆగదని ఇరాన్ కొత్త నాయకుడు మొర్తాజా ఖమేనీ పక్షాన సందేశాలు పంపారు. దాడులు కొనసాగించారు. అటు బీరుట్‌లో కూడా ఇజ్రాయెల్ గగనతల దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్ నుండి వస్తున్న క్షిపణులను అడ్డుకున్నట్లు ఖతార్, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించాయి. అబుదాబిలో మళ్ళీ పేలుళ్ళు సంభవించాయి. ఇరాన్ దాడులను సహించబోమని అరబ్ లీగ్ కౌన్సిల్ సమావేశంలో ఖతార్ హెచ్చరించింది. ఈనేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ఖతార్ నాయకులతో ఫోన్ సంభాషణలు జరిపి వారికి తన పూర్తి మద్దతు తెలియజేశారు. బహ్రైన్‌లో మంచినీటి సరఫరా కేంద్రాలు, రిఫైనరీలపై ఇరాన్ దాడులు చేసింది. ముడి చమురు ధరలు మూడున్నరేళ్ల గరిష్టస్థాయిలో పెరిగిపోవడంతో చమురు మార్కెట్లు సంక్షోభంలో పడ్డాయి. జి-7 దేశాలు అత్యవసర సమావేశం నిర్వహించి ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలు, లోటు భర్తీపై చర్చించాయి. ఆరు గల్ఫ్ దేశాల నుండి అమెరికా ముఖ్యమైన సిబ్బందిని ఖాళీచేసి వెళ్ళిపోవాలనిగా ఆదేశించింది. యుద్ధరంగంలోకి వస్తే బ్రిటన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని, అందువల్ల ఎప్పుడు యుద్ధంలోకి రావాలనే నిర్ణయం అవసరమైనప్పుడు తామే తీసుకుంటామని బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్మర్ చెప్పారు. బ్రిటన్ యుద్ధ నౌకల అవసరం లేదని ట్రంప్ ప్రతి విమర్శ చేశారు. యుద్ధంలో మరణించిన అమెరికా సైనికుల సంఖ్య ఏడుకు చేరింది. ఇజ్రాయెల్‌లో ఇరాన్ క్షిపణుల దాడులు పెరగడంతో హోంకమాండ్ ఫ్రంట్ ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని హెచ్చరికలు చేస్తోంది. ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాలలో ఇరాన్ క్షిపణులు అపారనష్టం కలిగించాయి. సైరన్లు మోత మోగుతున్నాయి. ఇజ్రాయెల్‌లోని కిర్యాత్ షోమ్ నగరంపై క్షిపణి దాడులు చేసినట్లు హెజ్బొల్లా ప్రకటించింది. ఒకవైపు ఇరాన్‌పై దాడులతోపాటు లెబనాన్‌లో కూడా ఇజ్రాయెల్ సైనికులు దాడులు భీకరం చేస్తున్నారు. బీరుట్ పొరుగున ఉన్న దహియేహ్‌లో ఇజ్రాయెల్ సోమవారం గగనతల దాడులు చేసింది. దహియేమ్‌లో ఇజ్రాయెల్, చట్టవిరుద్ధంగా అత్యంత ప్రమాదకరమైన హై ఫాస్ఫరస్ మ్యూనిషన్ ప్రయోగాలు చేస్తోందని మానవహక్కుల సంఘం విమర్శించింది. హెజ్బొల్లాను నిర్మూలించాలనే ఐడిఎఫ్ చర్యల కారణంగా గడచిన ఎనిమిది రోజుల్లో 5,00,000 మంది లెబనాన్ ప్రజలు ఇళ్ళు వదలి శరణార్థులుగా మారారు. హెజ్బొల్లా దాడుల్లో ఇద్దరు ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. లెబనాన్‌లో ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో 400మంది మరణించారు. 1,140మంది గాయపడ్డారు. బీరుట్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన భవనాల శిథిలాలు,దగ్ధమైన కార్లు చిందరవందరగా పడి భయానక దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. మరోవైపు మాట తప్పిన ఇరాన్ సోమవారం తెల్లవారేవరకూ యునైటెడ్, అరబ్ ఎమిరేట్స్, ఖతార్, టర్కీలపై దాడులు చేసింది. బహ్రైన్ సిత్రా ఐలాండ్‌లో జరిగిన దాడుల్లో పిల్లలతో సహా 32 మంది గాయపడ్డారు. ఖతార్‌లో పేలుళ్ళు సంభవించాయి. దాడులు చేయబోమని హామీ ఇచ్చి విధ్వంసం సృష్టిస్తూ ఉండటంపై గల్ఫ్‌దేశాలు మండిపడుతున్నాయి. పది రోజుల్లో పశ్చిమాసియాలో 23 వేల విమానాలు రద్దుకాగా, ఖతార్ మొదటిసారి స్వల్పస్థాయిలో విమానాలను పునరుద్ధరించాలని నిర్ణయించింది. బహ్రైన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, లెబనాన్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలలో ఉన్న ముఖ్యమైన సిబ్బంది మినహా అందరినీ ఆ దేశాలు వదిలి రావాలని అమెరికా ఆదేశించింది. వారిని ఖాళీ చేయిస్తోంది. కరాచీ, అదన, టర్కీల నుండి కూడా కాన్సులేట్ సిబ్బందిని ఖాళీ చేయిస్తోంది. హిందూమహాసముద్రంలో ఐరిస్ దేనా యుద్ధ నౌకపై అమెరికా చేసిన దాడిలో 104మంది మరణించారని ఇరాన్ అధికారిక ప్రకటన చేసింది. బహ్రైన్‌లో ధ్వంసమైన ఆయిల్ డిపోల నుండి భారీస్థాయిలో మంటలు వెదజల్లు తున్నాయి. మనామా సమీపంలో క్షిపణులతో ఇరాన్ చేసిన దాడులతో ఆయిల్ రిఫైనరీ భయంకరమైన పొగలు కక్కుతూ ఆ ప్రాంతంలో తీవ్ర పర్యావరణ నష్టాని కలగజేస్తోంది. వారం రోజులుగా దాడులవల్ల రిఫైనరీలు దారుణమైన కాలుష్యం వెదజల్లుతున్నాయి.

## అమెరికా-ఇజ్రాయెల్ మధ్య సమన్వయం!

**వాషింగ్టన్:** అమెరికా-ఇజ్రాయెల్ మధ్య ఉన్న సన్నిహిత సమన్వయ ఆలోచనను డోనాల్డ్ ట్రంప్ మరోసారి హైలైట్ చేశారు. ఇరాన్‌తో యుద్ధం ముగించాలంటే బెంజిమన్ నెతన్యాహూతో కలిసి పరస్పరం మాట్లాడుకునే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ రెండు దేశాలు ఒక సమన్వయంగా మొదటి నుండీ అన్ని పనులూ చేస్తున్నాయని సర్వత్రా విమర్శలు ఉన్నాయి. రెండు దేశాలు పశ్చిమాసియా సమస్యకు సమాన భాగస్వామ్యం వహిస్తాయని మరోసారి ఆయన చెప్పకనే చెప్పారు. ఇంతకుముందు గత ఏడాది జులైలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసినప్పుడు తనకు చెప్పకుండానే ఈ దాడులు జరిగాయని ట్రంప్ బొంకులు పలికారు. ఇరాన్ తమపై మొదట దాడి చేస్తుందని నెతన్యాహూ భయపడుతున్నారని, ఇజ్రాయెల్‌ను ఇరాన్ నాశనం చేసేదశలో ఉందని ప్రస్తుత సైనిక జోక్యానికి ముందు ట్రంప్ వ్యాఖ్యానించారు. 'ఇజ్రాయెల్‌ను దాని చుట్టూ ఉన్న ప్రతిదానినీ ఇరాన్ నాశనం చేయబోతోంది, అందుకే ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకున్న దేశాన్ని మేమే నాశనం చేశాం, మేం మాట్లాడుకుంటున్నాం, సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటాం, నెతన్యాహూ చెప్పిన ప్రతి విషయాన్ని నేను పరిగణనలోకి తీసుకుని అంతిమ నిర్ణయం తీసుకునే హక్కును నా దగ్గరే ఉంచుకుంటాను' అన్నారు. ఒకవేళ అమెరికా గనుక యుద్ధ దాడులను ఆపేస్తే నెతన్యాహూ మాత్రం ఆగకుండా తన సొంత సైనికబలంపై ఆధారపడి యుద్ధాన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నాయా? అని ప్రశ్నించినప్పుడు, అలాంటి ఘటనలు జరిగే అవకాశాలు తోసిపుచ్చారు. ఇలాంటి ఊహాగానాలను తాను వ్యాప్తి చేయడాన్ని ఆయన తిరస్కరిస్తూ, అలా జరుగుతుందని తాను భావించడలేదన్నారు.

## పోలీసులకు సవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారాలు కనుగొనాల్సిన అ వసరం ఉందన్నారు. ఏ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా శాంతిభద్రతలు బలంగా ఉండాలని పేర్కొంటూ, రాష్ట్రంలో పాలసీ స్థబ్దత ఉండకూడదనే ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్2047 విధాన పత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆర్‌ఆర్‌ఆర్ రహదారి పరిధిలోని సుమారు 2100 కిలోమీటర్ల ప్రాంతాన్ని ప్రధాన నగర ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వివరించారు.దేశంలోని ఇతర మహానగరాల్లో ఎదురవుతున్న సమస్యలను కూడా మనం పాఠాలుగా తీసుకోవాలని సిఎం సూచించారు. ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలు, ముంబై, చెన్నై నగరాల్లో వరదల సమస్యలను ఉదాహరణగా పేర్కొన్నారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు ముందుగా సహాయం కోసం పోలీసులనే ఆశ్రయిస్తారని చెప్పారు. ఒకప్పుడు తీవ్రవాదం పెద్ద సమస్యగా ఉండగా దాన్ని ఎదుర్కోవడానికి ప్రత్యేక దళాలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం నేరాల స్వరూపం మారిపోయిందని, ముఖ్యంగా సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ వ్యవస్థను సాంకేతికంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవడం, ఇప్పటికే ఉన్న సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడం అవసరమని సీఎం సూచించారు. సిబ్బంది, అధికారులు తమ సామర్థ్యాలను పెంచుకోకపోతే నేరాలను అరికట్టడం కష్టమవుతుందని చెప్పారు. రిట్రీట్ కార్యక్రమంలో పోలీస్ అధికారులు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ, నియామకాలు తదితర అంశాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలు సమర్పించారని తెలిపారు. ఈ ప్రతిపాదనలను విశ్లేషించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. కమిటీ పరిశీలించిన అనంతరం అవసరమైన మార్పులను చట్టపరమైన రూపంలో తీసుకురావాలని సూచించారు. పోలీస్ శాఖలో జనాభా ప్రాతిపదికన పోలీసింగ్ వ్యవస్థ ఉండేలా సిబ్బంది పునర్వ్యవస్థీకరణ చేయాలని, వివిధ విభాగాల మధ్య సమన్వయం బలోపేతం చేయాలని సీఎం ఆదేశించారు. పోలీస్ శాఖలో ఉద్యోగులు నిర్లక్ష్య ధోరణిలో పనిచేస్తే సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు. అవసరమైన నిధులు అందించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందని, అధికారుల పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయని తెలిపారు. ప్రతి ఏడాది డిసెంబరులో ఇలాంటి రిట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్‌కు ముందే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తే అవసరమైన నిధులను ముందుగానే కేటాయించుకునే అవకాశం ఉంటుందని సిఎం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిజిపి బి.శివధర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, విజిలెన్స్ డిజి శిఖాగోయల్, పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్‌తో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు పాల్గొన్నారు.

## సస్పెన్షన్..

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామని ఎన్‌ఎంసి హెచ్చరించింది.
ఉన్నత వైద్య విద్యాసంస్థలలో ముఖ్యంగా 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న విద్యార్థుల ఆత్మహత్యలు, అనుమానాస్పద మరణాలు, సంఘటనకు సంబంధించిన సమగ్ర వివరాలకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుంది. మరణాల సంఖ్యను నమోదు చేయాలని వైద్య విద్యా సంస్థలను ఆదేశించింది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, వివక్ష నిరోధక చట్టాలు, ర్యాగింగ్ నియంత్రణ, ముందస్తు జోక్యం వంటి అంశాలపై అధ్యాపకులకు శిక్షణ ఇవ్వాలని మార్గదర్శకాల్లో పొందుపర్చారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు, లిఫ్టులు, సహాయక పరికరాలను ఏర్పాటు చేయాలని, ట్రాన్స్‌జెండర్ విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్, శానిటేషన్ సదుపాయాలు కల్పించాలని, పరీక్షల సమయంలో ప్రత్యేక సౌకర్యాలు ఇవ్వాలని సూచించింది. ప్రతి వైద్య కళాశాలలో అర్హత కలిగిన మానసిక ఆరోగ్య నిపుణులను నియమించాలని సూచించింది. ప్రతి రెసిడెన్షియల్ వైద్య కళాశాలలో 24గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఎన్‌ఎంసి స్పష్టం చేసింది. క్యాంపస్‌లోనా? లేదా ఒక కిలోమీటర్ పరిధిలో అత్యవసర వైద్య సదుపాయం ఉండాలి. అదనంగా అంబులెన్స్ సౌకర్యాన్ని కూడా అందుబాటులో పెట్టాలి.

**ఇక ర్యాగింగ్‌కు పాల్పడితే సస్పెన్షన్ ...**

ర్యాగింగ్ ఘటనలపై సస్పెన్షన్, హాస్టల్ నుంచి తొలగింపు, పరీక్షల నుంచి డిబార్, కళాశాలల నుంచి బహిష్కరణ, పోలీసులకు ఫిర్యాదు వంటి కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య విద్యా సంస్థలను ఎన్‌ఎంసి ఆదేశించింది. ప్రతి వైద్య కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్, వివక్ష నిరోధక అధికారి, అంతర్గత ఫిర్యాదు కమిటీ, విద్యార్థుల ఫిర్యాదు పరిష్కార కమిటీ, హాస్టల్ కమిటీ, నషా ముక్త్ కమిటీ వంటి సంస్థలను ఏర్పాటు చేయాలని సూచించింది. ర్యాగింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి యాంటీ ర్యాగింగ్ అఫిడవిట్లు తీసుకోవాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, క్యాంపస్‌లో హెల్ప్‌లైన్ నంబర్లను ప్రదర్శించాలని ఎన్‌ఎంసి సూచించింది. శారీరక, మానసిక, లైంగిక, సామాజిక, ఆర్థిక, విద్యాసంబంధ, ఆన్‌లైన్ ర్యాగింగ్ వంటి అన్ని రకాల వేధింపులను ర్యాగింగ్‌గానే పరిగణిస్తామని ఎన్‌ఎంసి స్పష్టం చేసింది.

**సుప్రీం కోర్ట్ తీర్పు నేపథ్యంలో...**

ఉన్నత విద్యా సంస్థలల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు, ఆత్మహత్యలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, సుప్రీం కోర్ట్ మాజీ న్యాయమూర్తి ఎస్.రవీంద్ర భట్ అధ్యక్షతన జాతీయ టాస్క్‌ఫోర్స్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఇక నుంచి రాష్ట్రాల వారిగా విద్యార్థులకు సంబంధించిన మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను ఈ టాస్క్‌ఫోర్స్‌కమిటీ పరిశీలించనుంది. ఇందులోభాగంగానే నేషనల్ మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాలను విడుదల చేసింది.

**సమగ్ర వివరాలు ఇవ్వాల్సిందే ...**

ప్రతి వైద్య కళాశాల తమ సంస్థకు సంబంధించిన పూర్తి వివరాలను పట్టిక రూపంలో సమర్పించాలి. ఇందులో కళాశాల పేరు, రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం, సంస్థ రకం (ప్రభుత్వం/ప్రైవేట్/డీమ్డ్), యూజి,పిజి సూపర్ స్పెషాలిటీ విద్యార్థుల మొత్తం సంఖ్య, హాస్టల్ సామర్థ్యం వంటిసమగ్ర వివరాలను పొందుపర్చాలి. అలాగే మార్గదర్శకాల అమలుకు బాధ్యత వహించే నోడల్ అధికారిని నియమించి, ఆయన పేరు, హోదా, సంప్రదింపు వివరాలను కూడా వెల్లడించాల్సి ఉంటుంది. సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం, ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలి. విద్యా సంస్థలురూపొందించే నివేదికలో విద్యార్థికి సంబంధించిన వివరాలతో పాటు ఎఫ్‌ఐఆర్ నంబర్, విచారణ స్థితి వంటి వివరాలు ఇవ్వాలి.

**స్కాలర్‌షిప్‌లు రాకున్నా.. విద్యార్థులకు అనుమతి..**

స్కాలర్‌షిప్ ఆలస్య కారణంగా విద్యార్థులను తరగతులకు అనుమతించకపోవడం, వారితో పరీక్షలు రాయకుండా నిరోధించడం, హాస్టల్ నుంచి పంపించడం, మార్కుల జాబితా ఇవ్వకుండా నిలిపివేయడం లాంటి చర్యలు తీసుకోవద్దని, సాల్కర్‌షిప్‌లతో సంబంధం లేకుండా విద్యార్థులకు అనుమతి ఇవ్వాల్సిందేనని ఎన్‌ఎంసి ఆదేశించింది.

## ఎందుకు అనుమతివ్వట్లేదు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల సమస్యలు. అందువల్ల వాటి గురించి చర్చించాలనుకుంటున్నాము' అని సోమవారం లోక్ సభ వాయిదా పడిన తర్వాత పార్లమెంటు భవనం వెలుపల రాహుల్ మీడియాతో మాట్లాడారు. మన ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎత్తున హాని కలిగించే ఒక నమూనా మార్పు కోసం పోరాటం జరుగుతోంది, స్టాక్ మార్కెట్లలో ఏమి జరిగిందో చూశారన్నారు. అమెరికా ఒప్పందంపై మోదీ సంతకం చేయడంతో దేశం తీవ్రంగా దెబ్బ తినబోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై చర్చించడంలో సమస్య ఏమిటి? కేంద్రాన్ని నిలదీశారు. పశ్చిమాసియా పరిస్థితిపై చర్చ తర్వాత స్పీకర్ ఓం బిర్లాపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని చేపట్టవచ్చని రాహుల్ సూచించారు. పశ్చిమాసియా సమస్య ముఖ్యం కాదని ఎందుకు అనుకుంటున్నారు?, ఇంధన ధర, ఆర్థిక విధ్వంసం ముఖ్యమైనవి కాదా? వీటని తాము ముఖ్యమైనవిగా భావిస్తున్న ప్రజల సమస్యలు అని, అందువల్ల తాము వాటి గురించి చర్చించాలనుకుంటున్నామన్నారు.

**ప్రతిపక్షాల డిమాండ్‌ను ప్రభుత్వం అనుమతించేలా లేదు?**

పశ్చిమాసియాలో ప్రస్తుత సంక్షోభంపై పార్లమెంటులో చర్చ జరపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకరించే అవకాశం లేనట్లుగా తెలుస్తోంది. ఎందుకంటే విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇప్పటికే ఉభయ సభలకు వివరించారు. స్పీకర్ ఓం బిర్లాపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరపాలని ప్రభుత్వం ఆసక్తిగా ఉందని వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు సోమవారం సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడంతో మంగళవారం ఈ అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చే అవకాశం ఉంది. విదేశాంగ మంత్రి ఇప్పటికే ఉభయ సభలకు వివరించారు కాబట్టి పార్లమెంటులో పశ్చిమాసియా పరిస్థితిపై చర్చ జరగదని ఆ వర్గాలు తెలిపాయి. విపక్షాల బెంచ్‌లు సభ ప్రాథమిక నైతికతను పాటించడం లేదని ప్రభుత్వం ఆరోపించడంతో, పశ్చిమాసియా పరిస్థితిపై చర్చ జరపాలన్న డిమాండ్లపై గర్జన నిరసనల మధ్య సోమవారం లోక్‌సభ కార్యకలాపాలు పదేపదే వాయిదా పడ్డాయి.

## దౌత్యం-చర్చలే పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

వాకౌట్ చేయగా, తీవ్ర గందరగోళ దృశ్యాలమధ్య లోక్ సభ వాయిదా పడింది. సార్వభౌమాధికారం, పశ్చిమాసియా ప్రాంతంలో అన్ని దేశాల ప్రాదేశిక సమగ్రతను కొనసాగించేందుకే భారతదేశం కట్టుబడి ఉందని మంత్రి జైశంకర్ ప్రకటించారు. పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కనిపెట్టుకుని ఉందని, ఉన్నతస్థాయిలో వాటిని సమీక్షిస్తున్నామని, ఇప్పటికే ఆ ప్రాంతంలో వివాదాస్పద ప్రదేశాల నుండి 67,000 మంది భారతీయులను దేశానికి తీసుకు వచ్చామని మంత్రి చెప్పారు. భారత జాతీయుల భద్రత, ఆ ప్రాంతంలో ఇంధన భద్రత, వాణిజ్యం వంటి భారత్ ప్రయోజనాలకే ప్రధాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. 'భారతదేశం శాంతికి కట్టుబడి ఉంది, సంభాషణలకు, దౌత్య చర్యలకు అందరూ తిరిగి రావాలని కోరుతోంది. సైన్యాలు, ఆయుధాలను వెనక్కు మళ్ళించాలని భారత్ కోరుతోంది, సహనం పాటించాలి, పౌరుల భద్రతకు భరోసా ఇవ్వాలి' అని ఉభయసభల్లోనూ ఒకే ప్రకటనను జైశంకర్ చదివారు. 'భారతీయుల సంక్షేమం, వారి భద్రత ఈ ప్రాంతంలో ఉన్న అన్ని దేశాలలో మనకు ముఖ్యం, ఇంధన భద్రత, వాణిజ్య సహా భారత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం, అదే ఎప్పటికీ ముఖ్యాంశం' అని పేర్కొన్నారు. భారతీయులను వెనక్కు తీసుకురావడానికి తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు.

**పూర్తిస్థాయి చర్చకు ప్రతిపక్షాల డిమాండ్**

ఉభయసభల్లోనూ జైశంకర్ ప్రకటన చేస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పశ్చిమాసియాపట్ల అనుసరిస్తున్న వైఖరిపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర నిరసన తెలియజేశారు. ఈ ప్రకటన వెంటనే ఉభయ సభల్లో ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చ చేపట్టాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వారి విజ్ఞప్తిని ఎంతమాత్రం పట్టించుకోకపోవడంతో ఎంపీలు నిరసన వ్యక్తం చేస్తూ రాజ్యసభ నుండి వాకౌట్ చేశారు. లోక్‌సభలో తీవ్ర గందరగోళ దృశ్యాలు చోటుచేసుకున్నాయి. దీంతో లోక్‌సభ వాయిదా పడింది.
ఫిబ్రవరి 28వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో, పశ్చిమాసియా పరిణామాలపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వివాదలో భాగస్వాములైనవారంతా చర్చలకు రావాలని, దౌత్యమార్గంలో సమస్య పరిష్కరించుకోవాలని కోరింది. ఈ ప్రాంతంలో పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగించేవిగా ఉన్నాయని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ పరిస్థితులను చాలా నిశితంగా పరిశీలిస్తున్నారని, పశ్చిమాసియాలో అనేక దేశాల నాయకులతో ఫోన్ సంభాషణలు చేశారని చెప్పారు. తాను కూడా ఆ దేశాల విదేశీ మంత్రులతో సంభాషణలు చేస్తున్నానన్నారు. అమెరికాతోపాటు అనేక దేశాలతో రోజువారీ సంబంధాలు ఈ విషయంలో కొనసాగిస్తున్నామన్నారు. గతనెల 28న ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చీతో కూడా తాను మాట్లాడానని, రాబోయే రోజుల్లో ఈ విషయంలో ఉన్నతస్థాయి సంభాషణలు తామిద్దరం చేస్తామని చెప్పారు. ఇరాన్ నౌకను భారతదేశ ఓడరేవులో నిలిపి ఉంచేందుకు అనుమతించడం మానవతా దృక్పథం ప్రాతిపదికపై తీసకున్న సరైన నిర్ణయమని విదేశీవ్యవహారాల మంత్రి జైశంకర్ పార్లమెంటులో చెప్పారు. వాస్తవానికి ఫిబ్రవరి 28న పశ్చిమాసియాకు చెందిన మూడు నౌకలు భారతీయ ఓడరేవుల్లో ఉండాల్సి ఉందని,మార్చి ఒకటిన అనుమతి ఇచ్చామన్నారు. ఇరాన్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకే ఈ చర్య తీసుకున్నామన్నారు. గల్ఫ్ దేశాల్లో భారతీయులు ఎంతో మంది ఆశ్రయం పొందుతున్నారని, వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతున్నాయని, భారతీయుల రక్షణ కూడా చాలా ముఖ్యమని అన్నారు.

## మొజ్తబా బాధ్యతలు స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

తండ్రిని మించినస్థాయిలో మతాన్ని అనుసరిస్తారు. తండ్రిని మించిన తనయుడుగా దీర్ఘకాలంగా ఆయన అధికార వారసుడుగా గుర్తింపు పొందారు. ఇరాన్ రాజకీయ నాయకులు మొజ్తబావైపు వేలెత్తి ప్రశ్నించినప్పటికీ వారసుడుగా నిపుణుల సభ ఆయననే ఎన్నుకుంది. కొత్త నాయకత్వం పట్ల సంపూర్ణ విధేయత ప్రకటించిన ఐఆర్‌జిసి (ఇస్లామిక్ రిపబ్లికన్ గార్డ్ కార్ప్స్) ఆయన సారథ్యంలో మొదటిసారి క్షిపణి దాడులు కొనసాగించింది. అమెరికా-ఇరాన్ ఎన్ని హెచ్చరికలు చేస్తున్నప్పటికీ వెనుకంజ వేయకుండా ఆయన తండ్రిస్థానంలో బాధ్యతలు చేపట్టారు.ఇక దాడులు చెయ్యబోమని, సమస్యలను దౌత్యపరంగా పరిష్కరించుకుందామని ప్రకటించిన తర్వాత కూడా పొరుగుదేశాలపై దాడులు కొనసాగడంతో మొజ్తబా స్పందనకోసం గల్ఫ్ దేశాలు ఎదురుచూస్తున్నాయి. ఐఆర్‌జిసిలోని ప్రముఖులతో మొదటినుండీ అత్యంత సన్నిహిత సంబంధాలుగల నాయకుడుగా మొర్తాజా పేరుపొందారు. సర్వాధినేతగా ఆయన నియామకంపట్ల ఐఆర్‌జిసి పూర్తి విధేయత ప్రకటించింది. తండ్రి ఖమేనీతోకంటే ఎక్కువ సన్నిహితత్వం మొజ్తబాతో ఉందని ఐఆర్‌జిసి పేర్కొంది. ఆయన తండ్రితో విభేదాలున్నాయనడాన్ని తిరస్కరించింది. అందువల్ల పొరుగుదేశాలతో సంబంధాల పునరుద్ధరణకు వీలుగా ఐఆర్‌జిసికి ప్రస్తుతం కళ్ళెం వేయగల నాయకుడు ఇరాన్‌లో మొజ్తబా ఒక్కరే. ఇకమీదట ఇరాన్ ఐఆర్‌జిసి, దేశంలోని అణుస్థావరాలు, కేంద్రాలు, మౌలిక వ్యవస్థలు, న్యాయసభ,సామాజిక పాలనా నియమాల అధికారాలన్నీ మొజ్తబా చేతుల్లోనే ఉంటాయి. వాటికి ఆయనే బాధ్యత వహిస్తారు.

**మొజ్తబా గురించి...**

88 మంది సభ్యులుగల ఇరాన్ అత్యున్నత న్యాయ నిపుణుల మండలి మొజ్తబాను దేశ సర్వాధినేతగా నియమించింది. ఇరాన్ నిపుణుల మండలి సభ్యుడు అహ్మద్ అలమొల్హాడా ఆదివారం ఒక ప్రకటనలో ఎన్నిక పూర్తయిందని చెప్పారు. శాసన మండలి సెక్రటేరియట్ అధిపతి హొస్సేనీ బుషెహ్రీ అధికారిక ప్రకటన చేశారు. ఈ పదవికోసం ఇరాన్ మొదటి సర్వాధినేత రహోల్లా ఖమేనీ కుమారుడు, తాత్కాలిక త్రిసభ్యపాలనామండలి సభ్యుడు అలిరెజా అరాఫి, ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడి మనుమడు హస్సన్ ఖమేనీ కూడా పోటీ పడ్డారు. ఖమేనీ రెండో కుమారుడైన మొజ్తబా ఒక మతాధిపతిగా ఎదిగారు. తూర్పు ఇరాన్‌లోని అతి పెద్ద నగరం మష్హాద్‌లో 1969 సెప్టెంబరు 8న మొజ్తబా జన్మించారు. ఆయన ఇప్పటివరకూ తెరవెనుక మాత్రమే పనిచేస్తూ వచ్చారు. దక్షిణ ఇరాన్ క్వామ్‌లో ఆయన మత విద్య అభ్యసించారు. ఆయన మధ్యతరహా మతాధికారి హొజ్జతొలెస్లామ్‌గా మాత్రమే గుర్తింపు పొందారు. తన 17 ఏళ్ళ వయసులోనే ఐ.ఆర్.జి.సిలో సైనికుడుగా చేరారు. ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో హబీబ్ బెటాలియన్ తరపున పోరాటంలో కీలక పాత్ర వహించారు. ఈ ఏడాది జనవరిలో ప్రజాందోళనను అణచివేయడంలో మొజ్తబా కీలక పాత్ర వహించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అలీ ఖమేనీతోపాటు ఆయన కుమార్తె,అల్లుడు,మనవరాలు మరణించారని మాత్రమే వార్తలు వచ్చాయి. కానీ మొజ్తబా భార్య హద్దాద్ అదెల్ కూడా ఈ దాడుల్లో మరణించారు. ఆమె ఇరాన్ పార్లమెంటు స్పీకర్ కుమార్తె. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు మూడు బిలియన్ డాలర్లు ఆస్తులు ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. 2019లో ట్రంప్ ప్రభుత్వం ఆయనపై ఆంక్షలు విధించింది. ఇప్పటివరకూ మొజ్తబా స్వరాన్ని ఇరాన్ ప్రజలు కూడా వినలేదు. బహిరంగ ప్రకటనలకు ఇప్పటివరకూ ఆయన దూరంగా ఉన్నారు. మొదటినుండీ ఆయన ఎలాంటి రాజకీయ పదవులూ నిర్వహించలేదు.

**కొత్త నేత వైట్‌హౌస్ అనుమతి పొందాలి: ట్రంప్**

ఎన్నిక విషయం తెలిశాక ఆదివారం రాత్రి ట్రంప్ మాట్లాడుతూ, "అతను మా నుండి అనుమతి పొందాలి, లేకపోతే అతను ఎక్కువకాలం ఉండడు, ప్రతి పది సంవత్సరాలకు ఒకసారీ మళ్ళీ మేం వెనక్కు వెళ్ళి పదే పదే అవే చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదన్న విషయాన్ని మేం నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉంది, నాలాంటి దేశాధ్యక్షుడు ఇరాన్‌లో లేనప్పుడు అక్కడ వారు కోరుకున్నట్టుగా జరగదు, ప్రజలు ఐదు సంవత్సరాలు మళ్ళీ వెనక్కు వెళ్ళాలని నేను కోరుకోవడంలేదు, వారు మళ్ళీ అలా చేయడం (ఉద్యమాలు నిరసనలు) నాకు ఇష్టం లేదు' అన్నారు. ఈ వ్యాఖ్యలు ఇరాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేనని, ఐక్యరాజ్యసమితి వ్యవస్థను, అంతర్జాతీయ చట్టాలను అమెరికా అధ్యక్షుడు కాలరాస్తున్నారని,తమకు ఏం కావాలో ఇరాన్ ప్రజలలే నిర్ణయించుకుంటారని ప్రపంచ నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. అదేసమయంలో ఇరాన్‌లో తమకు అనుకూలమైన ప్రజాభిప్రాయాన్ని రూపుదిద్దేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ పాలకులు అన్నివిధాలుగా నిఘా చర్యలను ముమ్మరం చేశారు.

**ఎంతకాలమైనా ప్రతిఘటిస్తాం: రాఘ్చీ**

అమెరికాకు లొంగిపోయే ప్రశ్నేలేదని, ఒకవేళ ట్రంప్ కాల్పుల విరమణను ప్రతిపాదించినాగానీ ఇరాన్ అంగీకరించబోదని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. ఎంతకాలమైనా ప్రతిఘటిస్తూనే ఉంటామన్నారు. "ఒక సంవత్సరకాలంలో రెండుసార్లు మా మీద దాడి చేసిన తర్వాత కూడా వారు కాల్పుల విరమణ కోరుకుంటున్నారా? అలా సాగదు, మేం శాశ్వత శాంతి కోరుతున్నాం, యుద్ధానికి శాశ్వత ముగింపు ఉండాలి, ఆ దశకు చేరుకోకపోతే పోరాటం కొనసాగించాలనే కోరుకుంటున్నాను" అన్నారు. ట్రంప్ ఇరాన్‌కు, గల్ఫ్ దేశాలకు క్షమాపణ చెప్పాలని ఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో డిమాండ్ చేశారు. ఇరాన్,గల్ఫ్ దేశాలో యుద్ధానికి, ఇరాన్‌లో దారుణ హత్యలకు బాధ్యత వహించాలన్నారు. "మా అత్యున్నత నాయకుణ్ణి హత్యచేశారు. ఐనాగానీ మా దేశంలో పరిపాలన యథాతథంగా కొనసాగుతూనే ఉన్నాయి, ఎక్కడి వ్యవస్థలు అక్కడే తమ తమ పనులు సక్రమంగా చేసుకుంటున్నాయి, మేం మా దేశ పాలనను కొనసాగించగలుగుతున్నాం" అన్నారు. ఇరాన్ తదుపరి నాయకుణ్ణి నిర్ణయించే విషయంలో తాను జోక్యం చేసుకుంటానని ట్రంప్ చేసిన ప్రకటనను అరాఘ్చీ తిరస్కరించారు. మా దేశ వ్యవహారాలు మేమే చూసుకుంటాం, మా దేశాన్ని మేమే పరిపాలించుకుంటాం, మా దేశీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ఎవరినీ అనుమతించబోం" అన్నారు.

# కార్పొరేట్ విద్యావ్యాపారానికి వత్తాసు పలుకుతున్న పాలకులు

## ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ విద్యారంగాన్ని పాలకులు నిర్లక్ష్యం కారణంగా సంక్షోభం కూరుకుపోయేలా చేసి కార్పొరేట్ అనుకూల విద్యావిధానాన్ని వత్తాసు పలుకుతూ అసమాన సమాజానికి ఆజ్యం పోస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమైయ్యారని, కేంద్ర బిజెపి జాతీయ నూతన విద్యావిధానం 2020 తీసుకు వచ్చి విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ చేస్తూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని అత్యంత ప్రమాదంలోకి నెట్టివేసిందని విమర్శించారు. సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలోని డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం ద్వారా దేశంలో అశాస్త్రీయత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు ఉన్నా వాటిని కేంద్ర ప్రభుత్వం పెడ చెవిన పెడుతూ ఇటీవలే ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు ఇంకా విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతుందన్నారు. వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యా విధానంలో పలు సిఫార్సులు అస్పష్టంగా ఉన్నాయని, విద్యా కమిషన్ సిఫార్సులపై విద్యార్థి సంఘాలు, విద్యావంతులు, మేధావులు ఉపాధ్యాయ సంఘాల వారితో ప్రభుత్వం, విద్యా కమిషన్ చర్చించి విద్యార్థులకు ఉపయోగపడే సమగ్రమైన విద్యా విధానం రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ గ్యార నరేష్, రెహమాన్, గ్యార క్రాంతి, సి.రాజు పాల్గొన్నారు.

# ఒలింపిక్ లక్ష్యంతో రాష్ట్రంలో క్రీడా సదుపాయాల అభివృద్ధి



## క్రీడా శాఖపై సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందించే ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస రాజు, శేషాద్రి, క్రీడా సంస్థ నిర్వహణాధికారి సోనీ బాలదేవి, యువ భారత క్రీడా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జి.కిషోర్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో యువ భారత క్రీడా విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేయడం, అన్ని రకాల క్రీడలకు తగిన మైదానాలు నిర్మించడం గురించి చర్చించారు. ఒలింపిక్ క్రీడలను దృష్టిలో పెట్టుకొని క్రీడాకారులకు సమగ్ర శిక్షణ అందించేలా రాష్ట్రంలో అన్ని సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే గచ్చిబౌలి బయటి క్రీడా మైదానాన్ని పునరుద్ధరించి, అదే ప్రాంగణంలో అంతర్గత క్రీడా భవనం, విశ్వవిద్యాలయ సముదాయం, వసతి గృహాలు, వివిధ క్రీడలకు అవసరమైన మైదానాలు, శిక్షణా సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణాలకు సంబంధించిన పలు నమూనాలను పరిశీలించి వాటిపై సూచనలు చేశారు. భవిష్యత్తులో ఒలింపిక్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, అలాగే ఒలింపిక్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ చాటేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇక నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి క్రీడా మైదానం, లాల్ బహదూర్ శాస్త్రి క్రీడా మైదానం, సరూర్ నగర్ క్రీడా మైదానాలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు.

# మహిళలపై హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజంలో రోజు రోజుకు మహిళలపై పెరుగుతున్న హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని, ఆర్థిక, సామాజిక అసమానతలు నివారణకు సమగ్ర విధానాలు రూపొందించి అమలు చేయాలని ప్రజా సంఘాల మహిళా నేతలు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం భారత జాతీయ మహిళా సమాఖ్య, శ్రామిక మహిళా ఫోరం హైదరాబాద్ జిల్లా కమిటీలు సంయుక్తంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య శ్రామిక మహిళా ఫోరం నాయకులను తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు హసీనా బేగం, లక్ష్మీ బాయి, పార్వతి, స్వరూప, లక్ష్మి లను శాలువాలతో సన్మానించారు. ఇటీవల జరిగిన తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మహాసభలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మి బాయి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా హసీనాబేగంలు ఎన్నికైన సందర్భంగా యూనియన్ నాయకులు, శ్రామిక మహిళా ఫోరం, మహిళా సమాఖ్య నాయకత్వం శాలువాలతో కప్పి, మెమోంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రేంపావని, ఎస్.ఛాయాదేవి, ఎన్.కరుణ కుమారి మాట్లాడుతూ శ్రమశక్తిలో అధిక భాగస్వాములుగా వున్న మహిళలు వేతన వివక్షతను తొలగిస్తూ సమాన పనికి సమాన వేతనం అమలు చేసి మహిళలకు గౌరవప్రదమైన హోదా కల్పించే దిశగా ప్రణాళికలను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పడాల నళిని, సక్రిబాయి, ఫైమీద, ఇ.టి. మంజూష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# కూల్చిన చోటనే ఇండ్లు కట్టించాలి

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్... అరెస్టు




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎక్కడ బాధితుల ఇండ్లు కూల్చారో ఆ వెలుగుమట్ల రెవెన్యూలోనే బాధితులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వెలుగుమట్లలో బుల్‌డోజర్లతో ఇండ్లను నేలమట్టం చేసిన ఈ ప్రభుత్వానికి, నాయకులకు బాధితుల ఊసురు తగులుతుందని ఆమె అన్నారు. సోమవారం ఖమ్మం చేరుకున్న ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహారాజ్‌తో కలిసి అంబేడ్కర్ భవన్‌లోని వెలుగుమట్ల బాధితులను పరామర్శించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి జెడ్పి సెంటర్‌కు చేరుకున్నారు. జెడ్పి సెంటర్‌లో ఆందోళనకు దిగారు. చాలాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఆందోళనకారులను ఉద్దేశించి కవిత మాట్లాడుతూ బుల్‌డోజర్లతో పేదల నివాసాలను నేలమట్టం చేశారని ఆమె ఆరోపించారు. పేదల ఇండ్లను కూల్చే హక్కు ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారని కవిత ప్రశ్నించారు. బాధితుల వేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతుందని పరీక్షల సమయంలో ఇండ్లు కూల్చడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీశారన్నారు. గతంలో ఇండ్లు కూల్చే ప్రయత్నం చేసినా బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు పాపాలు కడుక్కునే ప్రయత్నంలో ఉన్నారని కవిత ఆరోపించారు. తాను ఎక్కడున్న పేదల పక్షానే ఉంటానని వెలుగుమట్ల బాధితుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు వారి పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ సమస్యపై జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడడం లేదని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదల మీద జులుం నడుస్తుందని ఆమె తెలిపారు. పేదల పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ధర్నా చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. వెలుగుమట్ల బాధితులను రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించగా కవితను ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమె అరెస్టుపై జాగృతి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా పోలీసులు లేకుండా అరెస్టు చేశారని, అసభ్యంగా ప్రవర్తించారని దీనిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు జాగృతి నాయకులు తెలిపారు. అంతకు ముందు అంబేద్కర్ భవన్ నుంచి జెడ్పి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

# మహిళా రైతులకు ఘన సన్మానం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ప్రముఖ డెయిరీ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా మహిళా రైతులు, మహిళలు నిర్వహిస్తున్న పాల సేకరణ కేంద్రాలను సంస్థ సత్కరించింది. హెరిటేజ్ ఫుడ్స్ పాల సేకరణ వ్యవస్థలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని సంస్థ పేర్కొంది. ఈ కార్యక్రమంలో అత్యుత్తమంగా పనిచేసిన మహిళా రైతులను సత్కరించారు. ఈ సమావేశానికి హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మహిళా రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, గత 33 సంవత్సరాలుగా హెరిటేజ్ ఫుడ్స్ రైతులతో కుటుంబంలా కలిసి ప్రయాణిస్తోందని, ఆ ప్రయాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబం, గ్రామం, దేశం బలపడుతుందని ఆమె అన్నారు.


## FORMAT C-1

**Declaration about Criminal Cases**

*(As per the judgement dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)*

**Name and Address of the Candidate** : **DR. ABHISHEK MANU SINGHVI**
R/o 14, JORBAGH,NEW DELHI - 110003.

**Name of the Political Party** : **INDIAN NATIONAL CONGRESS**

**Name of Election** : **BIENNIAL ELECTIONS TO THE COUNCIL OF STATES (RAJYA SABHA), 2026.**

**Name of Constituency** : **ELECTION TO THE COUNCIL OF STATES FROM TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

I, **Dr. Abhishek Manu Singhvi**, a candidate for the above-mentioned election, declare for public information the following details about my criminal antecedents:

**(A) Pending Criminal Cases**

| Sl. No. | Name of Court | Case No. and Dated | Status of Case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | Additional Chief Judicial Magistrate, (Economic Offence), Jodhpur. | There is no case number as the procedure is that till cognizance is taken by the magistrate, no case number is assigned. | Prosecution complaint filed before court of Ld. Addl. Chief Judicial Magistrate (Economic Offence) Jodhpur moved on 04.01.2021. Since 04.01.2021, no notice has been issued to the undersigned. These details were discovered by the undersigned pursuant to additional affidavit on behalf on CBDT served on undersigned on 07.01.2021 in WP 11176/20 at Delhi High Court. | Complaint is filed under section 276C (1), 277 of Income Tax Act 1961 read with Section 420 of IPC 1860. The IT department filed prosecution complaint for AY 2010-11, 2011-12, 2012-13 on 4.1.21 before the court of Ld. Addl. Chief Judicial Magistrate (Economic Offence) Jodhpur. Wherein the department has pleaded that the undersigned has inflated expenses causing wrongful loss to government and wrongful gain to himself and has willfully attempted to evade tax. |

**(B) Details about cases of conviction for criminal cases**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| -- NOT APPLICABLE -- | | | |


# అన్ని రంగాల్లో సమానంగా రాణిస్తున్న మహిళలు

## సిఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

## సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె.నారాయణ




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సిఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో ఇంద్రజిత్ మాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె.నారాయణ, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోస్యభట్ల కల్పన, పిల్లల వైద్య నిపుణురాలు, మగ్నా సెంటర్ ఫర్ ఒబేసిటీ, డయాబెటిక్, ఎండోక్రైనాలజీ డాక్టర్ శివరంజనీ సంతోష్‌లు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె.నారాయణ మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం, మహిళా సంక్షేమ కేంద్రం, ఎన్ ఆర్ ఆర్ రీసెర్చ్ సెంటర్, సురవరం సుధాకర్ రెడ్డి లైబ్రరీ, సిఆర్ పాలిక్లినిక్, సిఆర్ డయాగ్నోస్టిక్ సెంటర్ల ప్రాముఖ్యతను గురించి మహిళా సాధికారత, మహిళలు సాధిస్తున్న ఎన్నో విజయాల గురించి వివారించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా తమ ప్రతిభను చాటుతూ ముందుకేళ్తున్నారని తెలిపారు. తదుపరి మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోస్యభట్ల కల్పన, డాక్టర్ శివరంజనీలు మాట్లాడుతూ ఓఆర్ఎస్ ప్రాముఖ్యతను మార్కెట్ మోసాలను వివరించి అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు ఇప్పుడు కొనుగోలు చేసే ఓఆర్ఎస్ డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలకు అనుగుణంగా ప్రసిద్ధి చెందిన ఫార్మాసీలు, ఆసుపత్రుల నుండి వస్తాయని నిర్ధారించుకోవాలని తెలిపారు. క్రీడా పానీయాలు, సోడాలు, తీపి శక్తి పానీయాలను చికిత్స చేయాడానికి ఎప్పుడు ఉపయోగించకూడదని సూచించారు. తదుపరి వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళలను సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె.నారాయణ చేతుల మీదుగా సత్కరించారు. సత్కారాం పొందిన వారిలో డాక్టర్ శివరంజనీ, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ అరుణ, డాక్టర్ కే.రజనీ, జ్యోస్యభట్ల కల్పన, ఉషరాణి, నలిని, వి.లలిత, వి.లక్ష్మి , మమత, అరుణకుమారి, జోస్న్న, విజయలక్ష్మి , పల్లా విజయ, ఉపాధ్యాయులకు, కమిటీ సభ్యులు, వంకలక్ష్మి , లలిత, ప్రేమపావనిలు ఉన్నారు. మహిళా దినోత్సవ వేడుకలలో మహిళా సంక్షేమ కేంద్ర విద్యార్థినిలు ఆట, పాటలతో కార్యక్రమాలను నిర్వహించారు.

# విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు సిఎం హామీ

## హర్షం వ్యక్తం చేసిన భారత జాతీయ మహిళా సమాఖ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని హామీ ఇవ్వడం పట్ల భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్టెల సృజన, కార్యనిర్వాహక అధ్యక్షురాలు మండ సదాలక్ష్మి , ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా స్కూల్, కాలేజీలు, నివాసల మధ్య ఉన్న మద్యం షాపులను తక్షణమే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని వారు సిఎంకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా రోడ్లను ఆక్రమిస్తూ మద్యం షాపులను నడపడం వల్ల కాలేజీకి వెళ్లే విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నివాసాలు, స్కూల్స్, కాలేజీలకు అతీ సమీపంలో వైన్ షాపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

# యువత బహుముఖ నైపుణ్యాలను అలవర్చుకోవాలి




## గనుల శాఖ మంత్రి డా.జి.వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేటి ప్రపంచంలో ఒక్క నైపుణ్యం మాత్రమే సరిపోదని, యువత బహుముఖ నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా.జి.వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. హైదరాబాద్ మల్లేపల్లిలోని ఐటీఐ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఎటిసి)లో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై, పలు నూతన షార్ట్ టర్మ్ కోర్సులను ప్రారంభించారు. మంత్రి డా.వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, అధికారులు, ట్రైనర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
**అటవీ శాఖ ఏటూరునాగారం, ములుగు జిల్లా.**

ఆర్.నెం. సి.618/2022/S4 — షార్ట్ టెండర్ నోటీస్ — తేదీ: 07.03.2026

The list of OR Cases (44) and their offenders is as follows.

| Sl.No. | Type of Vehicle | Vehicle No. | Sl.No. | Type of Vehicle | Vehicle No. |
|---|---|---|---|---|---|
| 1 | BAJAJ MAXI (AUTO) | TS-25-T-7801 | 23 | TATA MAGIC | AP36TV1901 |
| 2 | CAR | AP09BS7394 | 24 | TATA SUMO | |
| 3 | TATA ACE | AP36TA4644 | 25 | BOLORO MAX TRUCK | TS08UB3019 |
| 4 | TATA XENON | AP25T0820 | 26 | MAHINDRA | B275D1 |
| 5 | SWARAJ (TRACTOR) | | 27 | DCM | AP31U3491 |
| 6 | BOLORO MAX TRUCK | AP 36TA7896 | 28 | JHONDEER DOJAR | |
| 7 | TATA XENON | | 29 | ELCHER TRACTOR | |
| 8 | TATA MAGIC | | 30 | DCM | AP5U7374 |
| 9 | BABAJ AUTO | AP20X3862 | 31 | ASHOK LAYLAND | AP36Z4555 |
| 10 | RX PICKUP | | 32 | LORRY | |
| 11 | SWARAJ (TRACTOR) | | 33 | BOLERO CAMPER | AP20T0353 |
| 12 | BOLORO MAX TRUCK | TS08UB9644 | 34 | TATA LORRY | AP36TA8608 |
| 13 | ASHOK LAYLAND | TS25T4255 | 35 | LORRY | AP21X0796 |
| 14 | DCM (MINI) | AP05Y5700 | 36 | MAHENDRA-275 WITH | |
| 15 | TATA ACE | AP29W2 | 37 | ASHOK LAYLAND | AP15Y6966 |
| 16 | SUPER ACE | | 38 | DCM | AP37V7939 |
| 17 | TATA ACE HIT | | 39 | MESSAY | |
| 18 | DCM(MINI) | AP20T | 40 | Tractor | TS25C2095 |
| 19 | TATA ACE | | 41 | PICKLIP VAN | AP-26-TA-9364 |
| 20 | TATA ACE | | 42 | MAHINDRA BOLERO | TS.03.UB 0939 |
| 21 | TATAMAGIC | | 43 | HONDA BYKE | JC85E-G-3334392 |
| 22 | RXPICKUP | | 44 | DCM | |

**Detail Notice:**
పైన తెలుపబడిన వాహనముల యజమానులకు తెలియజేయునది ఏమనగా, సదరు వాహనములను రాష్ట్ర ప్రభుత్వానికి శాశ్వతముగా స్వాధీనపరుచుకోవాలనే ప్రతిపాదనకు సంబంధించి ఏవైనా ఆక్షేపణలు ఉన్నచో, సదరు యజమానులు అట్టి ఆక్షేపణలను ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి (15) రోజులలోగా ఈక్రింద సంతకం దారునకు తెలియపరుచుకోవచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఎటువంటి నిర్ణీత తేదీలలో ఆక్షేపణలు అందని వాహనములను ప్రభుత్వమునకు శాశ్వతముగా దాఖలు చేయబడును అనితెలియపర్చనైనది.

సం/- ఏటూరునాగారం
(వన్యప్రాణుల అభయారణ్యం)
ములుగు జిల్లా

DIPR R.O. No. : 16658-PP/CL/ADVT/1/2025-26, Date: 09-03-2026



## వేం నరేందర్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ తరుపున రాజ్యసభ సభ్యుడిగా ముఖ్యమంత్రి మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేం నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజల అభివృద్ధి కోసం ఆయన మరింతగా సేవలందించాలని మంత్రి ఆకాంక్షించారు.

## భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో భూ నిర్వాసితులకు ఉద్యోగాలను ఇవ్వాలని, కాజీ పేట్‌లో రైల్వే డివిజన్‌ను, రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కోరారు. ఈ మేరకు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఏలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్‌తో కూడిన ప్రతినిధి బృందం సికింద్రాబాద్ కార్యాలయంలో సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్రలోని లాతూర్ లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేయ్యడంలో అక్కడి ఉద్యోగ ప్యాకేజీ తరహాలోనే కాజీపేట్ భూ నిర్వాసితులకు కూడా అమలు చేయాలని కోరారు. కాజీపేట్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు అవుతుందని రైల్వే జిఎం స్పష్టమిచ్చినట్లు ఆయన వివరించారు. వరంగల్ జిల్లాలో పలు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని కోరగా, అందుకు రైల్వే జిఎం.శ్రీవాస్తవ సానుకూలంగా స్పందించారని వినోద్ కుమార్ తెలిపారు. కాజీపేట్, సికింద్రాబాద్ పరిధిలోని స్టేషన్లలో సైకిల్, స్కూటర్ స్టాండ్లను, ఫుడ్, మల్టీ పర్పస్ స్టాళ్లు వంటి సౌకర్యాల కల్పన నిమ్మితం టెండర్ విధానంలో స్థానిక నిరుద్యోగ యువత,చిన్న స్థాయి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# పేదవాడి ఇండ్లు కూల్చడం మా ఉద్దేశం కాదు

నల్ల చెరువు ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : పేదవాడిని ఇబ్బంది పెట్టడం, ఇండ్లు కూలగొట్టడం మా ప్రభుత్వ ఉద్దేశం కాదని, వరదలు వచ్చినపుడు ముంపు బాధితులుగా మిగలకూడదు అనేది మా తపన అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కూకట్ పల్లిలో హైడ్రా పునరుద్ధరించిన నల్ల చెరువును సోమవారం ఆయన ప్రారంభించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించి, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ చెరువుల పునరుద్ధరణకు పూనుకున్నపుడు ఎంతమంది ఎన్ని ఆరోపణలు, విమర్శలు చేసినా మౌనంగా భరించాని, నల్ల చెరువు అభివృద్ధిని చూసాక ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూస్తే నాకు ఆ విమర్శలు ఆశీర్వాదంగా మారినట్లు కనిపిస్తోందన్నారు. పునరుద్ధరించిన చెరువుల వద్ద మహిళలకు స్టాల్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. దేశంలో మహానగరాలు సమస్యలతో సతమతమవుతున్నాయనీ, అందుకే మన నగరంలో ప్రకృతిని కాపాడుకుని చెరువులను పునరుద్ధరించుకుందామని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ నవీన్ రావు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రముఖ చరిత్రకారుడు పణిక్కర్ మృతి



తిరువనంతపురం : ప్రముఖ చరిత్రకారుడు, విద్యావేత్త, ప్రజా మేధావి కేఎన్ పణిక్కర్ సోమవారం కేరళలోని తిరువనంతపురంలో కన్నుమూశారు. ఆయన వయస్సు 89 సంవత్సరాలు. వయస్సు సంబంధిత అనారోగ్యం కారణంగా ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పణిక్కర్ తుది శ్వాస విడిచారు. పణిక్కర్ తన కఠినమైన, ఆధారిత చారిత్రక రచనకు, భారతీయ చరిత్రకు సంబంధించిన మతపరమైన వివరణలపై స్థిరమైన విమర్శకు విస్తతంగా ప్రసిద్ధి చెందారు. దశాబ్దాల పాండిత్యం ద్వారా, చరిత్రను మేధో సమగ్రతతో, సైద్ధాంతిక వక్రీకరణలు లేకుండా రాయాలని ఆయన వాదించారు. రాజస్థాన్ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వంటి సంస్థలలో బోధించిన ఆయన... 1972లో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో చేరారు. జేఎన్‌యూలో ఆయన చరిత్ర ప్రొఫెసర్‌గా, చారిత్రక అధ్యయనాల కేంద్రం అధిపతిగా, సామాజిక శాస్త్రాల పాఠశాల డీన్‌గా పని చేశారు. బోధనకు మించి ముఖ్యమైన విద్యా, సంస్థాగత పాత్రలను ఆయన నిర్వహించారు. 2008లో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన కేరళ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా పనిచేశారు.

**సీపీఐ సంతాపం**

ప్రముఖ చరిత్రకారుడు పణిక్కర్ మృతికి సీపీఐ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. ఆధునిక భారత చరిత్ర అధ్యయనంలో ఆయన విశేష కృషి చేశారని సీపీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. లౌకిక, హేతువాద భావజాలం ఆయన సొంతమని తెలిపింది. చరిత్రను మతపరంగా వక్రీకరించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని పేర్కొంది. శాస్త్రీయ, లౌకిక, ప్రజాస్వామిక విలువలు ఆయన రచనల్లో ప్రస్ఫుటించాయని తెలిపింది. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించింది.

# హరిణివనస్థలిలో అడుగడుగునా అక్రమాలు

మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీలో
వెలుగు చూసిన వైనం



ప్రజాపక్షం/హైదరాబాద్: నగరంలోని మహావీర్ హరిణి వనస్థలి నేషనల్ పార్క్‌లో ఉన్న అనన్య రిసార్ట్‌ను రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండాసురేఖ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసార్ట్ నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులతో కలిసి ఆమె పరిశీలన చేపట్టారు. తనిఖీలో రిసార్ట్‌లో సందర్శకులకు కనీస వసతులు కూడా సక్రమంగా అందించడం లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్లు, ఈత కొలను, కాటేజీలు, వంటగది తదితర విభాగాల్లో నిర్వహణ తీవ్రంగా నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. పర్యాటకులు, కుటుంబాలతో వచ్చే సందర్శకులకు ఇబ్బందులు కలిగే పరిస్థితులు ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఒక ప్రైవేట్ సంస్థ ఈ రిసార్ట్‌ను లీజ్‌కు తీసుకుని నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలను పాటించడంలో నిర్లక్ష్యం వహించిందని మంత్రి తెలిపారు. ఈ కాలంలో ప్రభుత్వానికి కేవలం ఒక్కసారి మాత్రమే పన్నులు చెల్లించినట్లు తనిఖీలో బయటపడిందన్నారు. అదే విధంగా సరైన బిల్లులు ఇవ్వకుండా బుకింగ్స్ నిర్వహిస్తున్నట్లు గుర్తించామని, దీనివల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లుతున్నదని మంత్రి తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని దాచిపెట్టే విధంగా కార్యకలాపాలు కొనసాగడం తీవ్రమైన అంశమని పేర్కొన్నారు. రిసార్ట్‌లో పనిచేస్తున్న సిబ్బందికి సరైన విధంగా జీతాలు చెల్లించడం లేదని, ఖాతాల ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని తనిఖీలో తేలిందన్నారు. వారికి పీఎఫ్ వంటి బీమా సదుపాయాలు కూడా కల్పించకపోవడం కార్మిక చట్టాలకు విరుద్ధమని మంత్రి అన్నారు. అటవీ ప్రాంతాల్లో నిర్వహించే పర్యావరణ పర్యాటక కార్యక్రమాలు ప్రకృతి పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. జాతీయ పార్క్ పరిధిలో జరిగే కార్యకలాపాలు వన్యప్రాణుల సంరక్షణకు అనుగుణంగా ఉండాలని, వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకూడదని తెలిపారు. ఈ నేపథ్యంలో మరో రెండు నెలల్లో ప్రైవేట్ సంస్థ వద్ద ఉన్న రిసార్ట్ నిర్వహణను పూర్తిగా రద్దు చేసి అటవీ శాఖ స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం ఈ ప్రాంతాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి పర్యావరణ పర్యాటక ప్రమాణాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ తనిఖీలో అటవీ శాఖ ఉన్నతాధికారులు ప్రియాంక వర్గీస్, రోహిత్ గోపిడి, వెంకటయ్య, సాయి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధిపై సిఎస్ సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కోసం చేపడుతున్న మౌలిక వసతుల పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామక్రిష్ణరావు సోమవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం చేపడుతున్న ప్రాజెక్టులు, మౌలిక వసతుల పనులపై వివరమైన నివేదికను సమర్పించారు. సమావేశంలో జహీరాబాద్‌లో ప్రతిపాదించిన పారిశ్రామిక స్మార్ట్ సిటీ, వరంగల్ సమీపంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్, మెగా పారిశ్రామిక కేంద్రాలు, ఔషధ పరిశ్రమల సముదాయాలు, అలాగే ప్రతిపాదిత భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రధాన ప్రాజెక్టుల పురోగతిని సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పారిశ్రామిక పార్కులు, సముదాయాల ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, ప్రారంభమైన ప్రాజెక్టులు, సృష్టైన ఉపాధి అవకాశాల వంటి ముఖ్య సూచికలను నమోదు చేసే సమగ్ర డిజిటల్ వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దీని ద్వారా పారిశ్రామికాభివృద్ధి పనుల పురోగతిని పారదర్శకంగా పర్యవేక్షించవచ్చని తెలిపారు.
జహీరాబాద్‌లో ప్రతిపాదిత పారిశ్రామిక స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు మంచి అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారే అవకాశం ఉందన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పురోగతిని సమీక్షిస్తూ, ఈ పార్క్ ద్వారా ముఖ్యంగా యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అవసరమైన మౌలిక వసతులను నిర్ణీత గడువులో పూర్తి చేసి పరిశ్రమలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పలు ప్రాజెక్టులకు సంబంధించి ఇతర శాఖలతో సమన్వయం అవసరమైన అంశాలపై వివరమైన నివేదిక సిద్ధం చేయాలని, పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతుల పనులకు స్పష్టమైన కాలపట్టిక రూపొందించాలని సూచించారు. పరిశ్రమలకు భూముల కేటాయింపులో పారదర్శక విధానాన్ని అమలు చేయాలని కూడా తెలిపారు. ఈ సమావేశంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, టిజిఐఐసి అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అరికట్టడమే లక్ష్యం
ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక కార్యచరణ రూపొందించడంతో పాటు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అరికట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోని నాలుగు ఎస్‌టిఎఫ్ టీమ్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, జిల్లా స్థాయిలో డిటిఎఫ్ టీమ్‌లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిరంతరం తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నాయన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న డ్రగ్స్, గంజాయి, ఎన్‌డిపిఎల్ అమ్మకాలపై ప్రత్యేక నిఘా కోసం కొన్ని హాట్ స్పాట్లను ఎంపిక చేశామని చెప్పారు. ధూల్‌పేట్, నారాయణగూడ, ఫతేనగర్, సీతాఫల్మండి, నేరేడ్‌మెట్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, మూసాపేట్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, నాగోల్, అన్నోజిగూడ, ముగూరు బస్తీలతో పాటు రైల్వే స్టేషన్లు, చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఢిల్లీ, నోయిడా, గోవా, హర్యానా, ప్రాంతాల నుంచి నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ ఎక్కువగా వస్తున్నట్లు ఎక్సైజ్‌శాఖ గుర్తించిందని, హైదరాబాద్ ఎయిర్ పోర్టు ద్వారా వచ్చిన మద్యాన్ని శంషాబాద్, సరూర్‌నగర్, మీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు నిర్వహించి, రెండు నెలల్లో 335 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు 43 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణలో మొత్తంగా 1251 కేసుల్లో 16,103 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు.

**గంజాయి, డ్రగ్స్ రవాణాపై నిఘా..**

ఎన్‌డిపిఎల్ మద్యంతో పాటు గంజాయి, డ్రగ్స్‌పై కూడా ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టిందని, 2025 సంవత్సరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ నిర్వహించిన దాడుల్లో 565 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. 2025 సంవత్సరంలో ఎస్‌టిఎఫ్ టీమ్‌లు 1346 కేజీల గంజాయి పట్టుకోవడంతో పాటు 686 గంజాయి మొక్కలను, ఓజీ కుష్.ఎండిఎంఎ, హాషీష్ అయిల్, గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ 99 రోజుల్లో దాడులను మరింతగా ముమ్మరం చేసి గంజాయి, డ్రగ్స్, ఎన్‌డిపిఎల్ మద్యాన్ని పట్టుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు షానవాజ్ ఖాసీం పేర్కొన్నారు.

## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టాం

భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టామని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతిపక్ష పార్టీల ఎంపీలకు మాట్లాడే అవకాశాలు ఇవ్వకుండా స్పీకర్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాట్లాడే ప్రతిసారి అంతరాయం కలిగిస్తూ అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. అయితే అధికార పక్షానికి చెందిన ఎంపీలకు మాత్రం ప్రాధాన్యత ఇస్తూ మాట్లాడే అవకాశాలు కల్పిస్తున్నారని విమర్శించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభలో ఉన్న ప్రతి సభ్యుడికి సమానంగా మాట్లాడే అవకాశం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అన్నారు. 18వ లోక్‌సభలో ప్రతిపక్షాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, అవసరం లేకపోయినా కొంతమంది సభ్యులకు మైక్ ఇచ్చి సభ ను తప్పుడు దిశలో నడిపిస్తున్నారని ఆయన ఆరోపించారు. మహిళా ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్రమోదీపై దాడి చేయడానికి ప్రయత్నించారని చెప్పడం కూడా తప్పుడు వ్యాఖ్యేనని పేర్కొన్నారు. అలాగే అంతర్జాతీయ అంశాలైన ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధంపై లోక్‌సభలో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ సూచనల మేరకు భారత్ పనిచేస్తోందనే భావన కలిగే విధంగా పరిస్థితులు ఉన్నాయని ఆయన విమర్శించారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. లోక్‌సభలో ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేసిన అంశంపై కూడా చర్చ జరగాలని, అవిశ్వాస తీర్మానం సందర్భంగా ఆ సభ్యులకు కూడా ఓటు వేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో లోక్‌సభ మకర్ ద్వార్ వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. దేశంలో గ్యాస్, మందుల ధరలు పెరుగుతున్న అంశాలపై కూడా పార్లమెంట్‌లో చర్చించాల్సిన అవసరం ఉందని, ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఏ దేశం ఆధీనంలోనూ ఉండకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

## తెలంగాణ ఉద్యమం తరహాలో బిసి హక్కుల కోసం పోరాటం



బిసి నేతల ముఖ్య సమావేశంలో పలువురు వక్తలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో ఎలా ఐక్యంగా పోరాడామో, అలాగే ఇప్పుడు బిసి హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, మనలో ఉన్న లోపాలను సరిచేసుకుంటేనే బిసి సమాజానికి రాజకీయ భవిష్యత్తు బలంగా ఉంటుందని పలువురు వక్తలు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులో బిసిలకు చేస్తున్న అన్యాయంపై బిసి డెమోక్రటిక్స్ జెఎసి చైర్మన్ కోలా జనార్దన్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనచారి, ఎల్.రమణ, బండ ప్రకాష్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, బూర నర్సయ్యగౌడ్, పుట్ట మధుకర్, జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎర్ర సత్యం, చిరంజీవులు, పల్లె రవి తదితరులతో సమావేశం నిర్వహించారు. 'మన దగ్గర గ్రూపులు, మనలోనే ఈర్ష్య, ఇవే మన బలహీనతలు. కాబట్టి మనం చేయాల్సింది ఒక్కటే బిసిల ఐక్యత. ఎవరైనా బిసి నాయకుడు ముందుకు వస్తే అతన్ని కిందకి లాగకుండా, అతని వెనుక నిలబడాలి. మన ఓటు శక్తిని, మన సంఖ్యను, మన సంఘాలను ఒకటిగా కట్టాలి. అప్పుడే రాజకీయాల్లో మనకు సరైన ప్రాధాన్యం వస్తుందని' పలువురు వక్తలు అన్నారు. మధుసూదనచారి మాట్లాడుతూ 'నేను ఇటీవల బిసిలపై రాసిన ఒక పుస్తకం చదివాను. అందులో రెడ్డి వర్గం వారికి రావాల్సిన వాటా కంటే 8 రెట్లు ఎక్కువ అధికారాన్ని పొందింది. వెలమలు 30 రెట్లు ఎక్కువ పొందారు. కమ్మలు 6 రెట్లు ఎక్కువ పొందారు. బ్రాహ్మణులు 9 రెట్లు ఎక్కువ పొందారు. కానీ బిసిలలో ఏ కులానికీ తమ వాటా కన్నా ఎక్కువ ప్రాతినిధ్యం దక్కలేదు' అని అన్నారు.

## టెండర్ల వ్యవహారంలో కోర్టు జోక్యం పరిమితం

ప్రజాపక్షం/హైదరాబాద్: టెండర్ల విషయంలో తుది నిర్ణయం ప్రభుత్వానిదేనని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. పక్షపాతం లేదా విధానపరమైన లోపాలు నిరూపితమైతే తప్ప న్యాయస్థానం జోక్యం చేసుకోదని తెలిపింది. ఇప్పటికే జారీ చేసిన టెండర్లను రద్దు చేసి కొత్తగా పిలిచే అధికారం టెండరింగ్ సంస్థకు ఉంటుందని పేర్కొంది. గోదావరి పుష్కరాల నేపథ్యంలో వేములవాడ పరిసరాల్లో చేపట్టనున్న రూ.50 కోట్ల రోడ్ల విస్తరణ పనుల టెండర్లపై శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ దాఖలు చేసిన అప్పీల్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం సోమవారం తిరస్కరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది.

## 26న హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఎన్నికలను ఈ నెల 26న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ నెల 10 నుంచి 12 వరకు నామినేషన్లు స్వీకరించగా, 13న ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 26న పోలింగ్ జరగనుంది. రిజర్వేషన్‌లో భాగంగా అదనపు కార్యదర్శి, రెండు ఎగ్జిక్యూటివ్ సభ్యుల స్థానాలను మహిళలకు కేటాయించారు. ఇదే సమయంలో జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్‌ల ఎన్నికలకు కూడా నోటిఫికేషన్‌లు జారీ అయ్యాయి.



కుటుంబ సభ్యులతో కలిసి డిప్యూటీ సిఎం మల్లుభట్టి విక్రమార్క సోమవారం తిరుమల క్షేత్రంలో శ్రీవారిని సోమవారం దర్శించుకున్నారు. నూతన దంపతులు సూర్య విక్రమాదిత్య సాక్షి లకు ఆయురారోగ్యాలు కలగాలని, అలాగే తెలుగు రాష్ట్రాల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రార్థించినట్టు భట్టి విక్రమార్క తెలిపారు. త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ ద్వారా తెలంగాణ రాష్ట్రం ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత పురోగతి సాధించి, విజన్ 2047లక్ష్యంగా ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదగాలని భట్టి విక్రమార్క స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

ఇ-టెండర్ నోటీసు నం. 05/DRM/MECH/NED/OT/2025-26 తేదీ 06.03.2026
PUB/2069
కింద సంతకం చేసిన అధికారి ఈ క్రింది పనుల కోసం ఓపెన్ ఇ-టెండర్‌ను ఆహ్వానించడమైనది
క్ర.సం.: 01 టెండర్ నం.: T-12/N/M/Weld Grid/PL/NED Div/RT/25-26 పని పేరు: NED డివిజన్ యొక్క ఏడు పిట్ లైన్ల వద్ద వెల్డింగ్ గ్రిడ్ సౌకర్యాల ఏర్పాటు (NED=3, PAU=1, J=1, AWB=1, ADB=1) మరియు సరుకు రవాణా పరీక్ష సౌకర్యాలు (PAU=1). పని యొక్క సుమారు విలువ (రూ.): 63,22,495/- (GSTతో సహా) EMD (రూ.): 1,26,500/- టెండర్ ఫారం ధర (రూ.): NIL (FA&CAO/SC's Lr.No.A/GST/Clarifications/2019, dt.06.04.2020 చూడండి)
పైన పేర్కొన్న టెండర్లు 30.03.2026న మధ్యాహ్నం 3.00 గంటలకు మూసివేయబడతాయి.
ఇతర వివరాలు మరియు ఇ-టెండర్ల సమర్పణ కోసం, దయచేసి www.ireps.gov.in వెబ్‌సైట్‌లో టెండర్ డాక్యుమెంట్‌ను తనిఖీ చేయండి.
సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్, నాందేడ్

టెండర్ నోటీసు నం: G/E.29/Tr./ Tender Notice/62/2025-26
PUB/2070
భారత రాష్ట్రపతి తరపున వారి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ ట్రాక్షన్/ గుంతకల్ కింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.
టెండర్ నంబర్: GTL-TRD-29-eTN-94-2025-26 పని పేరు: GTL విభాగం: GTL డివిజన్లో విశ్వసనీయత మరియు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎర్తింగ్ స్టేషన్, బ్యాటరీ సెట్లు మరియు PSI పరికరాల అప్‌గ్రేడ్. సుమారు విలువ (రూ.): 1,27,22,645.22/- EMD (రూ.): 2,13,600/- టెండర్ ముగింపు తేదీ & సమయం: 31.03.2026 మధ్యాహ్నం 3 గంటలకు
గమనిక:
1. టెండర్ డాక్యుమెంట్‌ను టెండరుదారులు www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
టెండర్ మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.inకు లాగిన్ అవ్వండి, ఏదైనా ఉంటే సవరణను ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్

ఇ-టెండర్ నోటీసు నం. 490/DRM/W/GNT
PUB/2072
కింద పేర్కొన్న పనుల కోసం 07.04.2026 మధ్యాహ్నం 3:30 గంటల వరకు సంతకం చేసిన వ్యక్తి ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.
క్ర.సం.: 01 టెండర్ ఐడి: 2847 Sr DEN/DEN: Sr DEN/West పని వివరణ: TFTR - GNT-లోని సెస్ బి/డబ్ల్యు NBR-MAG స్టేషన్లకు వెడల్పు/ మరమ్మతులు DEN/ వెస్ట్/GNT విభాగంలో KCC విభాగం (బి/డబ్ల్యు ట్రాక్‌లలో సెస్ పని:117565 కమ్, సెస్ బి/డబ్ల్యు వెడల్పు: 36034 కమ్, Toe బ్యాంక్: 51870 కమ్, సెంట్రల్ డ్రెయిన్-9600 మీ). సుమారు విలువ (రూ.): 13,11,98,221/- బిడ్ సెక్యూరిటీ (రూ.): 8,06,000/-
1. ఇ-బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీ 07.04.2026 మధ్యాహ్నం 3:30 వరకు. వివరణాత్మక సమాచారం కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి.
2. ఏవైనా తదుపరి కమ్యూనికేషన్/ సవరణలు ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయాలి
డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), గుంటూరు

ఇ-టెండర్ నోటీసు నం. B/E.EGS/ 21/2025-26 తేదీ: 05.03.2026
PUB/2071
భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున, క్రింద పేర్కొన్న తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు కింది పనుల కోసం సంతకం చేసిన అధికారి ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు:
క్ర.సం.: 01 టెండర్ నం.: B/E.29/1/EGS/ 37/25-26 తేదీ.03.03.2026 పని పేరు: BZA డివిజన్ - (i) BZA డివిజన్ సరైన రేటింగ్ ఉన్న యు.జి కేబుల్‌లను అందించడం ద్వారా విద్యుత్ సరఫరా విశ్వసనీయతను మెరుగుపరచడం మరియు బలోపేతం చేయడం. (ii)BZA డివిజన్ స్టేషన్లు మరియు ఎ.టి కేబుల్‌కు ఫీడింగ్ చేస్తున్న లోపభూయిష్ట యు.జి కేబుల్‌లను భర్తీ చేయడం. టెండర్ విలువ (రూ.): 5,92,33,942-86 E.M.D./ బిడ్ సెక్యూరిటీ (రూ.): 4,46,200 టెండర్ డాక్యుమెంట్ ధర (రూ.): శూన్యం పూర్తయిన కాలం: 6 నెలలు ముగింపు తేదీ: 25.03.2026
క్ర.సం.: 02 టెండర్ నం.: B/E.29/1/EGS/ 38/25-26 తేదీ.03.03.2026 పని పేరు: BZA డివిజన్:- (i) ELS/BZA;-| ప్రతిపాదిత ఎక్స్టెండెడ్ ML బై (02 స్పాన్స్)-ఎలక్ట్రికల్ అరేంజ్‌మెంట్‌లలో (500 T) మెషీన్లో హైడ్రాలిక్ వీల్ ప్రెస్ ఏర్పాటు. (ii) BZA డివిజన్, Qty-27 కోచ్‌లపై స్వల్పకాలిక భద్రతా చర్యలుగా ట్రాక్ మెషిన్ క్యాంపింగ్ కోచ్లకు విద్యుత్ అరేంజ్‌మెంట్‌లను అందించడం. టెండర్ విలువ (రూ.): 1,20,48,608-00 E.M.D./బిడ్ సెక్యూరిటీ (రూ.): 2,10,300 టెండర్ డాక్యుమెంట్ ధర (రూ.): శూన్యం పూర్తయిన కాలం: 6 నెలలు ముగింపు తేదీ: 25.03.2026
క్ర.సం.: 03 టెండర్ నం.: B/E.29/1/EGS/ 39/25-26 తేదీ.05.03.2026 పని పేరు: BZA డివిజన్ 1) ADEN/ TUNI సబ్-డివిజన్ కింద SSE/ వర్క్స్/TUNI విభాగంలో వే సైడ్ స్టేషన్లలో దివ్యాంగజన సౌకర్యాల ఏర్పాటు; 2) BZA-VSKP విభాగం:- చేబ్రోలు- దువ్వాడ స్టేషన్ల మధ్య నీటి సరఫరా వ్యవస్థ & RO ప్లాంట్ల ఏర్పాటు; 3) GLU, REG, NASP;-SSE/W/TUNI విభాగంలో PF నం. 1,2&3లో IRS రకం PF షెల్టర్ల నిర్మాణం; 4) ADEN/SLO సబ్ డివిజన్లోని ANV వద్ద ప్లాట్‌ఫారమ్ 1,2&3 పై IRS రకం ప్లాట్‌ఫారమ్ షెల్టర్లను కవర్ చేయడం; 5) సీనియర్ DEN/నార్త్ /BZA అధికార పరిధిలోని PAP, GLP, MPU & BVL స్టేషన్లలో ప్లాట్‌ఫారమ్ 1,2&3 పై IRS రకం ప్లాట్‌ఫారమ్ షెల్టర్లను కవర్ చేయడం.- విద్యుత్ ఏర్పాట్లు. టెండర్ విలువ (రూ.): 72,13,355.44 E.M.D./బిడ్ సెక్యూరిటీ (రూ.): 1,44,300 టెండర్ డాక్యుమెంట్ ఖర్చు (రూ.): లేదు పూర్తయిన వ్యవధి: 12 నెలలు ముగింపు తేదీ: 27.03.2026
1) టెండర్ షరతులు / వివరాలు వంటి ఇతర వివరాలు పూర్తిగా పని పేరు, పైన పేర్కొన్న పనుల సారూప్యత, అర్హత ప్రమాణాలు మొదలైనవి 'www.ireps.gov.in' వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) టెండర్ ముగింపు తేదీకి ముందు 'www.ireps.gov.in' వెబ్‌సైట్‌ను సందర్శించి, ఏదైనా టెండర్‌కు సంబంధించిన ఏవైనా మార్పులు/ సవరణలను గమనించాలని భావి టెండరుదారులకు సూచించబడింది.
డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), విజయవాడ
A2623
మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# పశ్చిమాసియా పరిస్థితిపై చర్చ జరపాల్సిందే

## లోక్‌సభలో ప్రతిపక్షాల డిమాండ్

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ సెషన్ సోమవారం నుంచి ప్రారంభమైంది. పశ్చిమాసియా పరిస్థితిపై ప్రతిపక్షాలు చర్చకు డిమాండ్ చేయడంతో తొలి రోజు లోక్‌సభ పలు మార్లు వాయిదా పడింది. ప్రతిపక్షాలు సభ ప్రాథమిక నైతికతను పాటించడం ఆరోపించింది. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ 'పశ్చిమ ఆసియాలో పరిస్థితి'పై ప్రకటన చేయడానికి లేచిన వెంటనే, ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభంపై పూర్తి స్థాయి చర్చకు డిమాండ్ చేశారు. సభకు అధ్యక్షత వహించిన జగదాంబికా పాల్, ప్రతిపక్షాలు ప్లకార్డుల ద్వారా లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం విపులంగా సమాధానం ఇస్తోందని చెప్పారు. లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లాను తొలగించాలనే తీర్మానం ఇప్పటికే ఎజెండాలో ఉన్నప్పటికీ, పశ్చిమాసియా గురించి చర్చించడానికి ప్రతిపక్షాలు వాయిదా నోటీసు కోసం ఒత్తిడి తెస్తున్నాయని ఆయన అన్నారు. ప్రతిపక్షాలు ఒకే రోజు రెండు అంశాలపై ఎలా చర్చించాలనుకుంటున్నాయో అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మంత్రి జైశంకర్ స్టేట్‌మెంట్‌తో సంతృప్తి చెందకపోతే, దయచేసి ఈ అంశంపై చర్చ కోరుతూ బిఎసిని సంప్రదించాలని పాల్ అన్నారు. అయితే మంత్రి జైశంకర్ పశ్చిమాసియా పరిస్థితులపై స్టేట్‌మెంట్ పూర్తి చేసిన తర్వాత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రతిపక్షాలు సభా నైతికతను పాటించడం లేదని ఆరోపించారు. సభ్యులు తమ సీట్లకు తిరిగి వెళ్లాలని కోరుతూ, సభ సజావుగా సాగుతున్నపుడు స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని తీసుకుంటామని పాల్ అన్నారు. విపక్షాలు వెనక్కి తగ్గకపోవడంతో కార్యకలాపాలను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు. ఉదయం సభ ప్రారంభం కాగానే ఇటీవల మరణించిన ఒక సిట్టింగ్, నలుగురు మాజీ సభ్యులకు నివాళులు అర్పించిన తర్వాత సభను గంటసే పు వాయిదా వేశారు. ఇక రాజ్యసభలో కాంగ్రె స్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే పశ్చిమాసియా వివాదం మధ్య భారతదేశ ఇంధన భద్రతకు ఎదురవుతున్న సవాళ్లపై స్వల్పకాలిక చర్చను డిమాండ్ చేశారు. పశ్చిమాసియాలో అభివృద్ధి చెందుతున్న పరిస్థితిపై విదేశాంగ మంత్రి స్వయంగా ప్రకటన చేయడాని కి ముందు ఖర్గే ఈ అంశాన్ని లేవనెత్తారు. జైశంకర్ ప్రకటన చేస్తున్న సమయంలో నినాదాలు చేస్తూ, ప్రకటన చివరిలో ప్రతిపక్షాలు వా కౌట్ చేశారు.





**పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల నిరసన**

పశ్చిమాసియా వివాదంపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రతిపక్షాలు పార్లమెంట్ ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించాయి. పశ్చిమాసియాకు సంబంధించిన కీలక అంశాలపై ప్రభుత్వం మౌనం వహించడంపై తీవ్ర విమర్శలు చేశాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ఎస్‌పి చీ ఫ్ అఖిలేష్ యాదవ్ సహా ప్రతిపక్ష ఎంపిలు నిరసనలో పాల్గొన్నారు. అంతకు ముందు బడ్జెట్ సె షన్ రెండవ భాగంలో వ్యూహాన్ని చర్చించడానికి పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లోని రాజ్యసభ నాయకుడు ఖర్గే చాంబర్‌లో ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లు సమావేశమయ్యారు. ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్ గోపాల్ యాదవ్, డిఎంకెకు చెందిన దయానిధి మారన్, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, శివసే న (యుబిటి)కు చెందిన సంజయ్ రౌత్ తదితరు లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇరాన్‌తో అ మెరికా–ఇజ్రాయెల్ యుద్ధం మన దేశ సరిహద్దు కు చేరుకుందని, ఈ నేపథ్యంలో బడ్జెట్ సెషన్ రెండవ భాగానికి పార్లమెంట్ తిరిగి సమావేశమవుతున్నందున ప్రస్తుత భౌగోళిక రాజకీయ సంక్షో భ ంపై పూర్తి స్థాయి చర్చ నిర్వహించడం అత్యవసరమని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రి ఏకపక్ష ప్రకటన పరిష్కారం కాదని, మనం దేశాన్ని సమష్టిగా విశ్వాసంలోకి తీసుకోవాలన్నారు. మన ఇంధన భద్రతను నిర్ధారించడానికి, వ్యాపారులకు సహాయం చేయడానికి, మన ఎగుమతులకు సరఫరా గొలుసులను వైవిధ్యపరచడానికి, ధరల పెరుగుదలతో మన ప్రజలను శిక్షించడ ం ఆపడానికి జిఓఐ ఒక వివరణాత్మక ఆకస్మిక ప్ర ణాళికను రూపొందించాలని సమావేశం తర్వాత ఖర్గే అన్నారు. అనంతరం ప్రతిపక్ష ఎంపిలు పశ్చిమాసియా వివాదంపై చర్చకు డిమాండ్ చేసూ, దానికి సంబంధించిన క్లిష్టమైన అంశాలపై ప్రభుత్వం మౌనం వహించినందుకు విమర్శిస్తూ పార్లమెంటు మకర్ ద్వార్ సమీపంలో నిరసన తెలిపారు. 'గల్ఫ్ దహనం. చమురు షాక్. భారతీయులు చిక్కుకుపోయారు. భారతదేశానికి నాయకత్వం అవసరం.. నిశ్శబ్దం కాదు' అని రాసిన భారీ బ్యానర్‌తో ఎంపిలు ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# మరో ఐదు కూనలకు జన్మనిచ్చిన చిరుతపులి జ్వాల

### దేశంలో 50 దాటిన చిరుతల సంఖ్య



**న్యూఢిల్లీ :** దేశంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రాజెక్ట్ చీతా' మరో కీలక మైలురాయిని అందుకుంది. మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో సోమవారం 'జ్వాల' అనే నమీబియన్ ఆడ చీతా ఐదు కూనలకు జన్మనిచ్చింది. దీంతో దేశంలో చీతాల సంతతి మరింత పెరిగింది. ఈ కొత్త కూనల రాకతో దేశంలో పుట్టిన చీతా పిల్లల మొత్తం సంఖ్య 33కు చేరుకుంది. అదేవిధంగా దేశంలోని మొత్తం చీతాల సంఖ్య 53 కి పెరిగింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఇది 'ప్రాజెక్ట్ చీతా'కు గర్వకారణమని ఆయన అభివర్ణించారు. విజయవంతంగా మూడోసారి తల్లి అయిన 'జ్వాల' కూనో నేషనల్ పార్క్‌లో ఐదు కూనలకు జన్మనిచ్చిందని చెప్పారు. ఇది భారతదేశ వన్యప్రాణి సంరక్షణ ప్రయత్నాలలో మరొక మైలురాయి అని పేర్కొన్నారు. భారతదేశ గడ్డపై ఇది 10వ విజయవంతమైన చీతాల జననం అని మంత్రి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ప్రాజెక్ట్ విజయం కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న పశువైద్యులు, అటవీ అధికారులు, సిబ్బంది అంకితభావానికి ఇది నిదర్శనమని కొనియాడారు. 2022లో సెప్టెంబర్ 17న నమీబియా నుంచి తొలి విడతలో భారత్‌కు తీసుకొచ్చిన ఎనిమిది చీతాల్లో 'జ్వాల' ఒకటి. భారత్‌కు వచ్చినప్పటి నుంచి ఇ ది మూడోసారి పిల్లలకు జన్మనిచ్చింది. కాగా గత నెలలోనే 'గామిని' అనే మరో చీతా కునో పార్క్‌లో నాలుగు కూనలకు జన్మనిచ్చింది. అ లాగే ఫిబ్రవరి 28న బోట్స్వానా నుంచి ఆరు ఆ డ, మూడు మగ చీతాలతో కూడిన మూడో బ్యా చ్‌ను కునో పార్క్‌లోకి విడుదల చేశారు. ఆ త ర్వాత కొద్దిరోజులకే ఈ శుభవార్త వెలువడింది.

# ఎల్‌పిజి బుకింగ్ గడువు 25 రోజులకు పెంపు

### ఉత్పత్తి పెంచాలని రిఫైనరీలకు సర్కార్ ఆదేశం



**న్యూఢిల్లీ :** అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌లను అరికట్టే ఉద్దేశంతో ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల బుకింగ్ గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచినట్లు సోమవారం ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 'గతంలో 55 రోజులకు ఒకసారి సిలిండర్ బుక్ చేసుకునేవారు, ప్రస్తుతం 15 రోజులకే బుకింగ్ చేస్తున్న సందర్భాలు ఉన్నాయని' పేర్కొన్నాయి. అంతేకాదు, ఎల్‌పిజి ఉత్పత్తిని వేగవంతం చేయాలని ప్రభుత్వం రిఫైనరీలను ఆదేశించింది. కమర్షియల్ కనెక్షన్ల కంటే గృహ వినియోగదారుల అవసరాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, భారత్ కొత్త ఎల్‌పిజి భాగస్వామ్య దేశాల కోసం అన్వేషిస్తోంది. ఇప్పటికే అల్జీరియా, ఆస్ట్రేలియా, కెనడా, నార్వే మొదలైన దేశాలు భారత్‌కు ఎల్‌పిజి విక్రయించేందుకు ముందుకు వచ్చాయని తెలుస్తోంది. ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 130 డాలర్ల మార్కును దాటితే తప్ప, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత్ వద్ద తగినంత నిల్వలు ఉన్నందున ధరల పెరుగుదల ఉండకపోవచ్చని పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, చాలా వరకు ముడి చమురు ధరలు బ్యారెల్‌కు సుమారు 100 డాలర్లు వద్ద ఉండవచ్చని అంచనా వేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం దేశంలోని ఏ పెట్రోల్ పంపులోనూ ఇంధన కొరత లేదని వారు స్పష్టం చేశారు. భారత్‌కు ప్రధానంగా హోర్ముజ్ జలసంధి నుంచి ఎక్కువగా ముడి చమురు దిగుమతులు వస్తుంటాయి. కానీ దానిని ఇరాన్ మూసివేయడంతో, ఇతర మార్గాల ద్వారా ముడి చమురు దిగుమతి చేసుకునే ప్రక్రియను భారత్ వేగవంతం చేసిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# మూడు దశలకు మించకుండా ఎన్నికలు

- బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పాలు పార్టీలు విజ్ఞప్తి

కోల్‌కతా : బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలను 3 దశలకు మించకుండా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరాయి రాజకీయ పార్టీలు. ఇసిఐ పూర్తిస్థాయి బెంచ్‌ను కలిసిన పలు పార్టీలకు చెందిన ప్రతినిధుల బృందాలు ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. ఎన్నికల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఇసిని కోరాయి పార్టీలు. ఇందులో టిఎంసితో పాటు బిజెపి, సిపిఐ (ఎం), కాంగ్రెస్, ఆప్, ఎన్‌పిపి, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు ఉన్నాయి. 'రాష్ట్రంలో ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాం. పలు పార్టీలు రాష్ట్రంలో ఒకటి లేదా రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని కోరాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఇసికి సహకరిస్తామని తెలిపాయి. కేంద్ర సాయుధ బలగాలతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలి. ఫలితంగా ఓటర్లు ఎలాంటి భయం లేకుండా వారి హక్కును వినియోగించుకుంటారని చెప్పారు' అని ఎన్నికల సంఘం వర్గాలు ప్రకటనలో పేర్కొన్నాయి. క్రూడ్ బాంబులు వినియోగించే అవకాశం ఉందని కొన్ని పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. అక్రమ ఆయుధాలతో పాటు నగదు రవాణను అరికట్టాలని విజ్ఞప్తి చేశాయి. ఈ క్రమంలోనే స్పందించి ఈసీ, ఎన్నికల చట్ట ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. హింసాత్మక ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి చేస్తామని తెలిపింది. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై స్పందించిన సిఇసి, ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఇప్పటికీ ఓటర్ జాబితాలో నమోదు, తొలగింపునకు, సవరణల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అంతకుముందు ఇసిని కలిసిన బిజెపి బంగాల్ ప్రతినిధుల బృందం, అసెంబ్లీ ఎన్నికలకు ముందు బంగాల్‌లో భద్రతా అంశాలపై ఆందోళనలను వ్యక్తం చేసింది. ఈ మేరకు అందుకు సంబంధించి 16 పాయింట్లతో కూడిన వినతి పత్రాన్ని ఇసికి సమర్పించింది. ఎన్నికల నిర్వహణ 3 దశలకు మించకుండా చూడాలని విజ్ఞప్తి చేసింది. ఎటువంటి అల్లర్లకు తావులేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇసిని కోరింది. అలాగే సున్నితమైన పోలింగ్ బూత్‌లను గుర్తించే ప్రమాణాలను పునర్నిర్వచించాలని అభ్యర్థించింది. 'బెంగాల్ ఎన్నికలు ఒకే దశలో నిర్వహించాలని డిమాండ్ చేశాం. ఒక వేళ కాదనుకుంటే రెండు దశలకు మించకూడదని కోరాం. ఎన్నికలు స్వేచ్ఛాయుత, పారదర్శక పద్ధతిలో జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తర్వాత అర్హులైన ఓటర్లతో కూడిన జాబితాను ప్రచురించాలని డిమాండ్ చేశాం' అని సిపిఐ (ఎం) కార్యదర్శి మహ్మద్ సలీం చెప్పారు.




**ఎస్ఐఆర్ ఆందోళనలను పట్టించుకోవడం లేదన్న టిఎంసి**

ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై నెలకొన్న ఆందోళనపై కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదని టిఎంసి ఆరోపించింది. ఇసి పూర్తిస్థాయి బెంచ్‌ను కలిసిన అనంతరం మంత్రి చంద్రిమ భట్టాచార్య ఈ మేరకు ఆరోపించారు. కోల్‌కతాలోని ఓ హోటల్‌లో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్, వివేక్ జోషి, బంగాల్ సీఈఓ మనోజ్ అగర్వాల్ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు.

# యాసిడ్ దాడి బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు

### సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు

**న్యూఢిల్లీ:** యాసిడ్ దాడుల బాధితులకు పరిహా రం కల్పించే విషయంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులిచ్చింది. బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేలా విధానాన్ని రూపొందించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఒకవేళ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేని పక్షంలో.. బాధితుల జీవనాధారం కోసం భత్యం చెల్లించేలా విధానాలు రూపొందించాలని సూచించింది. ఈ మేరకు సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. యాసిడ్ దాడి బాధితులకు ప్రభుత్వ విభాగాలు/ఏజెన్సీల్లో ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేరో స్పష్టమైన కారణాలు తెలియజేయాలని సుప్రీంకోర్టు రాష్ట్రాల ను ఆదేశించింది.

# కరూర్ కేసు: విజయ్‌కు సిబిఐ మరోసారి నోటీసులు



**న్యూఢిల్లీ :** ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ అధినేత విజయ్‌కు సిబిఐ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంగా మారింది. విజయ్ తన రాజకీయ పార్టీ టివికెను ప్రకటించి, వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ సిబిఐ నోటీసులు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కరూర్ కేసులో మరిన్ని వివరాలు సేకరించేందుకు సిబిఐ అధికారులు విజయ్‌ను విచారణకు రావాలని కోరుతూ నోటీసులు పంపారు. కాగా, నోటీసులపై స్పందించిన విజయ్, అధికారులకు లిఖితపూర్వక సమాధానం పంపారు. ప్రస్తుతం ఉన్న బిజీ షెడ్యూల్, ఇతర కారణాల వల్ల మంగళవారం జరగాల్సిన విచారణకు హాజరు కాలేనని విజయ్ స్పష్టం చేశారు. విచారణకు సిద్ధమవ్వడానికి, హాజరు కావడానికి తనకు కనీసం 10 రోజుల సమయం కావాలని సిబిఐని కోరారు. గడువు ముగిసిన తర్వాత విచారణకు తప్పకుండా హాజరవుతానని విజయ్ తన లేఖలో పేర్కొన్నారు. విజయ్ అభ్యర్థనపై సిబిఐ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. విజయ్ కోరిన 10 రోజుల గడువును పరిగణనలోకి తీసుకుని విచారణ తేదీని మార్చాలని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే తదుపరి విచారణ ఎప్పుడు ఉంటుందనేది అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# వేసవి నేపథ్యంలో రైలు భద్రతపై ప్రత్యేక దృష్టి

### అధికారులతో రైల్వే జిఎం సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్: వేసవికాలం దృష్ట్యా రైళ్ల భద్రతా చర్యలను బలోపేతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన నిర్వాహక అధికారి సంజయ్ కుర్ శ్రీవాస్తవ అధికారులకు సూచించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో రైళ్ల నిర్వహణ భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన నిర్వాహక అధికారి సత్యప్రకాష్‌తో పాటు వివిధ విభాగాల ప్రధానాధికారులు పాల్గొన్నారు. విజయవాడ, గుంటకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ రైల్వే విభాగాల నిర్వాహకులు దృశ్య మాధ్యమం ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావం రైలు పట్టాలపై పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధాన నిర్వాహక అధికారి సూచించారు. రైలు పట్టాలను బలోపేతం చేయడం, అవసరమైన చోట బాలస్టు నింపడం, భద్రతా తనిఖీలను నిరంతరం నిర్వహించడం ద్వారా రైళ్ల సజావుగా నడిపేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అలాగే వేసవిలో రైళ్లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. పనులు పూర్తయిన తర్వాత నిర్మాణ సామగ్రి పనిస్థలాల్లో మిగలకుండా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ సరుకు నిల్వ కేంద్రాలు మరియు సరుకు షెడ్ల వద్ద భద్రత పెంచేందుకు పర్యవేక్షణ కెమెరాలు ఏర్పాటు చేసే అంశాన్ని కూడా సమీక్షించారు.

# రైల్వే ఉద్యోగులకు వైద్య పరీక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని సంచాలన్ భవన్‌లో ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హెల్త్ చెక్అప్ క్యాంప్‌ను ఓమెగా హాస్పిటల్స్ (క్యాన్సర్, కార్డియాక్), స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించారు.ఈ శిబిరంలో మొత్తం 126 మంది సభ్యులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో పురుషులు 24 మంది, మహిళలు 102 మంది ఉన్నారు. వైద్య పరీక్షలలో 10 మందికి హై బిపి, మరో 10 మందికి నియంత్రణలో లేని షుగర్ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు.అదేవిధంగా పరీక్షలకు వచ్చిన వారిలో సుమారు 50 నుంచి 60 శాతం మంది వద్ద సర్వైకల్ స్పాండిలోసిస్ మరియు ఆస్టియో ఆర్థ్రైటిస్ సమస్యలు 30–35 ఏళ్ల వయస్సులోనే కనిపిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. క్యాంప్‌లో భాగంగా స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ వైద్యులు 285 మంది సభ్యులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 11 మందికి పాప్ స్మియర్ పరీక్షలు చేయగా, 27 మందికి థర్మల్ మామోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు.మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడం మరియు వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



**డాక్యుమెంట్స్ పోయినవి**

నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నటువంటి **మహమ్మద్ సానియా D/O అజ్మత్ ప్లాట్ దస్తావేజు నం. 3924/2015** ఇట్టి డాక్యుమెంట్ లింక్ డాక్యుమెంట్ నెంబర్ **1525/2013** ఇట్టి లింక్ ఈ ఒక్క డాక్యుమెంట్ (1525 / 2013) నర్సంపేట మండల కేంద్రంలో ద్విచక్ర వాహనంలోని ట్యాంక్ కవర్ నుండి జారిపోయినవి ఇట్టి దస్తావేజు ఎవరికైనా దొరికిన ఏడల ఈ నంబర్ **7731913702** తెలుపగలరని మనవి.

**మహమ్మద్ సానియా**
**D/O అజ్మత్**
**ఇంటి నం : 3-148**
**నర్సంపేట వల్లభ్ నాగర్**
**గ్రామం : నర్సంపేట**
**జిల్లా : వరంగల్**

## FORMAT C-2

**Declaration about Criminal Antecedents of Candidates set up by the party**

*(As per the judgement dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 201I (Public Interest Foundation & Ors. Vs. Union of India &Anr.)*

**Name of the Political Party: INDIAN NATIONAL CONGRESS**

**Name of Election : Biennial Elections to the Council of States (Rajya Sabha), 2026.**

**Name of State/UT : TELANGANA**

| 1. | 2. | 3. | 4. | | 5. | | |
|---|---|---|---|---|---|---|---|
| Sl. No. | Name of the Constituency | Name of Candidate | (A) Pending Criminal Cases | | (B) Details about cases of conviction for criminal cases | | |
| | | | Name of Court, Case No. & Status of the Case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) | Name of Court, Case No. & Status of theCase (s) | Description of Offence (s) & Punishment Imposed | Maximum Punishment Imposed |
| 1 | Election to The Council of States fromTelanganaState Legislative Assembly | **Dr. Abhishek Manu Singhvi** | Additional Chief Judicial Magistrate, (Economic Offence), Jodhpur. There is no case number as the procedure is that till cognizance is taken by the magistrate, no case number is assigned. Prosecution complaint filed before court of Ld. Addl. Chief Judicial Magistrate (Economic Offence) Jodhpur moved on 04.01.2021. Since 04.01.2021, no notice has been issued to the undersigned. These details were discovered by the undersigned pursuant to additional affidavit on behalf on CBDT served on undersigned on 07.01.2021 in WP 11176/20 at Delhi High Court. | Complaint is filed under section 276C (1), 277 of Income Tax Act 1961 read with Section 420 of IPC 1860. The IT department filed prosecution complaint for AY 2010-11, 2011-12, 2012-13 on 4.1.21 before the court of Ld. Addl. Chief Judicial Magistrate (Economic Offence) Jodhpur. Wherein the department has pleaded that the undersigned has inflated expenses causing wrongful loss to government and wrongful gain to himself and has willfully attempted to evade tax. | Not Applicable | Not Applicable | Not Applicable |

# ఆ కప్ మళ్లీ మనదే!

కారణాలేవైతేనేమి! క్రికెట్ క్రీడ పూర్తిగా వ్యాపారీకరణ పొందటమేగాక 140 కోట్ల జనాభా కలిగిన మన భారతదేశంలో అదొక మతంగా మారింది. ఏదైనా అంతర్జాతీయ పోటీల్లో మన జట్టు గెలిస్తే హర్షాతిరేకాలు మిన్నుముట్టుతాయి, ఓడితే ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటాయి – ఇదీ దేశీయ ప్రేక్షక, వీక్షక అభిమానుల స్పందన తీరు. ఆదివారం రాత్రి అహ్మదాబాద్‌లో లక్షమంది ప్రేక్షకులతో కిక్కిరిసిన అతిపెద్ద స్టేడియంలో, టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాలకు అతుక్కుపోయిన కోట్లాదిమందికి సమయం తోచలేదు, ఆకలి తెలియలేదు. ఎప్పుడైతే భారత్ జట్టు ప్రత్యర్థి న్యూజిలాండ్‌పై 96 పరుగుల విజయం తన ఖాతాలో వేసుకుందో స్టేడియం–గ్రౌండ్ ప్లస్ నీలంరంగు పులుముకున్న గ్యాలరీలు కేరింతలు, త్రివర్ణ పతాక రెపరెపలతో నూతన శోభ సంతరించుకుంది. ప్రజంటేషన్ సెరిమనీ పూర్తి కావటానికి దాదాపు మరో 2గంటల సమయం పట్టినా స్టేడియం అభిమానులతో నిండుకుండలా ఉంది. ఈ టి20 వరల్డ్ కప్ విజయం దేశవ్యాప్తంగా కలుగజేసిన సంతోషానికి వారు ప్రతిబింబాలు. అనేక నగరాల్లో అర్థరాత్రి జయజయధ్వానాలు, బైక్ ర్యాలీలు, టపాసుల హోరు. ఇది చిరకాలం గుర్తుండే విజయం. ఎందువల్ల?

ఐసిసి రెండేళ్లకొకసారి నిర్వహించే ఈ 20ఓవర్ల – క్రికెట్ పొట్టి ఫార్మాట్ ఛాంపియన్ షిప్ (2026) నిర్వహణకు భారత్–శ్రీలంక సమష్టిగా ఆతిథ్యమిచ్చాయి. బ్రిటీష్‌వారి వలసపాలన కాలంలో మన దేశంలో జెంటిల్‌మన్ గేమ్‌గా అడుగుపెట్టిన ఐదురోజుల టెస్ట్‌లు కాలక్రమంలో – కాలం–సమయం విలువ పెరగటంతో ప్రేక్షకాదరణ కోల్పోయింది. అయినా ఒరిజినల్ క్రీడా నైపుణ్యానికి ప్రతీకగా ఆ ఫార్మాట్ కొనసాగుతున్నది. అందులో కూడా ఐసిసి ప్రపంచ కప్ మొదలుపెట్టి దానికీ వాణిజ్య ఛాయలు అద్దింది. 1975లో 50 ఓవర్ల ఇంటర్నేషనల్ పోటీలు మొదలైనాయి. నాలుగేళ్లకొకసారి నిర్వహించే ఈ ఛాంపియన్‌షిప్ తొలి రెండు పర్యాయాలు ఆనాడు మేటిగా ప్రసిద్ధిపొందిన వెస్టిండీస్ వశమైంది. 1983లో మూడవ ఎడిషన్‌ను కపిల్ దేవ్ సారథ్యంలో 'కపిల్ డెవిల్స్' వెస్టిండీస్‌ను లీగ్‌లో, ఫైనల్‌లో అనూహ్యంగా చిత్తుచేసి కప్‌ను భారత్‌కు తెచ్చారు. దాంతో క్రికెట్ 'వెర్రి' ముదరటం మొదలైంది. దానికీ ప్రేక్షకులు తగ్గిపోవటంతో ఐసిసి 2007లో 20 ఓవర్ల ఫార్మాట్ ప్రారంభించింది. ఇది ఆదరణ పొందుతున్నది. తొలి ఛాంపియన్ షిప్‌ను మహేంద్ర సింగ్ ధోనీ సేన సొంతం చేసుకోవటంతో క్రేజ్ విపరీతంగా పెరిగింది. దాని తర్వాత వ్యాపార ధోరణి పతాకస్థాయికి చేరి బిసిసిఐ ఆధ్వర్యంలో ఐపిఎల్ ప్రారంభమై 19వ ఎడిషన్‌లో ప్రవేశించింది. స్వదేశీ, విదేశీ ఆటగాళ్ల కలయికతో సాగే ఈ పోటీ కొత్త అనుభూతి కలిగిస్తోంది. టి20 ఇంటర్నేషనల్ ఛాంపియన్స్ ట్రోఫీ 2024లోగాని రెండోసారి భారత్ చేతికి రాలేదు. 2026 మార్చి 8రాత్రి అహ్మదాబాద్‌లో కొత్త చరిత్ర లిఖితమైంది.

విశేషాలు : ఏ ఆతిథ్య దేశం ఇంతవరకు కప్ గెలుచుకోలేదు. ఆ ఘనతను భారత్ సాధించింది. మూడుసార్లు కప్ గెలిచిన దేశంగా చరిత్ర లిఖించింది. వెస్టిండీస్, ఇంగ్లండ్ రెండేసి సార్లు విజేతలుగా ఉన్నాయి. ఏ దేశమూ వరుసగా రెండు ఛాంపియన్‌షిప్స్‌లో విజేత కాలేదు. ఆ గౌరవం భారత్‌కు దక్కటం అంటే ఈ ఫార్మాట్‌లో బలమైన ముద్ర వేసింది. క్రికెట్ నేషన్‌గా కీర్తి నార్జించింది. వరుస గెలుపుల వల్లనే క్రికెట్‌లో ఆస్ట్రేలియా, ఫుట్‌బాల్‌లో బ్రెజిల్ చిరస్థాయిగా నిలిచాయి. 2023 నవంబర్ 19న ఇదే అహ్మదాబాద్ స్టేడియంలో ఒకరోజు (50 ఓవర్లు) ఇంటర్నేషనల్ వరల్డ్ కప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో – అభిమానుల అంచనాలకు భిన్నంగా భారత్ జట్టు ఓటమి ఒక మచ్చగా మిగిలింది. ఆ తదుపరి ఒక్క నాకౌట్ గేమును భారత్ జట్టు కోల్పోలేదు. ఆడిన ఆరు ఛాంపియన్ షిప్స్ గెలుపొందింది. (2 మహిళా టీముల ఖాతాలో ఉండటం గర్వకారణం. ఒకటి ఒడిఐ ప్రపంచకప్ (2026), రెండు, మహిళల అంధుల టి.20 క్రికెట్ తొలి ప్రపంచకప్–2025)

రెండేళ్ల క్రితం రోహిత్ శర్మ నాయకత్వంలో వెస్టిండీస్‌లో టి20 ఛాంపియన్‌షిప్ గెలుపొందిన తదుపరి రోహిత్, విరాట్ కోహ్లి వంటి పాత దిగ్గజాలు ఈ ఫార్మాట్ నుండి విశ్రాంతి తీసుకున్నారు. వారిప్పుడు 50ఓవర్ల ఒడిఐ ఒక్కటే ఆడుతున్నారు. ఆ తదుపరి ఆటలో దూకుడుతనం ప్రవేశపెట్టబడింది. ఆ తరహా క్రికెటర్లను రిక్రూట్ చేసుకుని పదునుపెట్టారు. గత 18 మాసాల్లో భారత్ క్రికెట్ విజయాల్లో బ్యాటర్ అభిషేక్ శర్మ, స్పిన్ బౌలర్ వరుణ్ చక్రవర్తి ముఖ్యపాత్ర పోషించారు. విశ్వసించదగిన టాప్ బౌలర్ బుమ్రా ఉండనే ఉన్నాడు. తాజా ఛాంపియన్‌షిప్‌లో వరుసగా 0,0,0,15, 55, 10, 9 పరుగులతో అతి పేలవమైన ఫామ్‌లో ఉన్న అభిషేక్‌పై కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, ఛీఫ్‌కోచ్ గౌతం గంభీర్ ఇతర టీం మేనేజిమెంట్ విశ్వాసం ఉంచారు. ఫైనల్ మ్యాచ్‌లో ధనాధన్ 52 పరుగులు బాదాడు. సంజు శాంసన్‌తో కలిసి 43బంతుల్లో 98పరుగులతో బలమైన పునాది నిర్మించారు. ఆ తర్వాత శాంసన్(89), ఇషాన్ కిషన్ (54), చివరి ఓవర్‌లో శివందూబె 24పరుగుల తుపాన్ ఇన్నింగ్స్‌తో భారత్ స్కోరు 255 కొత్త బెంచిమార్క్ చేరుకుంది. భారత్ బౌలర్ల దెబ్బకు (బుమ్రా 4, అక్షర్ పటేల్ 3), న్యూజిలాండ్ 198 కి కుప్పకూలింది. నిన్నటి రోజున భారత్ ఫీల్డింగ్ అద్భుతం. సూపర్ 8లో దక్షిణాఫ్రికాపై ఓటమి షాక్ నుంచి తేరుకున్న భారత్ మరో రెండు మ్యాచ్‌ల్లో ఫైనల్ లాంటి ఆటల్లో గెలిచి ఆత్మవిశ్వాసంతో ఫైనల్ చేరింది. ఈ విజయంలో సంజూ శాంసన్ ప్రత్యేకత ప్రశంసార్హం. ఆలస్యంగా అవకాశం దొరికింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో 275 పరుగులతో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. మొత్తం 321 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది వరల్డ్ కప్‌గా నిలిచారు.

ఒక్కొక్క మ్యాచ్‌లో ఒకరిది ప్రత్యేకత. తొలి మ్యాచ్‌లో అమెరికా చేతిలో భారత్ బ్యాటింగ్ కుప్పకూలగా సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ నాక్‌తో 84 పరుగులు సాధించి జట్టును నిలబెట్టాడు. ఆ తర్వాత పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 40 బంతుల్లో 77 పరుగులతో చిరకాల ప్రత్యర్థిపై విజయసాధనకు ప్రధాన కారకుడైనారు. జస్‌ప్రీత్ బుమ్రా ఎప్పుడు బంతి చేతికొచ్చినా వికెట్ తీయటమో, పరుగులు కట్టడి చేయటమో చేశారు.

బుమ్రా, వరుణ్ చక్రవర్తి చెరో 14 వికెట్లతో జాయింట్ లీడింగ్ వికెట్ టేకర్లుగా నిలిచారు. అహ్మదాబాద్ ఫైనల్‌లో అక్సర్ పటేల్ మూడు కీలకమైన వికెట్లు తీసి, ఇషాన్ కిషన్ రెండు అద్భుతమైన క్యాచ్‌లతో రాణించారు. ఏ స్థానంలోనైనా ఆడగల క్రికెటర్‌గా తిలక్‌వర్మ మరోసారి రుజువు చేసుకున్నారు. హెడ్ కోచ్ గౌతం గంభీర్ నాయకత్వంపై చాలామందికి అసంతృప్తి ఉన్నా రెండు ఐసిసి టైటిల్స్ – ఛాంపియన్స్ ట్రోఫీ, టి 20 వరల్డ్ కప్ సాధించి పెట్టాడు. భారత్ జట్టుకు జేజేలు. సమష్టి కృషితో మరిన్ని విజయాలతో ముందుకు సాగాలని ఆశించుదాం! ●



## స్వదేశానికి రప్పించే ప్రక్రియ కొనసాగింపు

**పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి రప్పించే ప్రక్రియ కొనసాగుతోంది. పలు చోట్ల నుంచి 50 విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చాం. గత 2 రోజుల్లో 100 సర్వీసుల్లో ప్రయాణికులను తరలించాం. దుబాయ్, అబుదాబి, రస్ అల్ ఖైమా, ఫుజైరా, మస్కట్, జెడ్డాల నుంచి విమానాలు సురక్షితంగా నడిచాయి. ఆయా విమానాశ్రయాల్లో పరిస్థితులు, సాధ్యాసాధ్యాలకు అనుగుణంగా విమానాలు నడుస్తున్నాయి. టికెట్ ధరలు సహేతుకంగా ఉండేలా విమాన ఛార్జీలను కూడా నిశితంగా పరిశీలిస్తున్నాం.**

– విమానయాన మంత్రి రామ్‌మోహన్ నాయుడు

# హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

పార్టీలు ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీ లు ఇస్తాయి. ఉచిత విద్య, వైద్యం, రైతులకు మద్దతు, నిరుద్యోగ భృతి, మహిళా సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు ప్రధానంగా ఉంటాయి. ప్రజల ఓట్ల ద్వా రా గెలిచి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు కేవలం ప్రకటనలుగా మిగిలిపోకుండా, అమలులోకి రావా లంటే బడ్జెట్‌లో సరైన నిధుల కేటాయింపు తప్పనిసరి.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో 26 నెలలు పూర్తి చేసుకొని మరో 24నెలల పాలన చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 3వ సారి బడ్జెట్ ఈ నెల 20న ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో గత రెండు బడ్జెట్లలో విద్యారంగానికి, యువతకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదు. విద్యార్థి, యువత కోసం ప్రత్యేక గ్యారంటీ యువవికాసం పెట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో విద్యార్థులకు, యువకులకు అనేక హామీలు ఇచ్చింది. ఎన్నికల్లో విద్యకు 15% నిధులు బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పి 7.5% కేటాయించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలకి నిధులు విడుదల లేవు, యూనివర్సిటీ విద్యార్థులకు పెలోషిప్‌లు, స్కాలర్షిప్‌ల పెంపులేదు, విద్యా భరోసా కార్డు రూ.5లక్షలు ఇప్పటికీ అమలు లేదు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు, ఇంటింటికీ ఉచిత ఇంటర్నెట్ వంటి హామీలపై మాటే లేదు, నిరుద్యోగ భృతి ఊసే లేదు, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైంది తప్ప అర్హులైన వారికి యూనిట్ల వారీగా లోన్లు ఇప్పటికీ మంజూరు కాలేదు. హామీల అమలుకు గత రెండు బడ్జెట్లలో నిధుల కేటాయింపు లేదు. ప్రభుత్వం విద్యార్థుల, యువకుల హామీలను అమ లు చేయకుండా నిధులు కేటాయించకుండా ఎన్నికల హామీల అమలుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం ప్రభుత్వ బాధ్యత. హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది. ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో అయినా విద్యార్థులకు, యువకులకు ఇచ్చిన హామీల అమలుకు కృషిచేసి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలి.



# ప్రయోగశాలలు లేని చదువు.. ప్రయోజనం లేని పట్టా!

భారతదేశంలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుండి సామాన్య కళాశాలల వరకు నేడు ఒక రకమైన నిశ్శబ్ద ఆందోళన గూడుకట్టుకుంది. ఏటా లక్షలాది మంది విద్యార్థులు స్నాతకోత్సవాల్లో ఎంతో గర్వంగా పట్టాలను అందుకుంటున్నారు. కన్నవారి కళ్లలో మెరిసే ఆనందం, రేపటిపై పెట్టుకున్న ఆశలు ఆ పట్టా కాగితంపై సంతకాలతో ముడిపడి ఉంటాయి. కానీ దురదృష్టవశాత్తూ, ఆ పట్టా చేతికి అందడమే విద్యా వ్యవస్థకు, ఉపాధి మార్కెట్‌కు మధ్య ఉన్న భారీ అగాధానికి ఆరంభంగా మారుతోంది. దేశం తన భవిష్యత్తు కోసం, యువశక్తి కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ, చదువుకున్న యువత సరైన పని దొరకక, దొరికిన పనిలో ఇమడలేక సతమతమవుతోంది. ఇది కేవలం ఒక ఆర్థిక సమస్య మాత్రమే కాదు, భారతీయ విద్యా వ్యవస్థ పునాదుల్లో ఉన్న లోపాన్ని ఎత్తిచూపే నమ్మక సంక్షోభం.

ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థల్లో ఒకటిగా మన దేశం నిలుస్తోంది. కళాశాలల



సంఖ్య పెరగడం, మారుమూల ప్రాంతాలకు కూడా విద్య చేరువ కావడం అభినందనీయమే అయినా, ఈ పరిమాణాత్మక పెరుగుదల నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఫలితాలను ఇవ్వడంలో విఫలమవుతోంది. ఇటీవల వెలువడిన గణాంకాలు మనల్ని విస్మయానికి గురి చేస్తున్నాయి. చదువుకుంటున్న యువతలో కేవలం ఒక శాతం కంటే తక్కువ మంది మాత్రమే ఏదైనా రకమైన వృత్తిపరమైన సంస్థాగత శిక్షణ పొందుతున్నా రు. అంటే, మన పాఠశాలలు, కళాశాలలు కేవలం సిద్ధాంత పరమైన జ్ఞానాన్ని నూరిపోస్తున్నాయి తప్ప, సమాజంలో ఒక పనిని బాధ్యతాయుతంగా నిర్వహించడానికి కావాల్సిన నైపుణ్యాలను నేర్పించడం లేదు. పట్టభద్రులలో సగం కంటే ఎక్కువ మంది పరిశ్రమల ప్రమాణాలకు ఏమాత్రం సరిపోవడం లేదన్నది కాదనలేని సత్యం. డిగ్రీలు ఉన్నా, ఆధునిక పని వాతావరణానికి యువత సిద్ధంగా లేకపోవడం మన విద్యా విధానంలోని డొల్లతను చాటుతోంది.

పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన రాష్ట్రాలను పరిశీలిస్తే ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. అక్కడ వందలాది అంతర్జాతీయ సంస్థలు ఉన్నప్పటికీ, ఆయా కంపెనీలకు కావాల్సిన సాంకేతిక నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. వేల సంఖ్యలో పట్టభద్రులు నిరుద్యోగులుగా తిరుగుతుంటే, కంపెనీలు మాత్రం సరైన వ్యక్తులు దొరకడం లేదని వాపోతున్నాయి. విద్యార్థి చదువుకునే కాలంలోనే పరిశ్రమల అవసరాలను గుర్తించి, అందుకు అనుగుణంగా పాఠ్యప్రణాళికను రూపొందిం చడంలో మనం ఘోరంగా విఫల మయ్యాము. కొన్ని విదేశీ సంస్థలు మన దేశంలోని ఉన్నత విద్యా సంస్థలతో కలిసి మార్పు కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, అవి కేవలం కొన్ని నగరాలకే పరిమితమవుతున్నాయి.

నిజానికి, ఉన్నత విద్య అనేది కేవలం ఒక ఉద్యోగం సంపాదించడానికి మార్గం మాత్రమే కాదు, అది ఆలోచనా దృక్పథాన్ని మార్చాలి. కానీ ప్రస్తుత విద్యా వ్యవస్థలో ప్రశ్నించే తత్వం కంటే, చెప్పింది రాసే తత్వం పెరిగిపోతోంది. ఆవిష్కర ణలు అనేవి కేవలం వార్తల్లోనే కనిపిస్తు న్నాయి తప్ప, తరగతి గదుల్లో కాదు. అధ్యాప కులు సైతం కేవలం సిలబస్ పూర్తి చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప, విద్యార్థిలోని సృజనాత్మ కతను వెలికితీయడానికి సమయం కేటాయించడం లేదు. దీనివల్ల విద్యార్థికి సబ్జెక్టుపై పట్టు రావడం లేదు, ఫలితంగా ఉద్యోగ వేటలో వెనుకబడి పోతున్నాడు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. భారతదేశం కేవలం ఒక వినియోగదారు దేశంగా మిగిలిపోకూడదు. మనం సాంకేతికతను సృష్టించే స్థాయికి ఎదగాలి. ఇది జర గాలంటే మన విద్యా సంస్థలు ఆవిష్కరణల నిలయాలుగా మారాలి. డిగ్రీ పట్టా అనేది కేవలం ఉద్యోగ వేటలో చూపించే ఒక కాగితం ముక్కలా కాకుండా, ఆ వ్యక్తికి ఉన్న నైపుణ్యానికి ఒక తిరుగులేని ధృవీకరణగా ఉండాలి. విద్య, ఉపాధి మధ్య ఉన్న ఈ గోడలను కూల్చివేయడం ఇప్పుడు మన ముందున్న అతిపెద్ద సవాలు. ఈ మార్పు రాకపోతే, మన దేశ యువత శ్రమశక్తి వృధా కావడమే కాకుండా, దేశ భవిష్యత్తు కూడా అంధకారంలో పడే ప్రమాదం ఉంది. సంస్కరణలు కేవలం చట్టాల రూపంలో ఉంటే సరిపోదు, అవి ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగు నింపేలా అమలు కావాలి. చదువుల బట్టీ విధానం పోయి, బతుకులకు భరోసా ఇచ్చే అసలైన అభ్యాస ప్రక్రియ మొదలవ్వాలి.

వెంకగారి భూమయ్య, 9848559863

# మూసీ అభివృద్ధి ప్రాజెక్టును వ్యతిరేకిద్దామా!



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

గాంధీసరోవర్‌ను పర్యావరణ టూరిస్ట్ సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయటం ఎంతో అవసరం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి ప్రణాళికలను స్వాగతించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మూసి, ఈసీ నదుల సంగమ ప్రాంతంలో ప్రపంచంలోనే ఎత్తయిన మహాత్ముడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు 2024 నవంబర్ 1న ప్రకటించారు. అంతేకాకుండా సౌభ్రాతృత్వానికి సంకేతంగా, ప్రపంచ శాంతికి చిహ్నంగా అటు విద్యాబోధనకు ఇటు సమతాభివృద్ధికి దోహదపడే రీతిలో అక్కడ ఐడియాలజీ సెంటర్, సిల్క్ సెంటర్ వంటి సదుపాయాలు వస్తాయని కూడా అప్పట్లో రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆనాటి నుండి రేవంత్ రెడ్డి ప్రకటనపై కొన్ని వర్గాలనుండి రాజకీయంగా విమర్శలు.. కొన్ని వర్గాల నుండి అభివృద్ధిచేస్తే పర్యావరణం, సుందరీకరణ, పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకంటుందనే అభిప్రాయాలు వస్తున్నాయి.

అయితే ఇటీవల మూసీ నది సంగమ ప్రాంతమైన లంగర్ హౌస్ లోని బాపు ఘాట్ వద్ద 'గాంధీ సరోవర్' పేరిట 150 అడుగుల ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించి త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

**మూసీ ప్రక్షాళన –సుందరీకరణ:**

మూసీ నదిని శుద్ధిచేసి, స్వచ్ఛమైన నీటిని ప్రవహింప చేస్తామని, వ్యవసాయానికి అందిస్తామని ప్రభుత్వం చెబుతుంది. ఈ దిశ గా గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించి, గండిపేట రిజర్వాయర్‌ను నింపి, నదిలో నిరంతర నీటి ప్రవాహం ఉండేలా చూడటానికి రూ.7 వేల కోట్లు కేటాయించి పనులు మొదలు పెట్టింది. అలాగే మురుగు నీటిని నదిలో కలవకుండా నిరోధించేందుకు సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్తున్నారు. ఈ చర్యలు నదీ ప్రక్షాళనకు అవసరమే. నదీ తీరాన్ని ఆకర్షణ యంగా తీర్చిదిద్ద డం, పర్యాటక ప్రదేశాలను నిర్మించడం, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు బాటలు వేయటం పైన గూడ ఎక్కువ దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో గండిపేట నుండి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పొడవున నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.దీనిని స్వాగతించవలసిందే.

**ఇండ్లు కోల్పోతున్న వారికి పునరావాసం కల్పించాలి :**

ఈ క్రియలో 10,017 ఇండ్లను తొలగిస్తున్నట్లు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇండ్లు, ఆస్తులు కోల్పోతున్న వారు అందోళనలకు దిగడం వారికి మద్దతుగా ప్రధాన పార్టీలైన బిజెపి, బిఆర్ఎస్ నాయకులు మద్దతు తెల్పడం..గాంధీ సరోవరం పై డిపిఆర్ ప్రకటించాలని, ఇండ్లు కోల్పోతున్నవారికి పక్కా ఇండ్లతోపాటు, పునరావాసం కల్పించాలని డిమాండ్స్ చేయటంజరుగుతుంది. వారికి ప్రత్యామ్నాయంగా పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. దానికోసం ప్రభుత్వం హామీ ఇస్తున్న కొంతమందికి డబల్ బెడ్రూము ఇండ్లు అలాటు చేయడం జరిగింది. ఇంతవరకు బాగానే ఉంది.

కానీ నదీ పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను గుర్తించి ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపడుతూ ఈ ప్రాంతాన్ని ప్రైవేటు కార్పోరేట్ శక్తులకు అమ్ముకోవాలని చూస్తున్నారని, ప్రభుత్వం వ్యాపార కోణంలోనే ఆలోచిస్తుందని ఆరోపణలుచేస్తూనే.. రెండో వైపు పర్యావరణ సుందరీకరణకు వ్యతిరేకం కాదని చెప్తున్నారు.

**వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్:**

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ నగరం ఒకటి. ప్రపంచంతో పాటు పోటీపడేలా మహానగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారు. వారు దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని చుంగ్ యే చున్ రివర్ మోడల్‌గా తీసుకొని మూసీనది పునరుజ్జీవనానికి శ్రీకారం చుట్టారు. లండన్‌లో ఉన్న థేమ్స్ నది ఒకప్పుడు మూసినది లాంటి పరిస్థితిని ఎదుర్కొన్నది. ఆ తరువాత అక్కడి ప్రభుత్వం చొరవ చేసి థేమ్స్ నదిని ప్రక్షాళన చేసింది. ఇప్పుడు లండన్ అనగానే మొదట గుర్తుకొచ్చేది థేమ్స్ నది. అంతర్జాతీయంగా పర్యాటకులు అకట్టుకునేలా తీర్చిదిద్దారు. దక్షిణ కొరియాలో సియోల్‌లోని చుంగ్ యే చున్ నది పరిస్థితి కూడా 2003లో మూసి లాగే ఉండేది. తరువాత దాన్ని కూడా అత్యంత సుందరంగా ప్రక్షాళించారు. ఇప్పుడు ఆ నది అంద చందాలు చూడటానికి రెండు కళ్ళు చాలవు. ఈ నదిని ప్రతి ఏటా రెండుకోట్ల మంది పర్యాటకులు సందర్శిస్తున్నారని అంచనా. నదిని ప్రక్షాళించిన తర్వాత పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. జీవవైవిధ్యం పెరిగింది.

**గుజరాత్ మోడల్ సరికాదు**

సబర్మతి నది అభివృద్ధి నమూనాను హైదరాబాదులో అమలు చేసే ప్రయత్నం జరుగుతుంది. అక్కడ వేలాది పేదలను నదీ తీరం నుండి తరలించి, నది తీరాన్ని వాణిజ్య కేంద్రంగా మార్చిన విషయం తెలిసిందే. అదేబాటలో ఇక్కడ 'గాంధీ సరోవర్' 'రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్' పేర్లతో పేదలను నిరాశ్రయులను చేసి, ఆ భూమిని టూరిజం, ప్రైవేట్ లాభాలకు అమ్మివేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నట్లు ఆరోపణలున్నవి. మూసి నది నిజమైన పునర్జీవం అంటే దాని నీటిని శుద్ధి చేయడం, పారిశ్రామిక, గృహ మురుగు నీటిని నదిలో కలవకుండా నిరోధించటం. వరదల నుండి ప్రజలను రక్షించేందుకు పటిష్టమైన ప్రహరీలు నిర్మించటం. ఇది పేదలను నిరాశ్రయులను చేసే ప్రక్రియ కాకూడదు. నదీ ప్రవాహానికి అడ్డంకి కాని నివాసాలను, ఆక్రమణలను తాకకుండా అభివృద్ధి పనులు చేపట్టాలి. పూర్తిస్థాయి ప్రణాళిక, డి పి ఆర్ ఎంఎఫ్ఎల్ వివరాలను వెంటనే బహిర్గతంచేసి ప్రజలతో ప్రత్యేకించి మూసి పరీవాహక ప్రాంతంలో నివసించే వారితో విస్తృతంగా చర్చించాలి. బఫర్ జోన్ పేరుతో ఇళ్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలి.

**గాంధీజీ సరోవర్ బాపూఘాట్:**

మూసి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా



బాపు ఘాట్ 21 కి.మీ మేర ఉంటుంది. హిమాయత్ సాగర్ నుంచి మొదటి దశపనులు కిస్మత్ పుర, హైదర్‌గుడా, బండ్లగూడ జాగిర్ ప్రాంతాలు ఉండగా, రెండో దశలో గండిపేట, నార్సింగి, మంచిరేవుల ప్రాంతాలు ఉంటాయి. ఈ పనిని నిర్వహించడానికి 'మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్' అనే ప్రత్యేక విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రపంచంలోనే ఎత్తైన గాంధీజీ విగ్రహం, గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ, శాంతి విగ్రహ మ్యూజియం, హ్యాండ్లూమ్ ప్రమోషన్ హబ్, నాలెడ్జి సెంటర్, మెడిటేషన్ విలేజ్, గేట్ వే ఆఫ్ హైదరాబాద్, ఐకాన్ టవర్ వంటి నిర్మాణాలు ఉంటాయని అంటున్నారు. దీనికి సంబంధించి భూ సేకరణ కోసం 2026 ఫిబ్రవరి 10న ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీ చేయడంతో వార్తలు, విమర్శలు పెద్ద ఎత్తున మొదలయ్యాయి. దీనికి సంబంధించిన భూమి విస్తీర్ణం, ఖర్చుకు సంబంధించి వివరాలు రెండు రకాలుగా వినబడుతున్నాయి. రేవంత్ రెడ్డిని ప్రధానంగా విమర్శించాలనుకునే వర్గాలు చెబుతున్న విషయాలు సరికాదని, పూర్తి డిపిఆర్ సిద్ధం కాలేదని కొందరంటుండగా, మరికొందరు దీనిని కూడా విభేదిస్తున్నారు. గాంధీజీ ఆదర్శాలు పాటిస్తే చాలని, ఇలాంటి నిర్మాణాలు అవసరం లేదనే ఆలోచనలు ఉండనే ఉంటాయి. దీనికన్నా ముందుగా గాంధీజీ మీద హేయంగా దాడి జరుగుతున్నప్పుడు దేశంలోని అన్ని రాజకీయపక్షాలు, అందరూ నాయకులు, మేధావులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటమనేది మరెన్నో ప్రశ్నలను రేకెత్తిస్తుంది.ఈ లోగా మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీ ఇలాంటి ఆలోచనలను గాంధీజీ ఏ రకంగా సమర్థించి ఉండేవాడు కాదని, విగ్రహం కోసం అంత మందిని ఇబ్బంది పెట్టడం సబబు కాదని ఘాటుగానే విమర్శించారు.

**మూసీ ఆక్రమణలకు గురవుతూనే ఉంది**

సహజంగానే నదీ పరివాహక ప్రాంతాలలో వరదలు వస్తున్నప్పుడు ముంపుకు గురయ్యే ప్రాంతాలను, సరిహద్దులను గుర్తించే హద్దు రాళ్లూ లేకపోవటం.. ఎప్పటికప్పుడు పాలన యంత్రాంగం పర్యవేక్షణ లేకపోవడం, ముందు జాగ్రత్తలు లేనందువల్ల వందల ఎకరాల నదీ పరివాహక ప్రాంతము ఆక్రమణాలకు గురవుతూ వస్తున్నది.

అధికారంలోనికి వచ్చిన ప్రతి పార్టీ మూసి నది పరివాహక ప్రాంతాన్ని భూగర్భజల కాలుష్యం లేకుండా మురుగు నివారణ,సుందరీకరణగా చేసే ప్లానులు వేస్తున్న నప్పటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే మాదిరిగానే ఉంటూ వచ్చాయి. నదిపరివాహక భూభాగం ఆక్రమణలు పెరుగుతూ పోతున్నాయి.

**గాంధీజీ స్మారక చిహ్నాలు:**

గాంధీజీ అస్తమించిన తరువాత ఆ చితాభస్మము 20 భాగాలుగా చేసి గాంధీజీతో ముడిపడి ఉన్న ప్రాంతాలకు ఆయన అభిమానుల కోసం పంపే ఏర్పాటు చేశారు. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ వంటి ఇతర దేశాలతో పాటు మనదేశంలో కూడా చాలా ప్రాంతాలకు పంపారు. ప్రధాన స్మృతి కేంద్రం ఢిల్లీలో రాజ్ ఘాటుగా నిర్మించారు. ఇప్పటికే విదేశీ ప్రముఖులు ఢిల్లీ వచ్చినప్పుడు రాజ్‌ఘాట్ ప్రధాన సందర్శన స్థలంగా ఉంటున్నది. ఉదాహరణకు బెనారస్‌లో చితా భస్మానికి సమాధి నిర్మించారు. విజయవాడ సమీపంలో కృష్ణా నదిలో కలిపారు. హైదరాబాదులో మాత్రం ఈసా, మూసి నదుల సంగమ స్థానమైన లంగర్ హౌస్ ప్రాంతంలో ఉండే శ్మశాన వాటికలోని శివాలయం వెనుక 1948 ఫిబ్రవరి 12న గాంధీజీ చితా భస్మం భద్రపరిచి సమాధి నిర్మించారు. ఇప్పుడు మెట్ల బావి పక్కన ఉన్న మండపంలో ప్రార్థనలు జరగడమే కాకుండా ఒక 10 ఏళ్లపాటు ఫిబ్రవరి 12,13,14 తేదీలలో సర్వోదయమేళాలో జరిగేది. అందులో స్థానికంగా ఉన్న గాంధీజీని అభిమానించే ఎంతోమంది పెద్దలు భాగస్వాములుగా ఉండేవారు. అప్పటికి పెద్ద నిర్మాణాలు లేవు. అయితే మూడు దశాబ్దాల క్రితం ఇప్పుడు కనబడే బాపు ఘాట్ సమీపంలో అనేక భవన నిర్మాణాలు జరిగినవి.. శ్మశానం కూడా కుచించుకుపోతుంది అని విమర్శలు వినబడ్డాయి. ప్రతి సంవత్సరం జనవరి 30న రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ లాంఛనప్రాయంగా గాంధీజీ స్ఫూర్తి కి నివాళులర్పించడము వంటి కార్యక్రమం జరుగుతూ వస్తున్నవి.

ప్రస్తుతం దేశంలోనే ఎత్తైన గాంధీజీ 72 అడుగుల కాంశ్య విగ్రహం ఇద్దరు చిన్నారులతో ఆహ్లాదకరంగా బీహార్ లోని పాట్నాలో 2013లో ఏర్పాటు చేశారు.

**నిజాం కాలంలో మూసీ ప్రక్షాళన**

వాస్తవానికి మూసీ నది ప్రక్షాళన కోసం గతంలో ఎన్నో ప్రయత్నాలు సాగినవి. నిజాం కాలంలో మూసి ఒక వెలుగు వెలిగింది. దీన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని చివరి నిజాం హయాంలోనే మూసి సుందరీకరణకు అప్పట్లోనే 14 చోట్ల పార్కులను నిర్మించారు. నగర ప్రజలు పార్కుల్లోకి వెళ్లి సేదతీరే వారు. ఇవి క్రమక్రమంగా ఆక్రమణలకు గురయ్యాయి.

**మూసీ సుందరీకరణకు కొంత కృషి :**

1997లో టిడిపి ప్రభుత్వం నందనవనం పేరుతో మూసి సుందరీకరణకు శ్రీకారం చుట్టింది. బాపు ఘాట్ నుంచి నాగోల్ వరకు పలు అభివృద్ధి పనులు చేపట్టింది. వీటివల్ల నిర్వాసితులైన వెయ్యికి పైగా కుటుంబాలకు కర్మన్ ఘాట్ సమీపంలో నందనవనం పేరుతో కాలనీ నిర్మించి ఇచ్చింది. చాదర్ఘాట్ ప్రాంతంలో కాంక్రీట్ ఛానల్ పనులు సైతం పూర్తి చేసింది. తర్వాత 2001లో నందనవనం ప్రాజెక్టు ఆగిపోయింది.

2014లో బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం 2017లో మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. మొత్తం 115 కిలోమీటర్ల పరివాహక ప్రాంతాన్ని దీని పరిధిలోనికి తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని సంకల్పించింది. పార్కులు, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, సమాంతర రహదారుల నిర్మాణంతోపాటు, ఇతర వినోద కార్యక్రమాలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.16,635 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. హైకోర్టు, చాదర్ఘాట్, నాగోల్ ప్రాంతాలలో కొన్ని పనులు చేపట్టింది. పెద్ద మొత్తంలో పనులు ప్రతిపాదించి చేపట్టలేక చేతులెత్తేసింది. నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన మూసి పునర్జీవన పథకాన్ని మరింత అభివృద్ధిచేసే విధంగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నడుంబిగిస్తే.. నేడు బిఆర్ఎస్ దీనిపై విషం చిమ్ముతున్నది.

**నిర్వాసితులకు అండగా..**

మూసి నిర్వాసితులకు సర్కారు అన్ని విధాలా అండగా నిలుస్తున్నది. ఇప్పటికే ఇండ్లు ఖాళీ చేసి వెళ్తున్న నిర్వాసితులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లతోపాటు రూ. 25 వేలు నగదు, ఉపాధి కోసం రెండు లక్షల రుణాలను సర్కార్ అందజేస్తున్నది. ఇండ్ల జాగాలు ఇచ్చే ఆలోచన చేస్తున్నది. ఇప్పటికే నిర్వాసితులకు 15వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రభుత్వం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ నది బఫర్ జోన్ లో ఉన్న పది వేల కుటుంబాలకు కూడా పునరావాసము కల్పిస్తున్నది. 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో మూసి అభివృద్ధికోసం ఏమిచేయలేక పోగా.. ఇప్పుడు మూసి ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నారు. నమామి గంగా పేరుతో గంగానదిని, గుజరాత్ లో స్వచ్ఛ సబర్మతి పేరుతో, తెలీనిరో రుకుం నవకేరళం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నదులను శుభ్రం చేశాయి. కానీ కొందరు బిజెపి పార్టీ నాయకులు మూసి నదిని శుభ్రం చేయడానికి సహకరించకపోగా అడ్డగించాలని రాజకీయం చేస్తున్నారు.



## ఇందిరా పార్కు ఆకస్మిక తనిఖీ

### జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నగరంలో పారిశుద్ధ్యం, పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సోమవారం ఇందిరా పార్కులో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్కులోని పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన కమిషనర్ అక్కడ పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పార్క్ పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కులో ఉన్న పిల్లల ప్లే ఏరియా దెబ్బతిన్న పరిస్థితిలో ఉండటాన్ని గమనించిన కమిషనర్, దానికి తక్షణమే మరమ్మతులు చేపట్టి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా పార్కును మరింత అందంగా, ప్రజలను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో కమిషనర్‌తో జోనల్ కమిషనర్ మంగతాయారు, కవాడిగూడ డిప్యూటీ కమిషనర్ పుష్పలత, అర్బన్ బయో డైవర్సిటీ (యుబిడి), సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి



### ‘మార్కుల’పైన ఆందో ళన వద్దు : యోగితా రాణ...

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ సూచించారు. మార్కుల గురించి ఎక్కువగా ఆందోళన చెందకుండా సాధనపై దృష్టి పెట్టాలన్నారు. పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమేనని, దీర్ఘకాల లక్ష్యాలపైన దృష్టి పెట్టాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉత్కంఠను తగ్గించి, సరైన విధంగా చదువుకు మార్గదర్శనం చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో టిసాట్ ద్వారా ‘పదవ తరగతి విద్యార్థులకు సోమవారం ‘ ప్రేరణాత్మక, మార్గదర్శక’ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగితా రాణ, పాఠశాల విద్యా సంచాలకులు ఇ.నవీన్ నికోలస్, ఎస్‌సిఇఆర్‌టిఇ సంచాలకులు జి.రమేష్, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం మనోవిజ్ఞాన శాస్త్ర విభాగ ప్రొఫెసర్ పద్మజాషా , గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ యోగితా రాణ మాట్లాడుతూ ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. పరీక్షల మధ్య వచ్చే విరామ రోజులను (గ్యాప్ డేస్) విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నవీన్ నికోలస్ మాట్లాడుతూ గ్యాప్ పీరియడ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ‘ఆర్ఆర్ఆర్’ ( రీడ్ రిసైట్ రీవ్యూ) పద్ధతిని పాటించాలని సూచించారు.

## యుద్ధం పేరిట ధరల సెగ



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** యుద్ధం పేరిట ధరల సెగపెడుతున్నారని తెలంగాణ తెలుగుతమ్ముళ్లు మండిపడ్డారు. ఈ మేరకు టిటిడిపి నేత నల్లెల్ల కిషోర్ ఓ ప్రకటనలో.. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని సాకుగా చూపి, నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల పొట్ట కొడుతున్నారని పేర్కొన్నారు.ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధం వల్ల క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయనే నెపంతో చమురు సంస్థలు గ్యాస్ ధరలను భారీగా పెంచి సామాన్యుడిపై భారం మోపాయని... డొమెస్టిక్ సిలిండర్ ధరపై రూ.60 పెంచి, ప్రస్తుతం రూ.965కి పెంచారని.. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లోకానికి ధరలు పెంచి ‘చేదు బహుమతి’ ఇచ్చారని మండిపడ్డారు. ఈ మేరకు జరిగిన సమావేశంలో తెలుగుతమ్ముళ్లు పి.బాలరాజ్ గౌడ్, శ్యామ్‌సుందర్, జి.అనిల్ కురుమ, ఎస్.ప్రకాష్, కరణం కిరణ్, సుక్రవేది, కె.శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐహెచ్ఎంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### ఈనెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలి



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** దేశంలో అత్యుత్తమ పర్యాటక, హోటల్ మేనేజ్మెంట్ విద్యా సంస్థల్లో ఒకటైన హైదరాబాద్, విద్యానగర్, డీడీ కాలనీలోని ఐహెచ్ఎం హైదరాబాద్.. 202627 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. గ్లోబల్ హోటల్ చైన్స్, ఎయిర్లైన్స్, కార్పొరేట్ రంగాల్లో రాణించాలనుకునే విద్యార్థుల కోసం బీఎస్సీతో పాటు పలు వృత్తి విద్యా కోర్సులను అందిస్తోంది. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ మార్చి 25, 2026 అని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రోగ్రామ్ విద్యార్థులను హోటళ్లు, విమానయాన సంస్థలు, క్రూయిజ్ లైన్లు, క్యూఎస్ఆర్ బ్రాండ్లు, అంతర్జాతీయ హాస్పిటాలిటీ కంపెనీలలో సూపర్వైజరీ, మేనేజ్మెంట్ కోసం సిద్ధం చేస్తుంది. ఈ కోర్సు ద్వారా.. సొంతంగా వ్యాపారాలు ప్రారంభించడం, కార్పొరేట్, ఫెసిలిటీ మేనేజ్మెంట్, ఎఫ్ఎంసీజీ, హెచ్ఓఆర్ఈసీఏ సేల్స్, ప్రభుత్వ రంగంలో పర్యాటక శాఖ, రైల్వేలు, బ్యాంకింగ్, సాయుధ దళాలు, విద్యా సంస్థలలో అవకాశాలుంటాయని... వివరాలకు 402742 7569, సెల్ 83747 87988ల ద్వారా సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

## మహిళను ఢీ కొట్టిన వాహనం

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** వేగంగా దూసుకువచ్చిన వాహనం ఓ మహిళను ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన మహిళ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నెం2 ఎల్వి ప్రసాద్ మార్గ్ లోని బ్రాడ్ వేలో విధులు నిర్వహిస్తున్న ఉమా సాహు అనే మహిళను ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఆమె ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# హైడ్రా ‘ప్రజావాణి’కి 32 ఫిర్యాదులు

### శ్మశాన వాటికల ఆక్రమణపై స్థానికుల ఆవేదన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా నిర్వహిస్తున్న ‘ప్రజావాణి’ కార్యక్రమానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న భూకబ్జాలు, చెరువుల దుస్థితిపై అధికారులకు మొత్తం 32 ఫిర్యాదులు అందాయి. ఈ వినతులను హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య స్వీకరించి, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సాధారణంగా ప్రజలు వెళ్లడానికే జంకే శ్మశాన వాటికలను కూడా వదలకుండా కబ్జా చేసి ఇళ్లు నిర్మిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేయడం గమనార్హం. వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

* శంషాబాద్‌లోని ఎం.బి.మిషన్ కంపౌండ్ చర్చికి చెందిన వందేళ్ల నాటి సమాధుల భూమిని (సర్వే నెంబర్. 619), రికార్డులు మార్చి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కమిటీ ప్రతినిధి పవిత్ర సాగర్ ఫిర్యాదు చేశారు.
* హైడ్రా ఆధ్వర్యంలో జరుగుతున్న చెరువుల సుందరీకరణ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యూసుఫ్‌గూడ కృష్ణాకాంత్ పార్కులోని చెరువును అభివృద్ధి చేయాలని వాకర్స్ అసోసియేషన్ కోరింది. మురుగునీటిని తొలగించి, గుర్రపుడెక్కను శుభ్రం చేసి, గొలుసుకట్టు చెరువుల మాదిరిగా తీర్చిదిద్దితే వరద ముప్పు తప్పుతుందని కాలనీవాసులు కోరారు.
* శేరిలింగంపల్లి పరిధిలోని సెంట్రల్ పార్క్ ఫేజ్1 లో పార్క్ నెంబర్. 4భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని స్థానికులు తెలిపారు. 20 ఏళ్ల క్రితం నాటి బౌండరీ వాల్‌ను కూల్చివేసి భూమిలోకి ప్రవేశిస్తున్నారని, వెంటనే రక్షణ కల్పించాలని కోరారు.
* రాజేంద్రనగర్ మండలం టిఎన్‌జిఓ కాలనీ ప్లాట్ నెంబర్ 311 వద్ద సుమారు 300 గజాల ప్రభుత్వ ఖాళీ స్థలం ఆక్రమణకు గురైందని, దానిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఫిర్యాదులు అందాయి.



## మెగాసిటీ అవార్డుల ప్రదానం

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** మెగాసిటీ నవ కళావేదిక ఆధ్వర్యంలో ఉమెన్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రతిభామూర్తులకు అవార్డులను అందించడం జరిగింది. తెలంగాణ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డా. జి.చిన్నారెడ్డి, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలా చారి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, దైవజ్ఞ శర్మ, నిర్వాహకులు అంకెనపల్లి మల్లికార్జునరావు, రాఘవ, సాయినాథ్, ఆర్.సాయికుమార్ తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో పలువురు మహిళామూర్తులను సన్మానించి గౌరవించారు.

## జలమండలి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు జెఎసి నేతల వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలి ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ జలమండలి జెఏసి నాయకులు టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ నేతృత్వంలో జెఎసి నాయకులు మహేష్ కుమార్ గౌడ్‌ను సోమవారం కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, వాటర్ బోర్డు విస్తరణ నేపథ్యంలో ఏర్పడుతున్న పరిపాలనా, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మహానగరం వేగంగా విస్తరించడంతో వాటర్ బోర్డు పరిధి దాదాపు 300 సెక్షన్లకు పెరిగిందని, ఈ పరిస్థితుల్లో ఉద్యోగుల బదిలీల విషయంలో అనవసర ఆందోళనలు నెలకొన్నాయని యూనియన్ ప్రతినిధులు వివరించారు. ఈ అంశంపై స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ వెంటనే జలమండలి నిర్వహణాధికారితో ఫోన్‌లో మాట్లాడి, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, వైద్య కారణాలపై విధులు నిర్వహిస్తున్న వారు, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులను పరిగణనలోకి తీసుకుని వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య బీమా, ప్రమాద బీమా పథకాలను వాటర్ బోర్డు ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే ఈ పథకాలు వాటర్ బోర్డు ఉద్యోగులకు కూడా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి జెఏసి నేతలు నాయకులు కె.రాజ్ రెడ్డి, అల్లి శ్రవణ్ కుమార్, రాఘవేంద్ర రాజ్, బి.జైరాజ్, కె.ఆనంద్ రెడ్డి, బి.శంకర్ ప్రకాష్, ఇందూరి తిరుపతి, సి.రాజు, ఏ.అశోక్, బి.అశోక్, విగ్నేష్, సిహెచ్. ప్రవీణ్ కుమార్, రవీందర్, శ్రీను, జంగయ్య, రాజేష్, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కరణ వేగంగా జరగాలి

### ఆసిఫ్‌నగర్ తహసిల్దార్ కార్యాలయం ఆకస్మిక సందర్శన చేసిన కలెక్టర్ హరిచందన

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** జిల్లాలోని కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారం వేగవంతంగా జరగాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు.‘ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమంలో భాగంగా ఆమె ఆసిఫ్‌నగర్ తహసిల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. తహసిల్దార్ కార్యాలయంలో, పరిసరాల్లోని పరిశుభ్రతను పరిశీలించారు. ఫైళ్ల పరిష్కారాలను తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న చోట శుభ్రం చేయాలన్నారు. అన్ని కార్యాలయాల్లో ఈ కార్యక్రమం 15వరకు వేగవంతంగా జరగాలని తెలిపారు. కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను స్వీకరించి పరిష్కరించాలని చెప్పారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ జ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

#### విద్యార్థులకు కళ్లజోళ్లు అందించడం అభినందనీయం

విద్యార్థులకు కళ్ల జోళ్లు అందించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ఆసిఫ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యూచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కళ్ల జోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ విద్యార్థినులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యాబోధనపై ఏకాగ్రతను పెంచుకుని లక్ష్యంతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. టివి, ల్యాప్ టాప్, కంప్యూటర్, సెల్‌ఫోన్స్ వంటివి తగ్గించి విద్యపై ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్.వెంకటి, తహసిల్దార్ జ్యోతి, డిప్యూటి డిఇఒ బాలునాయక్, కంటి వైద్యనిపుణులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అర్జీలను సత్వరం పరిష్కరించాలి

### చార్మినార్ జెడ్‌సీ శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/చార్మినార్:** ప్రజల నుంచి అందిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన జెడ్‌సీ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. జోన్ పరిధిలోని సంతోష్‌నగర్, యాకుత్‌పురా, మలక్‌పేట్, చార్మినార్, మూసారంబాగ్ సర్కిళ్లకు చెందిన ప్రజలు పారిశుధ్యం, డ్రైనేజీ, దోమలు, రోడ్లు, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ తదితర సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అధికారులు ప్రతి ఫిర్యాదును పరిశీలించి సంబంధిత విభాగాలకు వెంటనే పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ప్రజవాణిలో జోన్ యూబీడి డిప్యూటీ డైరెక్టర్ దేవజ, ఏయంసీ రాజారావు, మలేరియా ఎస్ఈ నామాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్‌లు హమీద్, రాజేష్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కుటుంబ సభ్యులకు బేగంపేట ఎయిర్ పోర్ట్‌లోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాను అందజేసి వీడ్కోలు పలికారు.



## మహిళలు సమాజానికి మార్గదర్శకులు

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** మహిళలు సమాజానికి మార్గదర్శకులని పలువురు కొనియాడారు. ఉప్పుగూడ డివిజన్‌లో సాయిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా పలువురు మహిళలను సన్మానించడం జరిగింది. రాజీవ్ గాంధీ నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి గడ్డం జయ, తాడం శ్రీనివాస్‌రావు, ఉప్పుగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి మగుటం వెంకటేష్, ఉపాధ్యక్షుడు హనుమంతు నాయక్, కార్యదర్శులు శ్యామల, గుజ్జుల నరేందర్, సుగుణమ్మ, సీనియర్ నాయకులు పన్నావ శీను, మహిళా మోర్చా నాయకురాళ్లు రాజలక్ష్మి, బూత్ ప్రెసిడెంట్ శివ, లలితబాగ్ డివిజన్ మహిళలు వైశాలి, విజయలక్ష్మి, భారతి, రాజీవ్‌గాంధీనగర్ బస్తి వాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారి నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ఆర్జీలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖకు సంబంధించి మొత్తం 234 దరఖాస్తులు రాగా వీటిలో రెండు పడక గదుల ఇండ్లకు సంబంధించి 12, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి 222 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 69, ఇతర శాఖలకు సంబంధించి 12 కలిపి మొత్తం 315దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి, హౌసింగ్ ఫీడింగ్ కళ్యాణ్ చక్రవర్తి ఇతర శాఖల అధికారులు, ఆర్జీదారులు పాల్గొన్నారు.

## పురుషుల ఆలోచనా విధానం మారాలి

### హైకోర్టు మాజీ న్యాయమూర్తి రాధారాణి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ఈ రోజుల్లో ముప్పయ్ ఏండ్లు వచ్చినా ఆడపిల్లలు పెళ్లి చేసుకోవాలంటే భయపడుతున్నారని.. ఆడపిల్లల్లో భయం పోగొట్టాలంటే పురుషులు భరోసా ఇవ్వాలని.. పురుషుల ఆలోచన విధానంలో మార్పు రావాలని.. తెలంగాణ హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి, తెలంగాణ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రెడ్ రెస్సల్ కమిషన్ ప్రెసిడెంట్ జి.రాధారాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు రాధారాణి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సాంకేతిక పరంగా భారతదేశం ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. మహిళల పట్ల ఇంకా వివక్ష తగ్గడం లేదని.. ఇది చాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను కనేటప్పుడు అడా, మగ ఇద్దరికీ సమానమైన భాగస్వామ్యం ఉన్నప్పుడు పిల్లల ఆలనా పాలన మాత్రం ఎందుకు మహిళపై వదిలేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఇలా చెయ్యడం మహిళలకు సమాన ప్రాతినిధ్యం ఎక్కడి నుంచి లభిస్తుందని వాపోయారు. ఇంటి పనులు చేసుకోడానికి అవసరమైతే దీర్ఘకాలిక సెలవులు ఇస్తామని గొప్పలు చెప్పుకుంటున్న కొన్ని సంస్థలు ఆ దీర్ఘకాలిక సెలవులు మగవాళ్లకు ఎందుకు వర్తింపచెయ్యరని ఆమె పేర్కొన్నారు. పిల్లల ఆలనా, పాలన కేవలం మహిళలకు మాత్రమే పరిమితమా? పురుషులకు బాధ్యత లేదా? అని ఆమె ప్రశ్నించారు. సమాజంలో మహిళలకు సమాన హక్కులు, సమన వారసత్వం, సమాన న్యాయం జరగడం లేదని.. సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. స్త్రీలను తక్కువ చేసి చూసే ధోరణిలో మార్పు రావాలిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ, ట్రాన్స్‌పోర్ట్ మాజీ కమిషనర్ సిఎల్ఎన్ గాంధీ, తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు జ్యూరీ కమిటీ సభ్యుడు, సీనియర్ జర్నలిస్టు మసాదే లక్ష్మి నారాయణ, ట్రైకార్ మేనేజర్ ఉమారాణి, రచయిత్రి దాసోజు లలిత, చేయింజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లావణ్య గుడెల్లి, డీబీఎఫ్ కార్యదర్శి శంకర్, వేముల జయంత్, ట్రేడ్ యూనియన్ నాయకుడు గొల్లపల్లి దయానంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం యువత ముందుండాలి

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** డగ్స్,గంజాయి, బెట్టింగ్ యాప్స్‌కి యువత దూరంగా ఉండాలని చిక్కడపల్లి ఎస్ఐ అబిలాష్ సూచించారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐడివైఎఫ్ఐ హైదరాబాద్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాహిద్ భగత్‌సింగ్ యువజన ఉత్సవాల సందర్భంగా కబడ్డీ టోర్నమెంట్ బాగ్‌లింగంపల్లి సరోజినీ గ్రౌండ్‌లో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, చిక్కడపల్లి ఎస్ఐ అబిలాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భగత్ సింగ్ అతిచిన్న వయసులోనే ఉరి కంభం ఎక్కిన వ్యక్తి అని.. దేశం కోసం, స్వాతంత్ర సాధన కోసం పోరాడిన వ్యక్తి భగత్‌సింగ్ అంటేనే యూత్‌కి ఐకాన్.. ఆయన వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ హైదరాబాద్ కమిటీలు ఇలాంటి కార్యక్రమలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు అశోక్‌రెడ్డి, లెనిన్, డి వైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావీద్, నాయకులు రాజయ్య, నాగేందర్, రజనీకాంత్, ప్రవీణ్, అశ్వక్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మతు పనుల పరిశీలన



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** మరమ్మతు పనులు సత్వరమే పూర్తి చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు బుల్కాపూర్ వద్ద ధ్వంసమైన 1200 ఎంఎం దయా పిఎస్‌సి గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్ అత్యవసర మరమ్మతు పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు.మరమ్మతుల పనులపై తాజా పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ట్రాన్స్మిషన్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. లీకేజీ వల్ల నీటి సరఫరాలో అంతరాయం కలిగిన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగడకుండా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని.. సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఎండీ అధికారులను ఆదేశించారు.

## వేసవిలో పనివేళలు మార్చాలి

### టిజిహెచ్ఎంఈయూ డిమాండ్



**ప్రజాపక్షం/చార్మినార్:** వేసవి నేపథ్యంలో ఎంటమాలజీ కార్మికుల పనివేళలు మార్చాలని టిజిహెచ్ఎంఈయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షు కొమ్ము గళ్ళ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎంటమాలజీ కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా పనివేళలు మార్పు చేయాలని సంబంధిత అదనపు కమిషనర్‌ను కలిసి కోరడం జరిగింది. ఎండ తీవ్రత కారణంగా కార్మికులు వడదెబ్బతో ప్రాణాలు సైతం కోల్పోయే ప్రమాదముందని బాలకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అదనపు కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరి రామ్, ఎంటమాలజీ ఔట్‌సోర్సింగ్ ప్రెసిడెంట్ మల్లేష్ తదితరులు ఉన్నారు.



## పది విద్యార్థులకు యోగితా దిశా నిర్దేశం

**ప్రజాపక్షం/డిండి:** పది విద్యార్థులలో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగోట్టి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా ఐఎఎస్ సోమవారం ప్రత్యేక ప్రేరణాత్మక సెషన్‌ను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు , తల్లిదండ్రులను ఉద్దేశించి మధ్యాహ్నం 2 గంటలకు టిశాట్ ద్వారా ఈ ప్రత్యక్షప్రసారం కొనసాగింది. స్థానిక జెడ్పిహెచ్ఎస్ చెరుకుపల్లి పాఠశాలలో ఈకార్యక్రమాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇస్లావత్ గోప్యానాయక్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల సూచనల ద్వారా విద్యార్థులు పరీక్షలను ఎదుర్కొనే మెళకువలను తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం , పదవ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యాశాఖ చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

## ఆరోగ్యంపై అందరూ దృష్టి సారించాలి

నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎన్‌జి కళాశాల మైదానం నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన 5కే రన్ ను నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటే అన్నీ ఉన్నట్లేనని,అందువల్ల ప్రతి ఒక్కరూ వారి వారి ఆరోగ్యాలపై దృష్టి సారించాలని కోరారు. ప్రతి ఒక్కరు ప్రతినిత్యం ఇంట్లో కాకుండా,బయటకు వచ్చి వాకింగ్ లేదా వ్యాయామం చేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలలో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం,ప్రభుత్వ పథకాల్ని ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనంతరం మానవహారం నిర్వహించి రన్ లో పాల్గొన్న వారితో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,కార్పొరేటర్లు పెరిక స్వాతి,మామిడి కార్తీక్,డాక్టర్ పుల్లారావు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ప్రజలకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో ఆయన పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, మున్సిపల్ కమీషనర్ హనుమంత రెడ్డి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ అరుణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేసి మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడి తగ్గించుకుని ప్రశాం తంగా పరీక్షలు రాసి, రాష్ట్రస్థాయిలో అత్యున్నత ఫలితాలు సాధించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధా న్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుం టుందన్నారు. పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక సౌకర్యాల కల్పన, విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, బ్లూ అండ్ బ్లాక్ పెన్నులు, పెన్సిల్, స్కేల్, జామెంట్రీ బాక్స్‌తో ఉన్న పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లీశ్వరి, కౌన్సిలర గురవమ్మ సైదిబాబు, మండల విద్యాధికారి సలీంషరీఫ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** విద్యుత్ అంతరాయంకు మండల ప్రజలు సహకరించాలని మండల విద్యుత్ ఎఇ వి శ్రీకాంత్ అన్నారు. మండలంలో విద్యుత్ వేసవి కార్యాచరణలో భాగంగా నేడు (మంగళవారం) ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, కాసర్లపహాడ్, పర్సాయిపల్లి, బొల్లంపల్లి, సీతారాంపురం, కొత్తగూడెం, తుంగగూడెం గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.

# సెక్యులరిజానికి కేరాఫ్ కాంగ్రెస్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సెక్యులరిజానికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. దేశంలో సర్వమతాలను సమానంగా చూస్తూ వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని, లోక్‌సభలో కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ మొదలు సిఎం రేవంత్ రెడ్డి వరకు ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ముస్లింలు పవిత్ర మాసంగా భావించే ఇఫ్తార్ విందులో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సూర్యాపేటలో ముస్లింల సమస్యల పరిష్కారానికి జిల్లా మంత్రిగా కృషి చేస్తానన్నారు. వారికి అందుబాటులో ఉంటానని బరోసా ఇచ్చారు. షాదీఖానా కమ్యూనిటి హాల్, ఖబరిస్తాన్ వంటి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, మున్సిపల్ వైస్‌చైర్మన్ షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు వైద్యులు, ముగ్గురు సిస్టర్లపై వేటు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులకు గైర్హాజరైన ముగ్గురు వైద్యులను, ముగ్గురు సిస్టర్లను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సోమవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో బయోమెట్రిక్ హాజరును పరిశీలించగా మొత్తం 50 మంది బోధనా సిబ్బంది, ఇతర సిబ్బంది గైర్హాజరైనట్లు గుర్తించారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత విభాగాల అధిపతుల నుండి వివరణ కోరారు. అందులో 44 మందికి సంబంధించి హెచ్‌ఓడిలు సహేతుకమైన కారణాలు తెలియజేశారు. మిగిలిన 6 మందిలో ముగ్గురు వైద్యులు, ముగ్గురు సిస్టర్ల గైర్హాజర్‌పై ఆయన అసహనం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధులకు గైర్హాజరైన వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, రోగులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించిన ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. రోగులకు మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న ఎంసిహెచ్ బ్లాక్ పనులు పూర్తయ్యాయని దీనిని త్వరలో ప్రారంభిస్తామన్నారు.



మాతా శిశు కేంద్రంలో నెలకు సగటున 240 నుండి 300 ప్రసవాలు జరగడంపై సిబ్బందిని అభినందించారు. మోకాళ్ళ మార్పిడి, తొంట మార్పిడి వంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడం పట్ల వైద్యులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పి శ్రవణ్ కుమార్, పిడియాట్రిక్ విభాగం ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ ఎస్ శ్రీకాంత్ భట్, హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ జె మనీషా, డిప్యూటి సిఎస్ ఆర్‌ఎంఓలు డాక్టర్ అరుంధతి, బి జనార్ధన్, డాక్టర్ లక్ష్మ ణ్, విజయానంద్‌లు పాల్గొన్నారు.

# చిల్లంచర్ల వరలక్ష్మి ఆశయ సాధనకు కృషి




సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశే ఖర్

**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణసాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రెడ్ చిల్లంచర్ల రఘునాథం సతీమణి చిల్లంచర్ల వరలక్ష్మి ఆశయ సాధన కోసం వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన వరలక్ష్మి సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొదటగా సిపిఐ, వివిధ రాజకీయ నాయకులు,కార్యకర్తలు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లంచర్ల వరలక్ష్మి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని, ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటాలకు అమె ఎల్లప్పుడు భర్త అడుగుజాడల్లో నడుస్తూ స్ఫూర్తిదాయక పాత్ర పోషిస్తూ వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు. వరలక్ష్మి ఉన్నత కుటుంబంలో పుట్టిన మహిళగా ఉన్నప్పటికీ కమ్యూనిస్టు పార్టీపైన పార్టీ సిద్ధాంతంపైన ఎనలేని అభిమానం చూపించేదని, తన భర్త ప్రజా పోరాటాలకు పార్టీ కార్యక్రమాలకు సమయం కేటాయిస్తూ తీరిక లేకుండా గడుపుతున్న పరిస్థితుల్లో కుటుంబ బాధ్యతల్ని ఆమె నిర్వర్తిస్తూ తనకున్న 9 మంది పిల్లల్ని పెంచి పోషించే బాధ్యతను భుజాన వేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నంద్యాల రామిరెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బద్దం భద్రారెడ్డి, పైడిమర్రి వెంకటనారాయణ, కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటి డైరెక్టర్ కాసర్ల కోటయ్య, ఉప సర్పంచ్ కాసర్ల వెంకటేశ్వర్లు, యుగందర్‌రెడ్డి, బిఆర్ఎస్‌నాయకులు సుంకరి అజయ్‌కుమార్, సత్యబాబు, కోలా ఉపేందర్, సిపిఎం నాయకులు ముల్కలపల్లి రాములు పాల్గొన్నారు.



## 30 రోజులకు మించి పెండింగ్ ఉండొద్దు

ప్రజావాణి ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఫిర్యాదులు ఎక్కువగా ఉన్న శాఖలు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా ఫిర్యాదు పరిష్కారం ఆలస్యమైతే మధ్యంతర జవాబు ద్వారా ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 30 రోజులకు మించి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకూడదని, జిల్లా వ్యాప్తంగా పెండింగ్ సంఖ్య 150 మించకూడదని చెప్పారు.ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా పెండింగ్ ఫైళ్లను ఈ నెల 15లోపు పరిష్కరించాలని, ఇకపై కార్యాలయాల్లో ఫైళ్లను ఈఆఫీస్ ద్వారా నిర్వహించి ఆన్‌లైన్‌లోనే సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సోమవారం ప్రజావాణిలో మొత్తం 125 ఫిర్యాదులు అందాయి. అందులో రెవెన్యూ శాఖకు 72, ఇతర శాఖలకు 53 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

రూ. 10కోట్లతో 10,000మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వ్యవసాయ గోదాం



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని 11వ వార్డు శేరిపల్లి రోడ్డు రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ నిధుల నుండి మంజూరైన రూ. 10 కోట్లతో 10,000మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నూతనంగా నిర్మించనున్న వ్యవసాయ గోదాం నిర్మాణ పనులకు రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ శ్రీ రాయల నాగేశ్వర్‌రావు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ రైతులకు మౌలిక వసతులు మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ,వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సదుపాయం కల్పించడంతో ఈ గోదాం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు దేవరకొండద పట్టణంలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. అనంతరం డిండి మండలంలోని ఎర్రారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కౌన్సిలర్లు, పట్టణ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాగాంధీ పాఠశాల తనిఖీ

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల కంచనపల్లిలో ఎమ్మెల్యే మందుల సామేలు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల వేళల్లో హాజరు కావాల్సిన వారు లేకపోవడంతో కలెక్టర్ తోపాటు సంబంధించిన అధికారులకు ఫిర్యాదు చేశారు. నాణ్యమైన ఆహారం అందడం లేదని ప్రభుత్వం ఇస్తున్న ప్రకారణం అందించాలని ఆదేశించారు.



## అంతర్రాష్ట్ర దొంగల ముఠాలో ఒకరు అరెస్ట్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసి ఒక లారీ, రెండున్నర లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన ప్రకాష్ రాజేంద్ర సకరే అనే లారీ డ్రైవర్ ఎస్ కే. షరీఫ్ అనే వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తూ అంతరాష్ట్ర ముఠా దొంగలతో చేతులు కలిపి చెన్నైకి గోద్రెజ్ కంపెనికి చెందిన 112 రసాయన డ్రమ్ములను తీసుకువెళుతూ ఫిబ్రవరి 08వ తేదిన కొండమల్లేపల్లి గ్రామ శివారులో లారీని దొంగతనం చేశారు. లారీ యజమాని ఎస్‌కే షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా లారీ డ్రైవర్ ప్రకాష్ చెన్నారం గేటువద్ద ఆదివారం అనుమానస్పదంగా తిరుగుతుండడంతో పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుండి ఒక లారీని, రెండున్నర లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముఠాలోని మిగత ఆరుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసును చేధించిన సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది హేమునాయక్, భాస్కర్, కృష్ణారెడ్డి, హోమ్‌గార్డ్ శేఖర్‌లను ఎస్పి శరత్ చంద్ర పవార్, డిఎస్పి శ్రీనివాసరావులు అభినందించి నగదు రివార్డులను అందజేసినట్లు తెలిపారు.



# దాతర్పల్లి చెరువుకు గోదావరి జలకళ

గంగమ్మకు జలహారతి పట్టిన ప్రభుత్వ విప్ బీర్ల

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ఎండలు ముదురుతున్న వేళ ఆలేరు నియోజకవర్గంలోని గడ్డపై గోదావరి జలాల పరవళ్లు కనిపిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం దాతర్పల్లి గ్రామంలోని పెద్దచెరువు గోదావరి నీటితో నిండుకుండలా మారి అలుగు పోస్తుండటంతో సోమవారం అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఈ అపురూప ఘట్టాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, గంగమ్మకు జలహారతి ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'రైతు కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. వేసవిలో సాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు వ్యూహంతో ఆలేరు నియోజకవర్గంలోని చెరువులను గోదావరి జలాలతో కలుపుతున్నాం. మల్లన్న సాగర్, కొండపోచమ్మ, నవాబ్ పేట రిజర్వాయర్లతో పాటు తపాస్పల్లి ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనన్ని ఎక్కువ చెరువులను నింపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నాం,' అని స్పష్టం చేశారు. చెరువులు నిండటం వల్ల భూగర్భ జలాలు పెరిగి అటు సాగుకు, ఇటు తాగునీటికి ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరిత భాస్కర్, వార్డు మెంబర్, మేడబోయినస్వామి, ముదిగొండ నరేష్, బత్తిని కాటమరాజు,నమిలే చంద్రయ్య,ఉప సర్పంచ్ నరసింహా నాయక్ పాల్గొన్నారు.



## రోడ్లు, భవనముల అతిథి గృహానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతనంగా రూ.10కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్లు భవనముల అతిథి గృహం (గెస్ట్ హౌస్) సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాదవ రావు, తహశీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమీషనర్ హనుమంతరావుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# షెటర్స్‌లోనే వ్యాపారాలు

మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మున్సిపాలిటీలో స్ట్రీట్ వెండర్స్ తమ దుకాణాల ద్వారా వ్యాపారాలు చేసుకునే వారు రోడ్డుపై తోపుడుబండ్లను పెట్టుకోవద్దని మున్సిపాలిటీ చైర్ పర్సన్ తడక వెంకటేశ్వర్లు వ్యాపారస్తులకు సూచనలు చేస్తూనే మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆయన మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి మున్సిపల్ పాలకవర్గంతో కలిసి సోమవారం పోచంపల్లి పట్టణంలోని ప్రధాన రోడ్డుపై ఇరుపక్కల వ్యాపారాలు చేస్తున్న యజమానులతో నేరుగా కలిసి వాహనాల రాకపోకలకు, పార్కింగ్, ట్రాఫిక్, ఆర్టీసీ బస్ డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులు ఫిర్యాదుల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేసి తోపుడుబండ్లపై పండ్లు పూలు కూరగాయలు టిఫిన్ సెంటర్లు ఇంకా ఇతర వ్యాపారాలు చేసుకునేవారు. ఎట్టి పరిస్థితిలో రోడ్లపై పెట్టవద్దని తమతమ దుకాణాల్లోనే వ్యాపారాలు కొనసాగించుకోవాలని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్, గౌడ్ కౌన్సిలర్లు కొండమదుగు ఎల్ల స్వామి, సూరేపల్లి రాధికా రమేష్, రావుల జంగయ్య యాదవ్, దేవరాయ కుమార్, మున్సిపల్ అధికార సిబ్బంది నేతాజీ యువజన సమాఖ్య అధ్యక్షులు గుణిగంటి రమేష్ గౌడ్ ఉన్నారు.



## చోక్లతండ గ్రామ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

త్వరలో చోక్లతాండలో పర్యటిస్తానని కలెక్టర్ హామీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని చోక్లతండ గ్రామ భూనిర్వాసితులతో సమస్యలను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ భూక్య రాజారాం నాయక్ సోమవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రాజారాం మాట్లాడుతూ బస్వాపూర్ రిజర్వాయర్‌లో కోల్పోతున్న గ్రామ ఇండ్ల, భూముల నష్టపరిహారాన్ని త్వరగా ఇప్పించాలని, మా పునరావాసా నూతన గ్రామంలో మౌళికవసతులు ఏర్పాటు చేసి త్వరగా అభివృద్ధి చేయాలని, పట్టా భూముల నష్టపరిహారాన్ని త్వరగా చెల్లించాలని కోరారు. ఇప్పటివరకు 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు, బతుకుదేరువు కోసం వలస వెళ్లిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిచి తొందర్లోనే మీ గ్రామంలో పర్యటిస్తానని, సాధ్యమైనంత తొందరగా మీ సమస్యలు పరిష్కరిస్తానన్నారని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్య శ్రీను, లాలోజి, భూక్య వెంకటేష్, మధు, రాంకోటి, మోతిరాం, బాలు, రాజు, బిచ్చు, గ్రామస్థులు, భూనిర్వసితులు పాల్గొన్నారు.



## సచిన్ సలహాలతో రెచ్చిపోయా..
# నా కలల్ని నిజం చేసుకున్నా!

ఐసిసి ఈవెంట్లో ఒక్క మ్యాచ్‌లో జట్టును గెలిపిస్తేనే అది గొప్ప విషయం. అలాంటిది ఏకంగా సూపర్8, సెమీఫైనల్, ఫైనల్లోనూ విధ్వంసక అర్ధ శతకాలతో భారత జట్టు విజయాల్లో కీలకమయ్యాడు సంజూ శాంసన్. సన్నాహక సిరీస్‌లో న్యూజిలాండ్‌పై ఘోరంగా విఫలమైన సంజూ.. నాకౌట్ మ్యాచ్‌లో టీమిండియాకు పెద్ద దిక్కులా మారడానికి కారణం ఎవరో తెలుసా..? సచిన్ టెండూల్కర్. ఈ విషయాన్ని ఫైనల్ అనంతరం ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు ప్రదానం సమయంలో ఈ చిచ్చరపిడుగే స్వయంగా చెప్పాడు. పొట్టి ప్రపంచకప్ నిలబెట్టుకున్న భారత జట్టు మూడో ట్రోఫీతో చరిత్ర సృష్టించింది. స్వదేశంలో ఫేవరెట్‌గా అడుగుపెట్టి.. సంచలన ఆటతో ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా విజయంలో సంజూ శాంసన్ పాత్ర ఎంత కొనియాడినా తక్కువే. నిరుడు అక్టోబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనలో బెంచ్‌కే పరిమితమైన ఈ పవర్ హిట్టర్.. హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలతో జట్టుకు కొండంత అండగా మారాడు. పొట్టి క్రికెట్‌లో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వానికి కొదవలేకున్నా.. నిలకడలేమితో విమర్శలపాలైన సంజూ ఇప్పుడు గెలుపు గుర్రంగా అవతరించాడు. మూడు అర్ధ శతకాలతో కలిపి 261 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు అందుకున్న తనలో ఇంతటి భారీ మార్పులకు కారణం సచిన్ టెండూల్కర్ అని చెబుతున్నాడు శాంసన్. 'గత రెండు మూడు నెలలుగా సచిన్‌తో తరచూ మాట్లాడుతున్నాను. నిరుడు అక్టోబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనలో నేను బెంచ్‌కే పరిమితమయ్యాను. పొట్టి సిరీస్‌లో నాకు అవకాశాలు రాలేదు. అలాంటప్పుడు పాజిటివ్ ఆలోచనతో ఉండడం ముఖ్యం. కానీ, నావల్ల కాలేదు. దాంతో.. సచిన్‌కు ఫోన్ చేసి మాట్లాడాను. సుదీర్ఘ సమయం ఇద్దరం మాట్లాడుకున్నాం. న్యూజిలాండ్‌తో పొట్టి సిరీస్‌లో వైఫల్యం తర్వాత నా మనసు ముక్కలైంది. నాకు ఏమీ చేయాలో పాలుపోలేదు. నా కలలు చెదిరిపోయినట్లు అనిపించింది. ఆ సమయంలో ఏం చేయాలో తోచలేదు. అయితే.. ఆ దేవుడి ప్రణాళిక మాత్రం వేరేలా ఉంది. వెంటనే సచిన్‌కు ఫోన్ చేసి మాట్లాడాను. వరల్డ్‌కప్ ఫైనల్ ముందు రోజు రాత్రి కూడా సచిన్ ఫోన్ చేసి నేను ఎలా ఉన్నాను అనేది తెలుసుకున్నాడు. క్రికెట్ దిగ్గజమైన సచిన్ నుంచి సలహాలు తీసుకోవడం, స్పష్టతతో ఉండడం, మ్యాచ్‌కు సన్నద్ధమవ్వడం.. పరిస్థితులపై అవగాహన పెంచుకోవడం వంటివి ఎంతో ఉపయోగపడ్డాయి. వరల్డ్‌కప్‌లో నేను రాణించడానికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని శాంసన్ తెలిపాడు.



## భారత్‌కు లక్కీ హ్యాండ్‌గా గంభీర్!

నరేంద్రమోదీ స్టేడియంలో పంజా విసిరిన భారత జట్టు వరుసగా రెండోసారి టీ–20 ఛాంపియన్‌గా నిలిచింది. సంచలన ఆటతో తొలిసారి పొట్టి కప్‌ను ఒడిసిపట్టాలనుకున్న న్యూజిలాండ్ కలల్ని కల్లలు చేసిన టీమిండియా.. మూడో కప్‌ను ముద్దాడింది. స్వదేశంలో మూడేళ్ల క్రితం వన్డే వరల్డ్‌కప్ చేజారిన బాధను మరిపించే విజయంలో సూర్యకుమార్ యాదవ్ సేన ట్రోఫీని కొల్లగొట్టింది. ఈ విజయంలో ఆటగాళ్ల కష్టంతో పాటు ప్రధాన కోచ్ గౌతం గంభీర్ పాత్ర కూడా ఎనలేనిది. ప్రయోగాల పేరుతో జట్టును నాశనం చేస్తున్నాడని అతడిని విమర్శించిన వాళ్లే ఇప్పుడు నువ్వు గొప్ప కోచ్.. జట్టును ఛాంపియన్‌గా తీర్చిదిద్దావు అని పొగుడుతున్నారు. సొంతగడ్డపై ఫేవరెట్‌గా బరిలోకి దిగి అదిరే ఆటతో పొట్టి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఐసిసి ఫైనల్లో మెరుగైన రికార్డున్న న్యూజిలాండ్‌పై భారత జట్టు 96 పరుగుల తేడాతో చిత్తు చేసి కప్‌ను కొల్లగొట్టింది. ఇంతటి విజయంలో ఆటగాళ్ల కృషి ఎంతుందో.. కోచ్ గంభీర్ కష్టం కూడా అంతే ఉందని చెప్పొచ్చు. రెండేళ్ల క్రితం రాహుల్ ద్రవిడ్ వారసుడిగా భారత కోచింగ్ పగ్గాలు చేపట్టిన గౌతీ.. ప్రయోగాలతో విమర్శలపాలయ్యాడు. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్.. టెస్టు సిరీస్‌ను 2–0తో దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్ చేసింది. ఈ నేపథ్యంలో టీ–20 వరల్డ్‌కప్‌లో గంభీర్ కోచింగ్‌కు పరీక్ష నిలిచింది. వన్డే సిరీస్‌ను పక్కన పెట్టేసి కుర్రాళ్లను సానపెడుతూ వచ్చిన అతడు.. ప్రపంచకప్‌లో ఫలితాలు చవిచూశాడు. ఇంకేముంది.. ఇన్నాళ్లుగా మనోడిని తిట్టిన నోళ్లతోనే ప్రశంసలు అందుకుంటున్నాడు. నరేంద్ర మోదీ స్టేడియంలో న్యూజిలాండ్‌ను 96 పరుగులతో మట్టి కరిపించిన భారత మూడోసారి పొట్టి కప్‌ను కొల్లగొట్టింది. కోచ్‌గా నిరుడు ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ అందించిన గంభీర్ తొలి ఐసీసీ ట్రోఫీని దేశానికి కట్టబెట్టాడు. ఇప్పటికే ఆటగాడిగా ఈ దిగ్గజం రెండు వరల్డ్‌కప్ గెలుపొందిన విషయం తెలిసిందే. ఎంఎస్ ధోనీ సారథ్యంలో 2007లో టీ–20 వరల్డ్‌కప్.. తిరిగి 2011లో వన్డే వరల్డ్‌కప్ సాధించిన జట్టులో సభ్యుడు కావడం విశేషం. తొలి సీజన్ పొట్టి ప్రపంచకప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై అర్ధ శతకంతో రాణించిన అతడు.. వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో శ్రీలంకపై మెరుపు అర్ధ శతకంతో భారత్ విజయంలో కీలకమయ్యాడు. అందుకే గంభీర్‌ను ఐసీసీ వరల్డ్‌కప్ టోర్నమెంట్లలో లక్కీ హ్యాండ్‌గా పేర్కొంటున్నారు కొందరు.



## యువతరంగం

## 'మై భారత్ 'లో రెండు కోట్లు

యువతను దేశ నిర్మాణ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడానికి రూపొందించిన 'మై భారత్' (మేరా యువ భారత్) డిజిటల్ వేదికలో ఇప్పటికే రెండు కోట్ల మంది యువతీ, యువకులు తమతమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ వేదిక ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవ, నాయకత్వ అవకాశాలు వంటి అనేక కార్యక్రమాలను అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం, ఈ ప్లాట్‌ఫారమ్‌లో ఇప్పటికే రెండు కోట్లకు పైగా యువత నమోదు చేసుకోవడం వారిలో పెరుగుతున్న సామాజిక చైతన్యాన్ని సూచిస్తుంది. ఈ ప్లాట్‌ఫారమ్ ప్రధానంగా యువతను డిజిటల్ వనరుల ద్వారా శిక్షణ, సేవా కార్యక్రమాలకు అనుసంధానం చేయడమే లక్ష్యంగా ఏర్పాటైంది. ఇందులో వివిధ రంగాలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు, వాలంటీర్ అవకాశాలు, సామాజిక అభివృద్ధి ప్రాజెక్టులు అందుబాటులో ఉంటాయి. విద్య, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య అవగాహన, గ్రామాభివృద్ధి వంటి రంగాల్లో యువత పాల్గొనే అవకాశాలను ఇది కల్పిస్తుంది. 'మై భారత్' వేదిక ద్వారా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చు. ఉదాహరణకు నాయకత్వ నైపుణ్యాలు, కమ్యూనికేషన్, సమన్వయం, సమస్య పరిష్కార సామర్థ్యం వంటి అంశాల్లో ప్రాక్టికల్ అనుభవం పొందే అవకాశం ఉంటుంది. ఈ విధంగా యువత వ్యక్తిగతంగా ఎదగడంతో పాటు సమాజానికి కూడా సేవ చేయగలుగుతారు. దేశ నిర్మాణంలో యువత పాత్రను బలపరచడం ఈ కార్యక్రమ మరో ముఖ్యమైన లక్ష్యం. యువత శక్తి ఒక దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైనది. అందువల్ల సామాజిక కార్యక్రమాలు, సేవా కార్యకలాపాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడం సాధ్యమవుతుంది. దీనిపై యువత సానుకూలంగా స్పందించడం శుభపరిణామం.




## మానసిక ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ!

ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశ యువతలో మానసిక ఆరోగ్యం, సామగ్రిక శ్రేయస్సు గురించి అవగాహన గణనీయంగా పెరుగుతోంది. గతంలో ఆరోగ్యం అంటే ప్రధానంగా శారీరక ఆరోగ్యానికే ప్రాముఖ్యత ఇచ్చేవారు. అయితే ఇప్పుడు యువత మానసిక స్థిరత్వం, భావోద్వేగ సమతుల్యత, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాలు కూడా జీవిత నాణ్యతను నిర్ణయిస్తాయని గుర్తిస్తున్నారు. ఆధునిక జీవనశైలి, చదువు, ఉద్యోగ పోటీ, నగర జీవన ఒత్తిడి వంటి కారణాల వల్ల మానసిక ఆరోగ్య సమస్యలు ఎక్కువగా చర్చకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మంది యువత తమ జీవనశైలిలో మార్పులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించడం ఒక ముఖ్యమైన ధోరణిగా కనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వేదికలు సమాచార మార్పిడికి ఉపయోగకరమైనప్పటికీ, వాటి అధిక వినియోగం కొన్నిసార్లు మానసిక ఒత్తిడికి దారి తీస్తుంది. నిరంతరం ఇతరుల జీవితాలతో పోల్చుకోవడం, ఆన్‌లైన్ ప్రతిస్పందనలపై ఆధారపడటం, సమాచారం అధికంగా రావడం వంటి అంశాలు యువతలో ఆందోళన, ఒత్తిడిని పెంచుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న యువతలో కొందరు డిజిటల్ డీటాక్స్ అనే పద్ధతిని అనుసరిస్తున్నారు. అంటే కొంతకాలం సోషల్ మీడియా నుండి దూరంగా ఉండడం లేదా వినియోగాన్ని పరిమితం చేయడం. ఈ సమయంలో వారు పుస్తక పఠనం, వ్యాయామం, యోగా, ధ్యానం, ప్రకృతిలో గడపడం వంటి కార్యకలాపాలకు సమయం కేటాయిస్తారు. ఈ అలవాట్లు మానసిక ప్రశాంతతను పెంచడంలో సహాయపడతాయి. మానసిక ఆరోగ్యంపై చర్చ కూడా ఇప్పుడు ఎక్కువగా జరుగుతోంది. గతంలో ఈ అంశంపై మాట్లాడటానికి చాలామంది సంకోచించేవారు. కానీ ప్రస్తుతం పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, కార్యాలయాలు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.



## సూపర్ ఇర్ఫాన్..

కశ్మీర్‌లోని బండిపోరా జిల్లాకు చెందిన ఒక యువకుడి విజయం దేశవ్యాప్తంగా ప్రేరణగా నిలిచింది. నార్త్ కాశ్మీర్‌లోని నైద్‌ఖై సోనవారి ప్రాంతానికి చెందిన ఇర్ఫాన్ అహ్మద్ లోన్ యువకుడు పూర్తిగా దృష్టి లోపం ఉన్నప్పటికీ భారతదేశంలోని అత్యంత కఠినమైన పోటీ పరీక్షల్లో ఒకటైన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)లో ఉత్తీర్ణత సాధించాడు. బషీర్ అహ్మద్ లోన్ కుమారుడైన ఇర్ఫాన్‌కు నూరు శాతం అంధత్వం ఉంది. అయినప్పటికీ, అతను విద్యాభ్యాసాన్ని ఆపలేదు. అనేక సంవత్సరాల కష్టపాటు, పట్టుదల, అంకితభావంతో కృషిచేసి, చివరికి చిరస్మరణీయ విజయాన్ని సాధించాడు. ఇటీవల ప్రకటించిన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఇర్ఫాన్‌కు ఆల్ ఇండియా ర్యాంక్ 957 వచ్చింది. సివిల్ సర్వీసెస్ పరీక్ష దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పరీక్షలలో ఒకటి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరవుతారు. ఇందులో ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ వంటి దశలు ఉంటాయి. ఈ పరీక్షలో విజయాన్ని సాధించడానికి విస్తృతమైన పఠనం, విశ్లేషణా సామర్థ్యం, క్రమశిక్షణ, దీర్ఘకాలిక సిద్ధత అవసరం. దృష్టి లోపం ఉన్న అభ్యర్థికి ఈ ప్రయాణం మరింత కష్టమైనదే. పాఠ్యపుస్తకాలను చదవడానికి బ్రెయిల్ పద్ధతులు, ఆడియో పాఠ్యాలు, స్క్రీన్ రీడర్ సాఫ్ట్‌వేర్ వంటి ప్రత్యేక సాంకేతిక సహాయాలను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ కష్టాలన్నింటినీ ఎదుర్కొంటూ ఇర్ఫాన్ తన లక్ష్యాన్ని వదలకుండా ముందుకు సాగాడు. దృఢ సంకల్పం, కృషి, లక్ష్యంపై నిబద్ధత ఉంటే అసాధ్యమనిపించే లక్ష్యాలనూ సాధించవచ్చని ఇర్ఫాన్ నిరూపించాడు. ఆయన కథ యువతకు ప్రేరణగా నిలుస్తోంది. ముఖ్యంగా శారీరక సవాళ్లు ఎదుర్కొనే విద్యార్థులకు ఇది ఆశను నింపే ఉదాహరణ. ఇర్ఫాన్ విజయ గాథ పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర కృషికి ప్రతీక. మన జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు ఎంత పెద్దవైనా సరే, దృఢ సంకల్పంతో ముందుకు సాగితే విజయాన్ని సాధించవచ్చని ఆయన జీవితం స్పష్టంగా చూపిస్తుంది.



### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం రద్దుకు ఎఐటియుసి కలెక్టరేట్ ముట్టడి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని ఉపసంహరించుకొని యధాతథంగా మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని సోమవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయల వేతనాన్ని చెల్లిస్తామని, ప్రతినెల బిల్లును చెల్లిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కదారి పట్టిస్తుందని, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానంతో అక్షయపాత్ర సంస్థకు మధ్యాహ్న భోజన పథకాన్ని దొడ్డిదారిన అప్పజెప్పే కుట్రలు చేస్తున్నారన్నారు. కార్మికులకు ప్రభుత్వం ప్రకటించే మెను ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టడానికి 25 రూపాయల చార్జీ చెల్లించాలని, కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సురెన్సు సౌకర్యం కల్పించడంతోపాటు యూనిఫారం ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. చక్రపాణి, గౌరవ అధ్యక్షులు సాయమ్మ, నాయకులు గంగమణి, లత, బుచ్చవ్వ, లావణ్య, వీరేశం, నాగలక్ష్మి , లలిత, అనసూయ పాల్గొన్నారు.

## భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ వినతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** షహిద్ భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌కు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు, ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచి, విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది భగత్ సింగే అని ఆయన అన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమం లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో భగత్ సింగ్ ఒకడని,. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, మాతృదేశ విముక్తి కోసం పోరాడి, నూనుగు మీసాల వయసులో చిరునవ్వుతో ఉరు కంబాన్ని ముద్దాడి అమరుడైన విప్లవ వీర కిషోరం భగత్ సింగ్ విగ్రహాన్ని రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు మాతంగి సాగర్, గుండ్ల లక్ష్మి ప్రసన్న, అను సాయి, జశ్వంత్ , అభి, చైత్ర, తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక పోరాటాలు ఉధృతం

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** దళితులు, బడుగు బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, వివక్షలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ మహబూబ్‌నగర్ జిల్లా రెండవ మహాసభలు జి.శ్రీనివాస్ అధ్యక్షతన సురవరం వెంకటరామిరెడ్డి భవన్‌లో జరిగింది. ఈ మహాసభల ప్రారంభ సూచికగా డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి లక్ష్మి పతి జెండా ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణం ఇంకా దూరంలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కుల వివక్ష, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయని, దళితులపై దాడులు, భూస్వామ్య దోపిడీలు, అణచివేతలు తరచూ జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వాలు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను పూర్తిగా అమలు చేయడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రత్యేకంగా దళితులకు కేటాయించాల్సిన సబ్ ప్లాన్ నిధులు సరైన విధంగా ఖర్చు చేయకుండా ఇతర అవసరాలకు మళ్లించడం తీవ్రమైన అన్యాయమని అన్నారు. దళితుల భూమి సమస్యలు, ఉపాధి సమస్యలు, విద్యా అవకాశాల లోపం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేయకపోవడం వంటి సమస్యలు



రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సామాజిక ఉద్యమాలను బలంగా నిర్మించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. డా.అంబేద్కర్ చూపిన మార్గంలో ప్రజాస్వామ్య పరమైన పోరాటాల ద్వారా మాత్రమే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, దళితులు, ప్రజాస్వామ్య వాదులు, ప్రగతిశీల శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ రాష్ట్ర మహాసభలు వరంగల్ జిల్లాలోని ఏప్రిల్ 17,18 సాయి కన్వెన్షన్ జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్, మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భార్గవి, పద్మావతి, సురేష్, శ్రీనివాస్, అంజి, రాజు, ఆంజనేయులు, వెంకటరాములు, శ్రీను, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

## హైర్ బస్ డ్రైవర్ల శ్రమ దోపిడీ చేయొద్దు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసి సంస్థలో పనిచేస్తున్న ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లను యాజమాన్యం శ్రమదోపిడీకి గురి చేస్తోందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆరోపించారు. సోమవారం ఆసిఫాబాద్‌లోని ఎస్‌టియు భవనంలో యూనియన్ డిపో అధ్యక్షుడు మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్ల సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో హైర్ బస్ డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారని, కార్మిక చట్టాలు అమలు చేయకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. హైర్ బస్ డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేస్తూ కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, ఎలాంటి షరతులు లేకుండా వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధుసూదన్, సజిత్ హుస్సేన్, అశోక్, సాయికిరణ్, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికి పోరాటబాట



సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటబాట తప్పదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. సోమవారం స్థానిక శేషగిరి భవన్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 17 తేదిన మూడు షిఫ్టుల్లో నల్లబ్యాడ్జీలతో కార్మికులు నిరసన చేపడతారని, యాజమాన్యం తప్పించుకునే దోరణులను ప్రదర్శిస్తు,ండటంతో కార్మికులకు సమస్యలను వివరించేందుకు 18వ తేదిన శ్రీరాంపూర్ నుండి ప్రచార జాతా ప్రారంభిస్తామని తెలిపారు. ఈప్రచార జాతా సింగరేణి 12 ఏరియాల్లో కలియతిరిగి కార్మికులకు అవగాహన కల్పించనుందన్నారు. అన్ని యూనియన్లను కలుపుకుని ఏప్రిల్ 1, 2 వారాల్లో ఒక్కరోజు టోకెన్ సమ్మెను నిర్వహిస్తామని తెలిపారు. సింగరేణి యాజమాన్యం నవంబర్ 2024, మార్చి 2025లో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో పలు డిమాండ్లను అంగీకరించిందని, కానీ ఆ డిమాండ్లు నేటికి పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అనారోగ్యాల కారణంగా చాలా మంది కార్మికులు మెడికల్ బోర్డుకు దరఖాస్తులు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా వారిని మెడికల్‌కు పిలవకుండా కార్మికులను మనోవేదనకు గురిచేస్తున్నారన్నారు. మారు పేర్ల సమస్య తీవ్రంగా ఉందని, ఆ సమస్యను యాజమాన్యం పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, కానీ నేటికి అది కార్యరూపం దాల్చకపోవడంతో వారసులకు ఉద్యోగాలు రావడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనరల్ సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికుల జీతం రికవరీ చేస్తామని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, దానిని రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కొత్తగనులు ఇవ్వకుండా తెలంగాణలోని సింగరేణిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందని, వేలంతో సంబంధం లేకుండా తెలంగాణలో ఉన్న కొత్తగనులు సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు వంగా వెంకట్, వీరస్వామి, వి.మల్లిఖార్జునరావు, గట్టయ్య, రాము, క్రిష్టాఫర్, ఎర్రగాని కృష్ణయ్య, లక్ష్మి నారాయణ, సందెబోయిన శ్రీనివాస్, హుమాయూన్, జాన్ నర్సయ్య, మండలి రాజేశ్వరరావు, బండారి మల్లయ్య, తిరుపతి, సోమయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములు పేదలకివ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ నాయకుల డిమాండ్

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా అయినవోలు మండలం వెంకటాపూర్ గ్రామ రెవెన్యూ శివారు సర్వే నంబర్ 324లో గల ప్రభుత్వ అసైన్మెంట్ భూమిని రక్షించి ఆ భూమిని పేదలకివ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. పోరాట కమిటీ నాయకుడు మాదాసి యాకోబు ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి కె.లక్ష్మ ణ్, జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టెపాక రవి హాజరై మాట్లాడుతూ సుమారు వంద ఎకరాలకు పైగా ప్రభుత్వ అసైన్డ్ భూమి కబ్జాదారుల చేతుల్లో ఉన్నదని, 20 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన దళితులు ఇతర నిరుపేద కుటుంబాల వారు ఆ భూమి కోసం ప్రభుత్వాన్ని విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. విలువైన భూమిని పలుకుబడి కలిగిన ఒక వ్యక్తి తన రాజకీయ అండదండలతో పొందటం నేరమన్నారు. తక్షణమే అక్రమ పట్టాలను రద్దు చేసి, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకొని గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు మునిగాల బిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకటరాజం, బొట్టు బిక్షపతి, అలవాల రాజు, జూకంటి పద్మ, మాదాసు సుధాకర్, కోటి, ఎడ్ల యాకన్న, సింగారపు చందు, హనుమకొండ కోమల, మచ్చ ఎల్లమ్మ, మాదాసు రజిత, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.





## సిఐఎ ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ ప్రారంభం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** పరిశ్రమలు అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని సిఐఎ భవనంలో ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిఐఎ ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో–2026 నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి టిఫ్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, ఐలా చైర్మన్ గోవింద్‌రెడ్డి, సిఐఎ ప్రెసిడెంట్ డి శ్రీనివాస్‌రెడ్డితో కలసి ప్రారంభించి స్టాళ్లను సందర్శించారు. స్థానిక పరిశ్రమల అభివృద్ధి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎంఎస్ఎంఇ అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని, ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కె హరీష్‌రెడ్డి,సిఐఎ కార్యదర్శి పిఎస్ మోహన్,వై సుధాకర్ రెడ్డి, ఎస్ శ్రీనివాస్, గోపాలరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రూ.106 లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**



ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ కాలనీలో 44 లక్షలు, కృష్ణా నగర్ కాలనీలో 10 లక్షలు, సిల్వర్ ఓక్ కాలనీ 14 లక్షలు, విద్యామారుతీ నగర్ 38 లక్షలు రోడ్డు పనులకు మొత్తం 106 లక్షల రూపాయలతో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రోడ్ల పనులు త్వరితగతిన పూర్తిచేసి కాలనీవాసుల రాకపోకలకు సులభతరం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ అభిషేక్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సన్మానం

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు శ్రీనివాస్ రెడ్డి, శ్వేత దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులు, గ్రామంలో ప్రభుత్వ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళా దినోత్సవం అనేది కేవలం ఒకరోజు జరుపుకునే వేడుక మాత్రమే కాకుండా మహిళలను ప్రతి రోజు గౌరవించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రభావతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 2 లక్షల మందికి అన్న ప్రసాద వితరణ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ సోలీస్ ఆసుపత్రి, తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాండిచ్చేరిలోని తిరునల్లార్‌లో ప్రసిద్ధ ధర్భరణ్యేశ్వరస్వామి ఆలయంలో శని పేర్చి పవిత్ర ఉత్సవాలకు ఆరు లక్షల భక్తులు సందర్శించి దర్శనం చేసుకుంటారు.అందులో చారిటబుల్ చైర్మన్ నందనంపాటి రాము ఆధ్వర్యంలో 2 లక్షల మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, కొల్హాపూర్ మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి,సైదిరెడ్డి,కరైకల్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లక్ష్మి సౌజన్య,కలెక్టర్ ఇషితా రాఠి, ఇఓ సుబ్రహ్మణ్యం,కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, శంకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా అక్రమ ఎర్ర మట్టి తవ్వకాలు

### పట్టించుకోని సంబంధిత అధికారులు

**ప్రజాపక్షం /వికారాబాద్ రూరల్ :** పట్టపగులే అక్రమ ఎర్రమట్టి తవ్వకులు జరిపి గుట్టలు స్వాహ అవుతున్నా సంబంధిత అధికారుల పాట్టించుకోవడం లేదని తెలుస్తుంది. వికారాబాద్ మండల పరిధిలోని దన్నారం నుండి బురంతపల్లి వెళ్లే రహదరిలో పట్టపగలే అక్రమ ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్చగా సాగుతున్నాయి. అదికారపార్టీ నాయకులు కనుసనల్లోనే ఎర్ర మట్టి తవ్వకులు జరుతున్నాయి. రోజురోజుకూ కొండలను పిండి చేస్తు జేసీబీలతో భారీగా తవ్వకాలు జరుపుతున్నారు. పేద్ద ఎత్తున మంటి తోవ్వి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. అంతజరుగుతున్న అధికారులకు ప్రజాప్రతినిధులకు అంతర్గత ఒప్పందాలు ఉన్నాయనే విమర్శలు స్థానికంగా వెల్లువెత్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన మైనింగ్ ,రెవెన్యూ అధికారులు స్పందించి ,ఈ అక్రమ దందాను అరికట్టాలని ,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావాణిలో 99 అర్జీలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 99 అర్జీలను ధరఖాస్తుదారులు అధికారులకు సమర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఇన్‌చార్జి డిఆర్‌ఓ చంద్రావతితో కల్సి అర్జీలను స్వీకరించారు. హౌజింగ్ శాఖకు సంబంధించి 33 ధరఖాస్తులు వచ్చాయన్నారు. అనంతరం వారితో పాటు ఉన్న వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులను అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

# నిధులు మంజూరు చేయండి

### మంత్రి శ్రీధర్ బాబును కలిసిన చేవెళ్ల ఇంచార్జ్ భీమ్ భరత్, మండల సర్పంచ్‌లు



**ప్రజాపక్షం/నవాబుపేట్:** అభివృద్ధికి ఆమడ దూరంలో వున్న నవాబుపేట మండలంలోని గ్రామాలకు నిధులు కేటాయించాలని మండలంలోని నవాబుపేట, యావపూర్, పూలపల్లి, గంగ్యాడ, నారేగూడ, పులుమామిడి గ్రామాల సర్పంచ్‌లు, జిల్లా ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కోరారు. మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని చేవెళ్ళ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక ఎమ్మెల్యే తన సొంత మండలాని కి తీరని అన్యాయం చేస్తున్నాడు. మండల కేంద్రంలోని రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా ఉండి నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రతి గ్రామంలో రోడ్ల దుస్థితి ఘోరంగా ఉందన్నారు. గ్రామాలలో కనీస అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా సిసి రోడ్లు లేక గ్రామాలు అభివృద్ధిని నోచుకోలేవని అన్నారు. సొంత మండలానికి నిధులు కేటాయించని ఎమ్మెల్యే ఇంకా నియోజకవర్గం ఎలా అభివృద్ధి చేస్తాడని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి ఆయా సంబంధిత జిల్లా కలెక్టర్ తెలపడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, నవాబ్ పేట్ గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి, గంగ్యాడ సర్పంచ్ దోసాద మల్లేశం, తిమ్మారెడ్డి పల్లి సర్పంచ్ ప్రభాకర్, పుల్ మామిడి సర్పంచ్ దాన నర్సిములు, చించల్ పేట్ సర్పంచ్ అనసూయ అనంతరాములు, నారేగూడ సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరథ్, పూలపల్లి సర్పంచ్ భాగ్యలక్ష్మి మహేందర్ రెడ్డి, యావపూర్ సర్పంచ్ శివనీల లక్ష్మణ్, చేవెళ్ళ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పెంటరెడ్డి, పూలపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**గ్రామ అభివృద్ధికోసం నిధులు ఇవ్వండి : ఐటి శాఖ మంత్రిని కలిసిన నారేగూడ గ్రామ సర్పంచ్ దీపిక దశరథ్**



మండలంలోని నారేగూడ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ సోమవారం జిల్లా ఇంచార్జ్, ఐటి శాఖ మహత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబును నారేగూడ సర్పంచ్ ఎల్వర్తి దీపికా దశరథ్ కలిసి వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో పాఠశాలకు ప్రహరీ, మంచినీటికోసం బోర్లు, సిసి రోడ్డుతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకోసం నిధులు కేటాయించాలని మండల నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన మంత్రి త్వరలో నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ సహకారాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలి

### కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, సౌకర్యాలను వినియోగించుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు వెలుతూ ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు అందిస్తోందన్నారు. సోమవారం ఆల్వాల్‌లోని సఖి సెంటర్‌లో జిల్లా మహిళా శిశు వికాలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు 56 ట్రై సైకిళ్లు, 14 వీల్ చైర్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగులకు శారీరకంగా ఇబ్బందులు ఉన్నప్పటికి మానసికంగా ధైర్యంగా ఉంటూ తమ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ముందుకు వెళ్లాలని, అవసరమైతే ప్రభుత్వపరంగా తాను అన్ని విధాలా సహకరిస్తానన్నారు. ఆర్థికంగా ఎదిగేందుకు తమ ఆలోచనలు, ఇష్టాలు, నైపుణ్యంతో ఏదో ఒక రంగాన్ని ఎంచుకోవాలని, వ్యాపారం, స్టార్టప్, వృత్తి పరమైన పనుల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, ఆర్డీఓ ఓం ప్రకాష్, ఆల్వాల్ తహసీల్దా ర్ రాములు, డిడబ్ల్యూఓ శారద, తదితరులు పాల్గొన్నారు.



**మహిళల ఎదుగుదలకు చదువే ప్రాధాన్యం**

మహిళలు వివిధ రంగాల్లో ఎదిగేందుకు చదువు ప్రాముఖ్యత వహిస్తుందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. టిజిఒఎ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఘనంగా జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ విద్య కారణంగా మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ విజయకుమారి, జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ అభివృద్ధి అధికారి వినోద్, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారిణి సుగుణాబాయి. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అజేయ , మేడ్చల్ డిపో ఎఇ స్నేహలత, టిఎన్‌జిఓ జనరల్ సెక్రటరి కురుమూర్తి, జాయింట్ సెక్రటరి, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులందరికీ పక్కా ఇల్లు

### ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. సోమవారం నవాబుపేట్ మండలం కేశపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేశపల్లి గ్రామంలో పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవితం అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించడం నాకు చాలా ఆనందంగా ఉంది అన్నారు. ప్రజల సంక్షేమం మా ప్రభుత్వానికి ఎప్పుడూ మొదటి ప్రాధా న్యం. అందుకే పేదలందరికీ సొంత ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ఈ ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇలాం టి అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని తీసుకువచ్చి చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడానికి ఎప్పుడూ కృషి చేస్తానని అన్నారు. నియోజకవర్గం ప్రజల అందరి ఆశీర్వాదాలు, సహకారం ఉంటే ఇంకా మంచి పనులు చేయగలుగుతాంఅని అన్నారు. ఈ ఇంటిని పొందిన కుటుంబానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రామిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రాథోడ్ గీత సింగ్, గ్రామ సర్పంచ్ పావని మాణిక్యం, ఉప సర్పంచ్, ఎఎంసి డైరెక్ట ర్లు, నాయకులు కందాడ నాగిరెడ్డి, దేవయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం /వికారాబాద్ :** స్థానికి సంస్థల అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో , మున్సిపల్స్‌లో ఉన్న సమస్యలపై క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను, దీపక్ తివారీను కలిశారు.

## ప్రజావాణికి 289దరఖాస్తులు : కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం /వికారాబాద్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వివిధ ప్రాంతలనుండి వచ్చిన ప్రజలనుండి 289 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలు, ఆరోగ్య శాఖ ,పంచాయతీరాజ్, డిపిఓ, అటవీశాఖ, గనుల శాఖ, భూసేకరణ వివిధ జిల్లా అధికారులు వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై పెండింగ్ ఫైల్స్ అనీ క్లియర్ చేయాలనీ అధికారులకు ఆదేశించారు. వారంలోపు అన్ని పెండింగ్‌దరఖాస్తులను పరిష్కరించినవి, ఇంకా పెండింగ్ లో ఉన్నవి పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నవేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని ఆదేశించారు. అనంతరం 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ , రోజువారీ షెడ్యుల్ ప్రకారం ప్రజలు , ప్రజాప్రతినిధులుకార్యక్రమంలో తప్పనిసరిగా నిర్వమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్లు ఉమాశంకర్, రాజేశ్వరి జెడ్పిడిఇఒ సుధీర్, డిఆర్డిఒ శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

### ప్రధాన న్యాయమూర్తి చంద్రకిషోర్



**ప్రజాపక్షం /వికారాబాద్ :** జిల్లా కోర్డు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ కార్యక్రమంలోజిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రకిషోర్ పాల్గోని మాట్లాడుతూ మహిళల సాధనలను ,వారి సమాన హక్కుల కోసం చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకునే ముఖ్యమైన రోజు, సమాజం అభివృద్ధి చెందడంలో మహిళల పాత్ర ఎంతో కీలకం, ఒక కుటుంబం ఒక సమాజంలో ఒకదేశం అభివృద్ధి చెందాలంటే మహిళల శక్తి ఎంతో అవసరం. మహిళ అనేది కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదు ఆమె ఒక తల్లి, అక్క, చెల్లి, భార్య స్నేహితురాలు, ప్రేమ, త్యాగం, సహనం, ధైర్యం అనే విలువలకు మహిళలు ప్రతిరూపం ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ కూడా తమ కుటుంబం కోసం, సమాజం కోసం ముందుకు సాగుతూ ఉండటం మహిళల గొప్పతనం అన్నారు. మనం మహిళలకు గౌరవం ఇవ్వడం మాత్రమే కాకుండా, వారి సమాన హక్కులు ,మిదా భద్రతా అవకాశాలు, అందించడానికి కట్టుబడి ఉండాలి , మహిళలు బలంగా ఉంటే సమాజం కూడా బలంగా ఉంటుందని తెలిపారు. మహిళల వారి కలలను ప్రోత్సహిద్దాం అన్నారు. సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మిద్దాం అని సూచించారు.మహిళలు ఇప్పుడిప్పుడే అన్నిరంగాలలో మహిళలు పెరుగుతున్నారు. మహిళ న్యాయవదులను సన్మానించారు. వెంకటేశ్వర్లు, శాంతిదుత, వైష్ణవి, బాస్వరాజ్ , వెంకట్‌రెడ్డి,శంకరయ్య, కమల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నా రు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

**ప్రజాపక్ష /పరిగి :** విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన పరిగి మండల పరిధిలోని కిస్తామమ గుడి తండా గ్రామంలో జరిగింది. వ్యవసాయం చేయడానికి పొలానికి ట్రాక్టర్‌తో పొలం కరిగడా చేస్తూండగా పొలంలో దగ్గర కరెంట్ స్తంభం నుండి బోర్ మోటర్‌కు కనెక్షన్ ఉన్న కరెంట్ వైర్ తెగి పొలంలో పడి ఉన్నందున మోహన్ ఆ వైర్లను పైకి తీసే క్రమంలో కరెంట్ షాక్ తగిలి మృతి చెందడం జరిగిందని, తన భర్త మరణంపై ఎలాంటి అనుమానం లేదని రేణుక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దార్యప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### జిహెచ్‌ఎంసి కార్మికుల

## సమస్యలు పరిష్కరించాలి

### ఎఐటియుసి రాష్ట్ర మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తూ మృతి చెందిన వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎఐటియుసి రాష్ట్ర మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం కోరారు. ఈ మేరకు సోమవారం ఎఐటియుసి నేతలు రాములు, ప్రకాష్‌లతో కల్సి జిహెచ్‌ఎంసి కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌ను కల్సి వినతి పత్రం సమర్పించారు. ప్రతి సర్కిల్ కార్యాలయంలో పెరిగి పోతున్న నివాస గృహాలు, అపార్ట్‌మెంట్ల కారణంగా మున్సిపల్ కార్మికులకు నానాటికి పని భారం పెరిగి పోతుందని, జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచటంతో పాటు ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.



## అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదు

### కొంపల్లి డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి


**ప్రజాపక్షం/దుండిగల్:** అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు చేపడితే ఉపేక్షించేది లేదని చర్యలు చేపడతామని కొంపల్లి డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొంపల్లి సర్కిల్ 56లో అక్రమంగా నిర్మించిన షెడ్లపై చర్యలు చేపట్టారు. కొంపల్లి మరియు దూలపల్లి ప్రాంతాలలో అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ షెడ్లను అధికారులు గుర్తించి వాటిని కూల్చివేశారు. టౌన్ ప్లానింగ్ మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లను గుర్తించారు. అనంతరం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ షెడ్లను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణా రెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేకుండా ఎలాంటి షెడ్లు లేదా నిర్మాణాలు చేపట్టరాదని ప్రజలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





## క్రీడల్లో యువత అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** యువతలో క్రీడా స్ఫూర్తిని వెలికి తీయటంలో తరచు జరిగే వివిధ క్రీడా పోటీల్లో టోర్నమెంట్లు లాంటివి ఎంతగానో ఉపయోగపడుతాయని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ డివిజన్‌లో మేడ్చల్ మున్సిపల్ మాజీ చైర్మన్ చీర్ల రమేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న మేడ్చల్ వారియర్స్ క్రికెట్ ట్రోఫీ పోటీ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలను ప్రోత్సహించేందుకు పలు ప్రాంతాల్లో క్రీడా స్టేడియంలు, క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తోందని, వీటిని యువత వినియోగించుకొంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి వన్నె తెచ్చే లక్ష్యంతో ముందుకు వెళ్ళాలన్నారు.



## సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలుగా విజయలక్ష్మీ నర్సింహులు

**ప్రజాపక్షం/బంట్వారం :** తెలంగాణ శాసన సభాపతి మరియు స్థానిక శాసన సభ సభ్యులు గడ్డం ప్రసాద్ కూమార్ ఆధ్వర్యంలో,బంట్వారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పోచారం వేంకటేశం సమక్షంలో, బంట్వారం మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలుగా సూల్తాన్‌పూర్ గ్రామ సర్పంచు బర్కతుపల్లి విజయలక్ష్మి నర్సిములును ఏకాగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తోర్‌మామి గ్రామ సర్పంచు ఎం. సంజీవయ్య, సల్‌బత్తాపూర్ గ్రామ సర్పంచు బి. బాలయ్య, మాధ్వపూర్ సర్పంచు గోరే మియా, మాల సోమారం సర్పంచు కమలమ్మ లక్ష్మయ్య, మంగ్రాస్‌పల్లి సర్పంచు స్వప్న రమేష్, నాగారం సర్పంచు భాగ్యమ్మ కమలకర్, తదితరులు ఉన్నారు.

## 'ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక' 2కె రన్

### మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

**ప్రజాపక్ష /పరిగి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2కే రన్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత , పరిగి మున్సిపల్ అధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. తహసీల్దార్ ఆఫీస్ నుండి కొడంగల్ చౌరస్తావరకు నిర్వహించిన 2కే రన్‌ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ హనుమంతునాయక్ , కమిషనర్ వెంకటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణ ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతి సమస్యను క్షేత్రస్థాయి లో పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తా నని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, యూనిఫ్, అభిలా బాదం, ఎజాన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఉపయోగ పడే మొక్కలు నాటాలి



**ప్రజాపక్షం/యాచారం :** నర్సరిల్లో ఉపాధిహామి సిబ్బంది ప్రజలకు ఉపయోగ పడే మొక్కలు నాటాలని రంగారెడ్డి జిల్లా అడిషినల్ కలెక్టర్ కె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను అయన పరిశీలించారు. ఈసంధర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన 99 ప్రజాపాలన ప్రణాళికలో అన్ని పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధరాణి.ఇన్‌చార్జి ఎంపిఒ తిరుపతయ్య, గ్రామ సర్పంచ్ అనిత శరణం,ఉపాధి ఎపిఒ లింగయ్య,ఇంజనీర్ శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిషన్‌నాయక్ ,ఉపాధిసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో భాగస్వాములు

**ప్రజాపక్షం/యాచారం :** గ్రామాభివృద్దిలో వార్డు సభ్యులు బాగస్వాములు కావాలని ఎంపిడిఒ రాధరాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేధికలో రెండవ విడత వార్డు మెంబర్లుకు శిక్షణ శిభిరం నిర్వహించారు. ఈసంధర్బంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు అవసరమైన తాగునీరు. పారిశుధ్యం, కరంటు , సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపిఒ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటో నగర్ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించండి



**ప్రజాపక్షం/హయత్ నగర్:** ఎల్‌బి నగర్ నియోజకవర్గం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు గురవుతున్న ఆటోనగర్ డంపింగ్ యార్డ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మంత్రి కొండా సురేఖను కోరుతూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకు లు జనంపెల్లి విష్ను వర్ధన్ రెడ్డి, దిండు ప్రవీణ్, యారాల రామ్ రెడ్డి ,గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి,జక్కిడి సత్య తేజ్ రెడ్డి, గణేష్ యాదవ్,సాయి ముదిరాజ్,శివంత్ రెడ్డి,జి ఎస్ ఠాకూర్, వెంకటేష్ గౌడ్, టోకటి కిరణ్ ,సాయి ముదిరాజ్ తదిరరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ విగ్రహ ప్రతిష్ట

**ప్రజా పక్షం/శంకర్‌పల్లి:** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రా రెడ్డి నగర్ లో సోమవారం సద్గురు సేవాలాల్ మహారాజ్ ప్రతిష్టాపన, యాడి మరియమ్మ విగ్రహ ప్రతిష్టాపనలు జరిగాయి. నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఈ విగ్రహాలు ప్రతిష్టించారు. రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య లు సోమవారం దేవాలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, శంకర్ పల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎస్. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా



**ప్రజా పక్షం/శంకర్‌పల్లి:** మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహాయ సహకారాలను అందించడం జరుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. శంకర్ పల్లి మున్సిపాలిటీ నూతన కార్యవర్గ సమావేశం సోమవారం చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ అధ్యక్షతను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ... మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, వైస్ చైర్పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు చాకలి అశోక్, ప్రశాంత్, సంధ్యారాణి, దండు రాజేశ్వర్, భానుర్ కృష్ణ, గణేష్, ఆనందరావు, రాజన్ల వసంతమహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## సమాజాన్ని జాగృతపరిచిన 'దరువు'

### టియుడబ్ల్యుజె అధ్యక్షుడు విరహత్ అలీ



**ప్రజాపక్షం /సోమాజిగూడ:** తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానాలు చేసుకొన్న విద్యార్థుల త్యాగాలను ప్రపంచానికి తెలిసేలా దరువు సాంస్కృతిక వేదిక పనిచేసిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ అన్నారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దరువు జాతర సిల్వర్ జూబ్లీ వేడుకలకు సంబంధించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. సమావేశంలో వరంగల్ రవి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఒయు యుద్ధ నౌక విజయ్‌కుమార్, కృష్ణ, రమేశ్, తిరుమలేశ్, జోషి, శ్రీను పాల్గొన్నారు.

## హెచ్‌సిఎ సెక్రటరీగా జీవన్‌రెడ్డిని గెలిపించండి : విహెచ్

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** క్రికెట్ అభివృద్ధికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) ఎన్నికల్లో సెక్రటరీగా పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డిని గెలిపించాలని అంబర్‌పేట క్రికెట్ క్లబ్ అధ్యక్షులు, మాజీ ఎంపి వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఫతేమైదాన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి క్రికెట్ హబ్‌ను హైదరాబాద్‌లోనే కాకుండా జిల్లాల్లో కూడా విస్తరించాలని తన సంకల్పాన్ని వెల్లడించినట్టు తెలిపారు. జీవన్‌రెడ్డిని గెలిపిస్తే అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ మైదానాలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తారన్నారు.

# మల్లంపేట వాసులకు ఊరట



ప్రణీత్ ఆంటిల్యా అడ్డుగోడను తొలగించిన హైడ్రా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్లంపేట ప్రాంత నివాసితులను వేధిస్తున్న రహదారి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. తమది గేటెడ్ కమ్యూనిటీ అని చెప్పుకుంటూ 40అడుగుల బహిరంగ రహదారికి అడ్డంగా 'ప్రణీత్ ఆంటిల్యా' యాజమాన్యం నిర్మించిన ప్రహరీ గోడను హైడ్రా సోమవారం నేలమట్టం చేసింది. ఈ చర్యతో స్థానికులకు ఏకంగా 5 కిలో మీటర్ల ప్రయాణ దూరం తగ్గింది. మల్లంపేటలో రహదారిని మూసివేసి ప్రహరీ నిర్మించడంపై హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన హైడ్రా అధికారులు సదరు సంస్థకు నోటీసులు జారీ చేశారు. అయితే, ప్రణీత్ ఆంటిల్యా యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. ఈ వివాదాన్ని పరిశీలించిన హైకోర్టు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని హైడ్రాను ఆదేశించింది. హైకోర్టు సూచనల మేరకు హైడ్రా అధికారులు ఇరుపక్షాలతో చర్చలు జరిపి, హెచ్‌ఎండిఏ ప్లాన్‌లను పరిశీలించారు. హెచ్‌ఎండిఏ అనుమతించిన లేఅవుట్ ప్రకారం ఇది గేటెడ్ కమ్యూనిటీ కాదు అని తేలింది. నిబంధనల మేరకు రహదారుల కేటాయింపుల్లో ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు లేవని అధికారులు నిర్ధారించుకున్నారు. దీంతో చట్టప్రకారం నోటీసులు ఇచ్చి, సోమవారం అడ్డుగోడ తొలగించారు.

**తగ్గిన ప్రయాణ భారం...** ఇంతకాలం ఈ అడ్డుగోడ కారణంగా మల్లంపేట ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్4 నుండి బాచుపల్లి వైపు వెళ్లేవారు సుమారు 8 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వచ్చేది. గోడ తొలగింపుతో ఇప్పుడు కేవలం 3 కిలోమీటర్ల ప్రయాణంతోనే బాచుపల్లి క్రాస్ రోడ్స్ మీదుగా ప్రగతినగర్‌కు చేరుకోవచ్చు. మల్లంపేట గ్రామం, ప్రణీత్ లీఫ్ కాలనీ, ఆకాష్ వెంచర్, డ్రీమ్ వ్యాలీ, గ్రీన్ పార్క్, సాయినగర్, బృందావన్ కాలనీ, ఏపిఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ వంటి అనేక ప్రాంతాల ప్రజలకు ఈ మార్గం అందుబాటులోకి వచ్చింది. గోడ తొలగించిన వెంటనే హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో బిటి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.

## ఎపి, తెలంగాణలో ఇ-చలాన్ చెల్లింపులు..

## భారత్ కనెక్ట్‌కు పెరుగుతున్న ఆదరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ)కి చెందిన పూర్తి అనుబంధ సంస్థ భారత్ బిల్పే లిమిటెడ్ (ఎన్‌బిఎల్‌ఎల్) అభివృద్ధి చేసిన భారత్ కనెక్ట్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉన్న ఈచలాన్ సేవకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మంచి స్పందన లభిస్తున్నట్లు ఎన్‌బిఎల్‌ఎల్ ప్రతినిధి నూపూర్ చతుర్వేది తెలిపారు. 2025 అక్టోబర్‌లో ప్రారంభమైనప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ ట్రాఫిక్ పోలీస్ పరిధిలో 4.5 లక్షలకు పైగా ఇచలాన్ లావాదేవీలు నమోదయ్యాయని తెలిపారు. తెలంగాణ ట్రాఫిక్ పోలీస్ పరిధిలో 1.3 లక్షలకు పైగా లావాదేవీలు జరిగినట్లు చెప్పారు. 2026 ఫిబ్రవరి నెలలో మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో 1,02,096 లావాదేవీలు, తెలంగాణలో 22,882 లావాదేవీలు నమోదయ్యాయని వెల్లడించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలను సులభంగా గుర్తించి డిజిటల్‌గా చెల్లించే సౌకర్యం భారత్ కనెక్ట్ ద్వారా అందుబాటులోకి రావడంతో ఈ వృద్ధి కనిపిస్తోందన్నారు. ప్రధాన ట్రాఫిక్ కూడళ్ల వద్ద డ్రోన్ల ద్వారా ఇంటరాక్టివ్ స్క్రీన్‌లను ప్రదర్శిస్తూ ఈచలాన్ సేవపై ప్రచారం చేపట్టినట్లు వివరించారు. ఇప్పటివరకు చలాన్ చెల్లింపులు ఎక్కువగా నగదు రూపంలో లేదా పిఓఎస్ యంత్రాల ద్వారా, లేక రాష్ట్రాల వారీగా వేర్వేరు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా జరిగేవన్నారు. భారత్ కనెక్ట్‌ని ఈచలాన్ విభాగం ద్వారా ఒకే ప్రామాణికమైన, విశ్వసనీయమైన ప్లాట్‌ఫామ్‌లో చలాన్ వివరాలు తెలుసుకుని డిజిటల్‌గా చెల్లించే అవకాశం పౌరులకు లభిస్తోందన్నారు. ప్రస్తుతం 700కు పైగా భారత్ కనెక్ట్ యాప్‌లు, బ్యాంకులు, ఏజెంట్‌ల ద్వారా ఈ సేవ అందుబాటులో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇ–చలాన్ విభాగం పౌరులకు సౌలభ్యాన్ని పెంచడమే కాకుండా దేశవ్యాప్తంగా విస్తరించగల నమూనాగా మారే అవకాశముందని చెప్పారు.

## బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

### సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పౌరులు తమ సమస్యలను అధికారులకు ప్రత్యక్షంగా వివరించారు. ప్రజావాణిలో మొత్తం 24 ఫిర్యాదులు నమోదయ్యాయి. గడువులోగా సమస్యలను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగించాలని సిఎంసి కమిషనర్ సృజన అన్నారు. ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం సిఎంసి కమిషనర్ సృజన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన 24 ఫిర్యాదులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా, తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ పురోగతిపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి విభాగాధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగరాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ, రహదారుల సంరక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై చేపడుతున్న పనుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపడుతున్న పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో పారదర్శకత, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.

### ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సోమవారం ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతను బలోపేతం చేయడం తో పాటు మున్సిపల్ ఉద్యోగులు, ప్రజలకు తక్కువ ధరల్లో పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ఈ క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.



నగరంలో గ్రీన్ కవర్ పెంపుపై దృష్టి పెట్టాలి

నగరంలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. యుబిడి విభాగం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. పబ్లిక్ ప్రదేశాలు, రహదారి పరిసరాలు, ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా నగరంలో గ్రీన్ కవర్‌ను పెంచాలని సూచించారు. రోడ్ల వెంట, ఫ్లైఓవర్లు, వంతెనల క్రింద నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు మొక్కల నాటే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు.

# ఆరు రోజులు పారిశుద్ధ్యంపైనే దృష్టి

### జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రానున్న ఆరు రోజుల పాటు నగరంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం 18 మంది గ్రూప్–1 ట్రైనీ మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ట్రైనీ కమిషనర్లు ప్రతిరోజూ ఉదయం 5:30 గంటలకే ఫీల్డ్‌లో ఉండాలన్నారు. కేటాయించిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు, సూపర్ వైజర్లు, హాజరు వివరాలను నమోదు చేయాలని సూచించారు. అలాగే రాంకీ, సాట్ వాహనాల వినియోగాన్ని పర్యవేక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో గమనించిన అంశాలపై ప్రతిరోజూ ఒక పేజీ నివేదికను సమర్పించాలన్నారు. వచ్చే ఆరు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం వెబ్ ఎక్స్ ద్వారా ట్రైనీ కమిషనర్లతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ క్షేత్రస్థాయి అనుభవం భవిష్యత్తులో విధులను సమర్థవంతంగా నిర్వహించడానికి ట్రైనీ అధికారులకు ఎంతగానో తోడ్పడుతుందని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు మందా మకరంద్, ఎన్. రవికిరణ్ పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌డబ్ల్యుఎస్‌లో 1999వ సంవత్సరం నుండి 2 వేల మంది, 2018 నుండి మిషన్ భగీరథ స్కీమ్‌లో 14 వేల మంది పనిచేయుచున్నామని, ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయబోయే ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో ఉద్యోగులుగా గుర్తించాలని ఐఎన్‌టియుసి అనుబంధ ఆర్‌డబ్ల్యుఎస్ నేతలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారులు, రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, మిషన్ భగీరథ రాష్ట్ర అధ్యక్షులు తలారి రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి టి. చంద్రశేఖర్‌తో పాటు అనుబోతు బాలకృష్ణ, నూకల శ్రీను, నవీన్, సతీష్, విష్ణు, సర్వోత్తమ్, నరేష్, ఖాజా పీర్, ఉమాపతి, సాయిబాబా, పల్లా మసూద్ రెడ్డి, చావల మురళి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధితో పేదలకు లబ్ధి

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్:** సిఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ది చేకూరుతుందని అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని పవన్ పురి కాలనీలో నివాసం ఉండే దివ్యశ్రీ కడుపునొప్పికి సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి ఆర్థికస్థితులు బాగాలేక కుటుంబసభ్యులు ఎమ్మెల్యేను సంప్రదించారు. స్పందించిన సుదీర్‌రెడ్డి ఆపరేషన్‌కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేసి. వారికి రెండు లక్షల రూపాయలు ఎల్‌ఒసి చెక్కు మంజూరు చేయించి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సిఎం సహాయనిధి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో గండికోట శ్రీనాద్, మణి, యశ్వంత్, శివ, సాయి, తరుణ్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్‌లో పెట్టకుండా అర్జీల పరిష్కారం





### రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబందించిన 19, ఇతర శాఖలకు 80 చొప్పున మొత్తం 99 దరఖస్తులు అందాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

**శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం తనిఖీ...** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ చంద్రారెడ్డి రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డితో కలిసి శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కె.రవీందర్‌దత్ పాల్గొన్నారు.

# పక్కాగా ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక పనులు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక పనులను పక్కాగా అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లాలోని శంషాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి, మున్సిపల్ జోనల్ కమిషనర్ చంద్రకళ, రాజేందర్‌నగర్ ఆర్‌డిఒ బి.వెంకట్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. శంషాబాద్‌లోని మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌ను, బస్తి దవాఖాను కలెక్టర్ సందర్శించి ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. బస్తీ దవాఖానకు వచ్చే వారికి అందిస్తున్న వైద్యం వివరాలు, మందుల వివరాలు డాక్టర్లను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు నిర్వహించిన వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రతగా నిర్వహించాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో 99 రోజుల పాటు కార్యచరణ అమలు చేయాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలో ప్రజపాలన ప్రగతి ప్రణాళిక పనులు పక్కాగా అమలు చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతి కార్యాలయంలో అవసరమైన చోట మరమ్మత్తులు, పెయింటింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని, నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. రోజు వారీగా సేకరించిన తడి,పొడి చెత్తను సెగ్రిగేషన్ కేంద్రాలకు తరలించాలని, నీటి నిల్వలు లేకుండా, దోమలు పెరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
మంగళవారం
10-03-2026
www.prajapaksham.in

'జీఎంఎఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ అనే బ్యానర్‌లో శిరీష సమర్పణలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'అర్'. గోలి రామకృష్ణ దర్శక నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి గాలి బాల కిరణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో రానున్న ఈ చిత్రం సోమవారం పూజ కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది.'

రీల్

# హృదయాలకు హత్తుకునే ప్రేమగీతం 'సంచారమే'



'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' సినిమా నుంచి తొలి గీతంగా 'సంచారమే'అనే పాటను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ మనోహరమైన పాట ప్రేమికుల హృదయాలను హత్తుకునేలా ఉంది. ప్రఖ్యాత గీత రచయిత గోరేటి వెంకన్న రచించిన ఈ పాట స్వచ్ఛమైన తెలుగు కవిత్వంతో పాటు హృదయాన్ని తాకే భావాలతో ప్రత్యేకంగా నిలుస్తోంది. దేశీ మూలాలు, విదేశీ జీవితానికి మధ్య ఉన్న విరుద్ధ భావాలను సున్నితంగా ప్రతిబింబిస్తూ సినిమా కథనానికి అనుగుణంగా ఈ పాట సాగుతుంది. ఈ గీతానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతాన్ని సమకూర్చారు. ఆ కూర్పుకు మరింత గాఢతను జోడిస్తూ హేషమ్ అబ్దుల్ వహాబ్, గోరేటి వెంకన్న కలిసి పాటను ఆలపించారు. దృశ్యపరంగా ఈ పాట లండన్ లోని అద్భుతమైన దృశ్యాలను ప్రదర్శిస్తుంది. అంతర్జాతీయ ప్రకృతి దృశ్యాలను, తెలుగు స్వరాల మాధుర్యాన్ని మిళితం చేస్తూ ఎంతో ఆకర్షణీయంగా ఈ గీతముంది. బ్లాక్‌బస్టర్ బేబీ తర్వాత మళ్లీ కలిసి నటిస్తున్న ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జోడి తెరపై ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.'నైంటీన్ ' వెబ్ సిరీస్ తో అందరి మనసులు దోచుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. వెంకట్ ఉప్పుటూరి, వి.ఎం.ఆర్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'ను భావోద్వేగాలతో కూడిన మృదువైన ప్రేమకథగా నిర్మాతలు అభివర్ణించారు. యువ హృదయాల అమాయకత్వం, సంఘర్షణలు, మౌన భావాలను ప్రతిబింబించే సరికొత్త, మధురమైన ప్రేమకథకు ఈ చిత్రం అద్దం పడుతుందని నిర్మాత నాగవంశీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: అజీమ్ మహమ్మద్,కూర్పు: నవీన్ నూలి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఫణి కె వర్మ, సహ నిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి. వీఎంఆర్.

# 'లేచింది మహిళాలోకం' అందరినీ నవ్విస్తుంది



బృహస్పతి ఎంటర్‌టైన్‌మెంట్స్, అపార్చునిటీ సినిమా, స్టోరీ ఫ్యాక్టరీ బ్యానర్లపై బృహస్పతి రాజశేఖర్, శ్వేత మహా, నిరోష నవీన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'లేచింది మహిళాలోకం'. అర్జున్‌కార్తిక్ రూపొందించిన ఈ చిత్రంలో మంచు లక్ష్మి, శ్రీరామ్ చంద్ర, అనన్య నాగళ్ల, హరితేజ, హేమ, సుప్రీత, శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రలు పోషించారు. కొత్తగా పెళ్లయిన ఒక జంట మధ్య చిన్న చిన్న విషయాలతో విభేదాలు రావడం.. వాటికి ఆజ్యం పోసేలా పక్కింటివాళ్లు తమ మాటలతో పొల్యూట్ చేయడం ఈ క్రమంలో జరిగే పరిణామాలు ఒకవైపు థ్రిల్‌కు గురి చేస్తూనే మరోవైపు కడుపుబ్బా నవ్వించేలా ఈ సినిమాను తీర్చి దిద్దారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం మార్చి 26న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. సన్‌స్టూడియో యూఎఫ్ ఓ తో కలిసి ఈ సినిమాను రిలీజ్ చేయనున్నారు. సోమవారం ప్రసాద్ ల్యాబ్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నటి మంచు లక్ష్మి మాట్లాడుతూ మేము చిన్న సినిమా చేసినా అద్భుతమైన సినిమా చేశాం. నేను కామెడీ విషయంలో రెచ్చి పోయి చేశా. ఫ్లోలో చాలా మార్పులు చేశాం. సినిమాను సినిమాగానే చూడండి. సీరియస్ సబ్జెక్టును కామెడీగా చెప్తేనే వింటాం. ఆడవాళ్లు అందరూ చూస్తే చాలు. నిర్మాతలకు పెట్టిన డబ్బుల కంటే రెట్టింపు రావాలని కోరుకుంటున్నా. ఇంత మంచి మహిళలతో కలిసి సినిమా చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రమోషన్స్‌లో చూపించిన బ్లూ డ్రమ్‌కు మా సినిమాకు సంబంధం ఉండదు. 'లేచింది మహిళా లోకం' మర్డర్ చేయమని చెప్పే సినిమా కాదు. అందరినీ నవ్వించే చిత్రం. మార్చి 26న అందరూ తప్పకుండా చూడండి అని చెప్పారు.నటి హేమ మాట్లాడుతూ ఈ సినిమా అందరినీ కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది. చాలా రోజుల తర్వాత నాకు ఒక మంచి పాత్ర దొరికింది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది అని చెప్పారు. హీరోయిన్ అనన్య నాగళ్ల మాట్లాడుతూ ఒక మంచి కామెడీ ఫిల్మ్‌తో మీ ముందుకు వస్తున్నాం. కామెడీ సినిమాలకు ఎప్పుడూ మంచి ఆదరణ ఉంటుంది. నేను ఇప్పటి వరకు సీరియస్ రోల్స్ చేశా. ఫస్ట్ టైమ్ ఫుల్ కామెడీ మూవీ చేశా అని తెలిపారు.నిర్మాతలు మాట్లాడుతూ 'ఇండస్ట్రీ మాకు కొత్త. ఇక్కడ ఏం జరుగుతుందో ఎలా జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి నుంచి వచ్చాం. మొదటి ప్రయత్నం లోనే ఇంత మంచి సినిమా తీశాం. అందరూ మా సినిమాని థియేటర్స్‌లో చూసి ఆశీర్వదిస్తే ఇలాంటి మంచి సినిమాలు మరెన్నో మీ ముందుకు తీసుకొస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అర్జున్ కార్తిక్, ఏపీ, తెలంగాణ యూఎఫ్ఓ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ ,నటి హరితేజ , సింగర్, యాక్టర్ శ్రీరామ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శృతిరంజని, డీఓపీ: జాక్స్, ఎడిటర్: అనిల్, ఆర్ట్: జాన్సీ.

ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో మంచు లక్ష్మి

# 'ద బ్లాక్ గోల్డ్' పోస్టర్ విడుదల



హీరోయిన్ సంయుక్త ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ , హీరోయిన్‌సెంట్రిక్ పాన్‌ఇండియన్ యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్‌లో నటిస్తున్నారు. యోగేష్ కెఎంసి దర్శకత్వంలో హాస్య మూవీస్ బ్యానర్‌పై మాగంటి పిక్చర్స్‌తో కలిసి రాజేష్ దండా నిర్మిస్తున్నారు. 'ది బ్లాక్ గోల్డ్ సినిమా నుంచి పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో హీరోయిన్ సంయుక్త ప్రమాదకరమైన మైనింగ్ ప్రాంతం మధ్యలో నిలబడి కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కథలోని కఠినమైన పరిస్థితులను ప్రతిబింబించేలా ఆ మైనింగ్ బ్యాక్‌డ్రాప్‌ను చూపించారు.పోస్టర్‌లో సంయుక్త చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపించారు.బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అగ్నిప్రమాదాలు, బొగ్గు తో నిండిన రైలు మైనింగ్ ప్రాంతం గుండా దూసుకెళ్తున్న విజువల్స్ సినిమా భారీ యాక్షన్ స్థాయిని సూచిస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉంది. కేవలం చివరి షెడ్యూల్ మాత్రమే మిగిలి ఉంది. ఫ్రెష్ కథనం, ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలతో రూపొందుతున్న ఈ కమర్షియల్ యాక్షన్ డ్రామా 2026 సమ్మర్‌లో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.సంయుక్తతో పాటు ఈ చిత్రంలో మురళి శర్మ, రావు రమేష్, నాసర్, మనీష్ వాధ్వా, రాంకి, రవీంద్ర విజయ్, అడుకలం నరేన్, బివిఎస్ రవి, కృష్ణ చైతన్య, చంద్రిక రవినటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం సామ్ సిఎస్ స్వరపరిచారు. ఈ చిత్రంలో రెండు ప్రత్యేక పాటలు ఉంటాయి. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: సింధు మాగంటి, డిఒపి; ఎ వసంత్,ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, కథ సంభాషణలు: యోగేష్ ప్రసాద్ నాయుడు, యాక్షన్: రామ్ క్రిషన్, సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ పోపూరి.


# దర్శకుల సమస్యలు పరిష్కరిస్తా

తెలుగు సినిమా దర్శకుల సంఘంకు నూతన పాలకమండలి ఏర్పడింది. అధ్యక్షుడిగా మన సంతానువ్వే దర్శకుడు వి.ఎన్ ఆదిత్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దర్శకులు సముద్ర, ప్రభు, ఏస్.వి. భాస్కర్ రెడ్డి గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా పి. వి.రామారావు, కోశాధికారిగా సాయి రాజేష్ నీలం, ఉప కార్యదర్శులుగా చెరుకూరి బాలాజీ, ఎ.కృష్ణ మోహన్, కార్యనిర్వహక కార్యదర్శులుగా రాజా వన్నెంరెడ్డి, ఎ.సునీల్ గెలుపొందారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆళ్ల ఆకాష్ , కొలను శైలేష్ , గుంటూరు అంజిబాబు , తలాటం మల్లిక, సాగర్ చంద్ర, శ్రీరామ్ ఆదిత్య , ఎం. సాయి సురేంద్రబాబు, రమణ మొగిలి , కొండా విజయ్ కుమార్ విజయం సాధించారు. ఎన్నికలో విజయం సాధించిన అనంతరం ఫిలిం ఛాంబర్ ప్రాంగణంలో ఉన్న దివంగత దర్శకుడు డాక్టర్ దాసరి నారాయణ రావు విగ్రహానికి పూల మాల వేసి సభ్యులందరూ ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ దర్శకులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. సభ్యులకు మెడికల్ ఇన్సూరెన్స్ తో పాటు మరి కొన్ని సమస్యలు ఉన్నాయని, రెండేళ్లలో అన్ని సమస్యల పరిష్కారానికి పాలకమండలి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఫిలిం ఛాంబర్, నిర్మాతల మండలి, సినీ కార్మికుల ఫెడరేషన్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వంటి పరిశ్రమలో ఉన్న అన్ని సంఘాలతో కలసి కట్టుగా ముందుకు వెళ్తామని వి ఎన్ ఆదిత్య తెలిపారు. దాసరి నారాయణరావు కు నివాళి అర్పించిన వారిలో దర్శకులు ఎన్. శంకర్, మెహర్ రమేష్, కాశి విశ్వనాధ్ తదితరులు ఉన్నారు.



తెలుగు సినిమా దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆదిత్య

# మే 15న 'మా ఇంటి బంగారం'




సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దిగంత్, గుల్షన్ దేవయ్య ఇతర ప్రాతల్లో నటిస్తున్నారు. శ్రీముఖి, గౌతమి, ఆనంద్, లక్ష్మి , శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ బేబి వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత మరోసారి సమంత, నందిని రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని మే15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా ఇంటి బంగారం సినిమాను యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. యాక్షన్ డ్రామా మూవీ అందరికీ నచ్చేలా, అన్ని అంశాలతో రూపొందుతోంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను బలమైన భావోద్వేగాలతో పాటు ఉత్కంఠతను రేపే యాక్షన్ ఎలిమెంట్స్‌ను బ్యాలెన్స్ చేస్తూ డైరెక్టర్ నందిని రెడ్డి డైరెక్ట్ చేస్తున్నారు. చిత్ర యూనిట్ లేటెస్ట్‌గా సమంత ఉన్న కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఇది యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం సమంత శారీరకంగా సిద్ధమైన తీరుని హైలైట్ చేస్తోంది. రీసెంట్‌గా రిలీజైన టీజర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో ఈసారి సమంత ఎలా మెప్పించనుందోనని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాను సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాష్, స్టోరీ, స్క్రీన్‌ప్లే: రాజ్ నిడిమోరు, వసంత్ మారింగంటి, సీతా మీనన్, యాక్షన్: లీ విట్టాకెర్, ప్రొడక్షన్ డిజైన్: ఉల్లాస్ హైదర్,ఎడిటింగ్: ధర్మేంద్ర కాకరాల.

# విధానాలు వదులుకుంటారా... ఐక్య పోరాటాలు ఎదుర్కొంటారా?

**కేంద్ర ప్రభుత్వానికి 'రైతు- కార్మిక పార్లమెంట్' హెచ్చరిక**

**23న సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవంగా పాటించాలని పిలుపు**



**న్యూఢిల్లీ:**కార్పొరేట్, అమెరికా అనుకూల విధానాలను వదులుకోవాలని లేదా భారత దేశం అంతటా దీర్ఘకాలిక ఐక్య పోరాటాలను ఎదుర్కోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని 'రైతు– కార్మిక పార్లమెంట్' హెచ్చరించింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల బలిదాన దినోత్సవం జరిపే మార్చి 23న సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవంగా పాటించాలని పిలుపునిచ్చింది. నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా ఏప్రిల్ 1న ' అఖిల భారత బ్లాక్ డే'గా పాటించాలని, అన్ని రాష్ట్రాలలోని మహాపంచాయతీలు కార్పొరేట్ వ్యతిరేక ప్రజా పోరాటాలను ప్రకటించాలని విజ్ఞప్తి చేసింది. జిఎస్‌టి చట్ట సవరణ చేసి రాష్ట్రాల పన్ను అధికారాలను పునరుద్ధరించాలని, పన్నుల నిధి (సెస్, సర్‌ఛార్జ్‌లను కలుపుకొని) నుంచి రాష్ట్రాలకు 33 శాతానికి బదులుగా రాష్ట్రాలకు 60 శాతం వాటాను ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో సోమవారం కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చాలు 'రైతు–కార్మిక పార్లమెంట్'ను నిర్వహిచింది. కేంద్ర కార్మిక సంఘాల తరఫున అమర్‌జీత్ కౌర్ (ఎఐటియుసి), అశోక్ సింగ్ (ఐఎన్‌టియుసి), హెచ్.సి.త్యాగి(హెచ్‌ఎంఎస్), సుదీప్ దత్తా (సిఐటియు), రాజేందర్ సింగ్ (ఎఐయుటియుసి), లతా(సేవా), రాజీవ్ దిమ్రీ (ఎఐసిసిటియు), శత్రుజీత్(యుటియుసి), రైతు సంఘాల తరుపున రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య (ఎఐకెఎస్), కృష్ణ ప్రసాద్ (ఎఐకెఎస్), యుధ్‌వీర్ సింగ్ (బికెయు); హన్స్‌రాజ్ (ఎఐకెకెఎంఎస్), తదితరులు ప్రసంగించారు. కార్పొరేట్, అమెరికా అనుకూల విధానాలు, చట్టాలను విధించే నిరంకుశ చర్యలను వదులుకోవాలని లేదా దీర్ఘకాలిక పోరాటాలను ఎదుర్కోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. రైతులు, కార్మికుల కీలకమైన డిమాండ్లన్నీ సాధించేంత వరకు, దేశ వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే వరకు నిరంతరం, భారత దేశ వ్యాప్తంగా ఐక్య పోరాటాలు కొనసాగిస్తామని ప్రకటించింది. రైతులు, కార్మికులు భారీ పోరాటాలకు సిద్ధం కావాలని 'రైతు కార్మిక పార్లమెంట్' పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన హెచ్చరికగా ఫిబ్రవరి 12న అఖిల భారత సార్వత్రిక సమ్మెను అద్భుతంగా జయప్రదం చేసినందుకు శ్రామిక ప్రజలను అభినందించారు. అసమాన దోపిడీకి దారితీసే భారత–అమెరికా తాత్కాలిక వాణిజ్య చట్రాన్ని అంగీకరించడంలో, కార్పొరేట్ ప్రయోజనాలతో కలిసి పనిచేయడంలో అమెరికా ఒత్తిళ్లకు కేంద్ర ప్రభుత్వం సిగ్గుచేటుగా లొంగిపోవడాన్ని 'రైతు కార్మిక పార్లమెంట్'లో వక్తలు తీవ్రంగా ఖండించారు. ప్రపంచ శ్రామిక ప్రజలకు అమెరికా పాలన అతిపెద్ద శత్రువుగా వ్యవహరిస్తోందని, ప్రపంచ శాంతి కోసం అంతర్జాతీయ సంస్థాగత యంత్రాంగాలకు అతిపెద్ద ముప్పుగా ఉందని విమర్శించారు. వాణిజ్యంపై అమెరికా ఆదేశాలకు భారతదేశం లొంగడం మానేయాలని, ప్రపంచ శాంతి ప్రయోజనాల కోసం ఇరాన్ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం గల్ఫ్ దేశాలలోని భారతీయ శ్రామిక శక్తిని కాపాడాలని, రైతులకు లాభదాయకమైన ధరలను నిర్ధారించే విధంగా గల్ఫ్ దేశాలకు అన్ని వ్యవసాయ ఎగుమతులకు ప్రత్యేక పరిహారం అందించాలని కోరారు. 736 మంది అమరవీరుల ప్రాణాలను బలిగొన్న చారిత్రాత్మక రైతు పోరాటం నేపథ్యంలో2021 డిసెంబర్ 9న ఎస్‌కెఎంకు ఇచ్చిన లిఖితపూర్వక హామీలను కేంద్రం అమలు చేయకపోవడం పట్ల తీవ్రంగా ఖండించారు. 'రైతు–కార్మిక పార్లమెంట్'కు షహనాజ్ రఫీక్ (ఐఎన్‌టియుసి), ముఖేష్ కశ్యప్(ఎఐటియుసి), నారాయణ్ సింగ్ (హెచ్‌ఎంఎస్), ఎ.ఆర్.సింధు (సిఐటియు), ఆర్.కె.శర్మ (ఎఐయుటియుసి), లతా(సేవా) తదితరులు అధ్యక్షత వహించారు.

# జైశంకర్‌ది డొల్ల ప్రకటన

**సిపిఐ రాజ్యసభ పక్ష నేత సందోష్ కుమార్**



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలపై రాజ్యసభలో విదేశాంగ మంత్రి చేసిన ప్రకటన డొల్లగా, తప్పించుకునేలా ఉందని సిపిఐ రాజ్యసభ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ విమర్శించారు. ఇది గంభీరమైన దౌత్య అంచనాలాగా కాకుండా, ఒక సహాయకుడు పది నిమిషాలు ఇంటర్నెట్‌లోని గూగుల్ సెర్చ్‌లో సేకరించిన సాధారణ నోట్ లాగా ఉందని ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్‌లు దాడి, ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యతో ఆ ప్రాంతం అల్లకల్లోలంలోకి నెట్టబడిన తరుణంలో, భారత ప్రభుత్వం హత్య గురించి ప్రస్తావించకపోగా, కనీసం స్నేహపూర్వక సార్వభౌమ రాజ్య అధిపతి హత్యకు సంతాపం తెలియజేయడం గురించి కూడా పేర్కొనలేదన్నారు. 'చర్చలు, దౌత్యం' గురించి సుపరిచితమైన పదాలనే పార్లమెంటు వినాల్సి వచ్చిందని, విస్తరిస్తున్న సంఘర్షణ వెనుక ఉన్న ప్రధాన రాజకీయ వాస్తవికతను ప్రస్తావించలేదన్నారు. గల్ఫ్ ప్రాంతం అంతటా నివసిస్తున్న, పనిచేస్తున్న లక్షలాది మంది భారతీయుల సమస్యపై కూడా కేంద్ర విదేశాంగ మంత్రి ప్రకటనలో వాక్చాతుర్యాన్ని మించి ఏమీ లేదన్నారు. భారత దేశం ఆతిథ్యం ఇచ్చిన నావికా విన్యాసాల నుండి నౌక తిరిగి వెళ్తున్న ఇరాన్ నావికాదళ నౌక ఐరిస్ దేనాను హిందూ మహాసముద్రంలో అమెరికా జలాంతర్గామి మునిగిపోవడం గురించి ,అందులో నావికులు హత్యకు గురికావడాన్ని ప్రభుత్వం ఖండించడంలో కూడా విఫలమైందన్నారు.

## ఏకగ్రీవం (మొదటి పేజీ తరువాయి)

నామినేషన్ దాఖలు చేశారు. నిబంధన ప్రకారం పది మంది ఎంఎల్‌ఎల సంతకాలు లేకపోవడంతో నామినేషన్ల పరిశీలనలో సాయన్న నామినేషన్‌ను తిరస్కరించారు. దీంతో అభిషేక్ మను సింఘ్వీ, వేం.నరేందర్‌రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.రాజ్యసభ సభ్యునిగా తమకు అవకాశం కల్పించడం పట్ల అభిషేక్ సింఘ్వీ, నరేందర్‌రెడ్డి ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎఐసిసి అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్ రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ,ప్రతినిధులకు వారు కృతజ్ఞతలు చెప్పారు.మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం మండలం, అర్పనపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన వేం నరేందర్ రెడ్డికి రాజకీయాల్లో నాలుగు దశాబ్ధాలకు పైగా అనుభవం ఉన్నది. ఆయన 2004లో మహబూబాబాద్ ఎంఎల్‌ఎగా గెలుపొందారు. ఆ తర్వాత ఎంఎల్‌సి,ఎంఎల్‌ఎగా పోటీ చేసి ఓడిపోయారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి 'సిఎం సలహాదారుని' గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యునిగా నామినేషన్ దాఖలు చేసే క్రమంలో ఆయన సిఎం సలహాదారు పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అభిషేక్ మను సింఘ్వీ ఢిల్లీలో జన్మించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలైన కేంబ్రిడ్జ్, హార్వర్డ్ రెండు విశ్వవిద్యాలయాల్లో సింఘ్వీ విద్యనభ్యసించారు. వృత్తిరీత్యా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా స్థిరపడ్డారు. ప్రముఖ న్యాయవాదుల్లో ఆయన ఒకరు. సింఘ్వీ 2001 నుంచి ఎఐసిసి అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. రెండు దఫాలు రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. జాతీయ రాజకీయాల నేపథ్యంలో ఆయనకు తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎఐసిసి అవకాశాన్ని కల్పించింది.

## రూ.1.66 కోట్ల టోకరా (మొదటి పేజీ తరువాయి)

టార్గెట్ చేశారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో భారీగా దోచేశారు. సైబర్ మోసగాళ్లు వీడియో కాల్ చేసి తాము సిబిఐ అధికారులమని చెప్పి రిటైర్డ్ జడ్జిని భయపెట్టారు. మీపై విచారణ జరుగుతోందని, కేసు ముగిసే వరకు ఇంటి నుంచి బయటకు రావద్దని హెచ్చరిస్తూ డిజిటల్ అరెస్ట్ చేసినట్టు నటించారు. అంతేకాకుండా మీ ఆధార్‌కు లింక్ అయిన రెండు మొబైల్ నెంబర్లు మహిళలకు అభ్యంతరకర కాల్స్ చేస్తున్నాయని చెబుతూ మాజీ జడ్జిని భయభ్రాంతులకు గురిచేశారు. అదే సమయంలో ఇందిరానగర్‌లో మీపై కేసు నమోదు అయిందని చెప్పి మరింత ఒత్తిడి తీసుకొచ్చారు. మీపై మానవ అక్రమ రవాణా కేసు కూడా నమోదైందని, దీనిపై సుప్రీంకోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిందని కాల్ చేసి బెదిరింపులకు దిగారు. ఈ విషయాల గురించి కుటుంబ సభ్యులు లేదా స్నేహితులతో మాట్లాడకూడదని కూడా హెచ్చరించారు. దర్యాప్తు కోసం మీ బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చి, మీరు చెల్లించే మొత్తం విచారణ పూర్తయ్యాక తిరిగి ఇస్తామని నమ్మబలికారు. అరెస్టు అయితే ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందనే భయంతో రిటైర్డ్ జడ్జి మొత్తంగా రూ.1.66 కోట్లు సైబర్ మోసగాళ్ల ఖాతాలకు బదిలీ చేశారు. అయితే మోసగాళ్లు చెప్పినట్లుగా నగదు తిరిగి ఇవ్వకపోవడంతో మోసం జరిగినట్టు గ్రహించిన రిటైర్డ్ జడ్జి పోలీసులను ఆశ్రయించారు.

## అభిశంసన తీర్మానం? (మొదటి పేజీ తరువాయి)

నోటీసు తయారీ ప్రక్రియలో భాగమైన తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పార్టీ సీనియర్ ఎంపి ఒకరు వివరాలను పిటిఐ వార్తాసంస్థ వెల్లడించారు. భావసారూప్య పార్టీలన్నీ కలిసి సిఇసి అభిశంసన నోటీసు, ఇతర ప్రణాళికలన్నీ సిద్ధం చేస్తున్నాయని ఆయన చెప్పారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఈ నోటీసును ప్రవేశ పెట్టే విషయంలోనూ ఒక జట్టులా పనిచేయాలని విపక్షాలు నిర్ణయించాయని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) తాను ఆక్రమించిన గొప్ప స్థానాన్ని పూర్తిగా దిగజార్చారని, టిఎంసి నాయకుడు అన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ వర్గాలు ఈ నోటీసుకు మద్దతు ఇస్తామని తెలిపాయి. ఇతర భారత కూటమి పార్టీలు కూడా ఇందులో ఉన్నాయి, నోటీసును సమష్టిగా రూపొందించామని మరొక వర్గాలు తెలిపాయి. ప్రతిపక్ష ఎంపిలు ఇప్పుడు ఉభయ సభల నుండి ఎంపిల సంతకాలను సేకరించనున్నారు. నిబంధనల ప్రకారం, నోటీసు కోసం లోక్‌సభ నుండి కనీసం 100 మంది ఎంపిలు, రాజ్యసభ నుండి కనీసం 50 మంది ఎంపిల సంతకాలు చేయాల్సి ఉంటుంది. సిఇసిని తొలగించే ప్రక్రియ సుప్రీం కోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తిని తొలగించే ప్రక్రియ మాదిరిగానే ఉంటుంది. నిరూపితమైన దుష్ప్రవర్తన లేదా అసమర్థత కారణాలు మాత్రమే అభిశంసనకు దారితీస్తాయి. తొలగింపు ప్రతిపాదనను పార్లమెంటులోని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. ప్రత్యేక మెజారిటీతో సభలోని మొత్తం సభ్యత్వంలో మెజారిటీ, హాజరై ఓటు వేసే సభ్యులలో మూడింట రెండు వంతుల మెజారిటీతో ఆమోదించాలి.

## విజృంభణ (మొదటి పేజీ తరువాయి)

సమస్యచూస్తూ భయాందోళనలో కూరుకున్నాయి. ఇరాన్‌లో చమురు డిపోలపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసిన తర్వాత ఈ ధరలు మరింత పెరుగుతున్నాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డుల పహారాతో హోర్ముజ్ జలసంధి అంటే సుమారుగా రోజూ కోటీ 50 లక్షల బ్యారెళ్ళ ముడి చమురు ఇటునుండే రవాణా అవుతుంది. మార్గం మూసుకుపోవడంతో చమురు రవాణా పది రోజులుగా ఆగిపోయింది. ప్రపంచదేశాలకు 20 శాతం ఇంధన సరఫరాలు ఈ జలసంధి ద్వారానే నౌకల్లో రవాణా అవుతాయి. ఆసియాలోని చిన్న దేశాల్లో సంక్షోభం పొంచి ఉంది. ముఖ్యంగా సహజవాయువు కొరత పెరిగింది. అమెరికాలో కూడా సహజ వాయువు ధర ఫిబ్రవరిలో 2.89 డాలర్లు ఉండగా, మార్చి మొదటి రోజున 2.98 డాలర్లు, ఆ తర్వాత 3.45 డాలర్లు దాటి దూసుకుపోతోంది. ఆసియా దేశాలే హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చే చమురుపై నిత్యం ఆధారపడి ఉంటాయి. చైనాలోని ప్రపంచ అతిపెద్ద ముడిచమురు దిగుమతి సంస్థ కూడా 50 శాతం చమురును పశ్చిమాసియా నుండే తెచ్చుకుంటుంది. దక్షిణ కొరియా ఈ సంక్షోభానికి దగ్గరపడింది. దీంతో చమురు ధరలకు ప్రభుత్వం ఒక పరిమితి విధించింది. దక్షిణాసియా 70 శాతం ముడి చమురు, 20 శాతం సహజవాయువును పశ్చిమాసియా నుండే తెచ్చుకుంటుంది. జపాన్‌లో తగినన్ని నిల్వలు ఉన్నప్పటికీ ధరల సమస్య వచ్చింది. కానీ జపాన్ కూడా తన చమురు అవసరాల నిమిత్తం 95 శాతాన్ని పశ్చిమాసియా నుండే తెచ్చుకుంటుంది. హోర్ముజ్ నుండే జపాన్‌కు ముడిచమురు సరఫరా కావాల్సి ఉంది. సోమవారం చమురు ధరలు భారీగా పెరగడంతో మొదటి సెషన్‌లో జపాన్ నిక్కీ 225 ఇండెక్స్ ఎనిమిదీశాతం పైగా పతనమైంది. ముడి చమురు ధర భారీగాగా పెరిగిపోవడంతో ఆసియా మార్కెట్‌లో జెట్ ఫ్యూయల్ ధరలు కూడా అందనంత రికార్డుస్థాయిలో పెరిగాయి. ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని చమురు నిల్వల డిపోలపై ఇజ్రాయెల్ దాడులు చేయడం డోనాల్డ్ ట్రంప్‌కు సంకటంగా మారిందని, సమస్య వస్తోందని వార్తలు వెలువడ్డాయి.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com